చింతామణి.

మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

శ్లో॥ అనేకసంశయోచ్ఛేది పరోక్షార్థస్య దర్శకం।
సర్వస్య లోచనం శాస్త్రం యస్య నాస్త్యంధ ఏవ సః॥

సంపుటము. ౧.] రాజమహేంద్రవరము. [౮-౯. సంచికలు.
ఆగష్టు, సెప్టెంబరు, ౧౮౮౧సం॥

పీఠిక.

స్నేహితులారా!

నేనిపుడు మీకెల్ల వినిపింపఁబోవు పత్రిక కొన్నినాళ్లక్రిందటనే నేను వ్రాసి యుంటినిగాని యప్పటిలో సభలు లేకపోవుటఁజేసి ఇది నేఁడు చదువవలసెను. ఈ పత్రికను తెనుఁగుభాషలో వ్రాసినాఁడను. కావలసియుండు నేని దీనినె ఇంగ్లీషులోనికిఁ దర్జుమాచేసి యావలఁ బ్రచురము చేయఁజూతును. ఇప్పుడు ముచ్చటింపఁబోవు నంశము ప్రస్తుతమున ఆంధ్రభాష యేరీతిగానున్నదో యను విషయము. ఈయంశము పెక్కుమందిగూడి యాలోచించి సిద్ధాంతపఱుపఁ దగినదిగాని, ఎవ్వరైన నొక్క తనకుఁ దోచినట్లు జరిగింపవలసినది గాదనుట స్పష్టము. ఎప్పుడుగాని, భాషాప్రవర్తకుఁడుగాఁ దగుటకు ఒక్కనికి సాధ్యముగాదు. పండితులెందఱో కలిసి స్వైరవిహారిణియగు భాషయొక్క నడవడి చక్కపఱుచుట యుగయుగమునందును కర్తవ్యము. ఆపనినె యిప్పుడు ఆంధ్రభాషా విషయములోఁ బండిత సాహాయ్యముతో మధ్యాంధ్రరాజధానిలో నున్న మనము చేయఁదగి యున్నది. తరుణమునఁ దన్ను సంస్కరింపరేని, తాను చెడిపోవలసివచ్చెడునని మనయాంధ్రభాష వేనోళ్ల వగచుచుండ, దానిమొఱ్ఱ యాలింపకుండుట మనపండితులకేమి, వారియండనున్న మనకేమి, న్యాయముగాదుగదా.

కాలమాహాత్మ్యమునను భాషాభాగ్యమువలని, ఈదినాలలో ననేకవిషయములలో ననేకపుస్తకము లాంధ్రభాషాగ్రథితములు ప్రతిమాసము ముద్రాశాలలంజొచ్చి వెలువడుచున్నవి. మరియు, నచిరకాలములోనే అనుదినము నసంఖ్యాకములట్టివి ప్రచురింపఁబడవచ్చునని యూహింపఁదగికూడ నున్నది. ఇందులో వైదికగ్రంథము లేవో కొన్నితప్పఁ, దక్కినవన్నియు నన్యదేశభాషాసాంకర్య దోషమువల్లఁ దప్పించుకొన నేరనివై యున్నట్లు కానవచ్చుచున్నది. మరీమరీ, లౌకికప్రశంస లుచ్చరించెడు కములును వార్తాపత్రికలును బరభాషాపదములులేక, ముందొక్కడునైన వేయ

యు, నిలువలేకయు, మూలఁబడవలసినవై గూడ నున్నవి. ఇదిగాక, పురాతన కాలములో మనుష్యులెఱింగియుండని విషయము లనేకములిప్పుడు ప్రపంచమున సర్వదేశములలోఁ గ్రొత్తగాఁ గనుంగొనఁబడుచున్నవిగదా. అట్టి విషయములను మనభాషలోనికి దెచ్చి ప్రచురింపవలసినప్పుడును, నవీనశాస్త్రములనన్నిటిని ఆంధ్రీకరించి ప్రకటింపవలసినప్పుడును అప్రసిద్ధములగు పదములు కోటానకోట్లు నూతనముగా వ్యవహారములోనికిఁ దేవలసినవారమగుదుము. ఇట్టి నూతనపదములు స్వాభావికముగా భాషలోఁ జేరి, కలిసికొని పోవుచున్న యన్యదేశ్యములుగా నుండవలయునో, లేక క్రొత్తక్రొత్త విషయములను బోధించెడు సంస్కృతపదములను నవీనముగాఁ గల్పింపవలసెదనో, అన్నయంశము ముఖ్యముగాఁ బరిష్కరింపఁదగియున్నది. శాస్త్రములలోఁ గొన్ని మన ప్రాచీనులు లెస్సగ నెఱింగియుండినవే యిప్పుడు మనకు సులభముగా దొరకకుండ నున్నవి. అట్టి శాస్త్రములు తెలిఁగించునపుడు నూతనముగా సంస్కృత పదములు కూర్చుట మంచిదా, లేక, ఉత్పన్నములై దుర్లభములగు ప్రాచీన పుస్తకములు దొరకినంతదాఁక వేచియుండి, యందు మనపూర్వికులు ప్రయోగించియుండిన పదములనే మనమిపుడు వాడుకొనుట తగునా? ఇంతకు, అందాఁకను గనిపెట్టుకొనియుండఁగా, అప్పటికి, వానిలో, నిప్పుడు మనకుఁ గావలసిన పదము లుండునో ఉండవో చాలవఱకు నుండవనియే యెంచఁదగియున్నది. ఇటువంటియంశములో, యుక్తిప్రతియుక్తులతోడి వివాదమునకు అవకాశము లేదనుకొనక సావధానముగా వినుట కోరుచున్నాఁడను. మరియు, నీయంశమును విచారింప నాకుఁగలిగిన ప్రత్యేకమయి యవసరము మనసభికులలో మరియిద్దఱకుంగూడఁ గలిగియున్నది. ఆంగ్లోభాషాగ్ర తములగు పుస్తకములను ఆంధ్రీకరించునపుడు, వివేచనతోఁ బనిలేక, యెవరికిష్టము వచ్చినట్లు వారు తెనుఁగుమాటల నుపయోగించుచున్నయెడల, ఒక్కవేళ అట్టిమాటలు దుర్జ్ఞేయములయ్యేనా, లేక, అపార్థబోధకములయ్యేనా, ఇఁకమీఁదట రాఁబోవు పుస్తకములను జదువఁబోవువారెల్లరు ఈగ్రంథకర్తల యజ్ఞతవలనిఫలము లనుభవింప పాలుపడియుందురే కాక, స్వభాష సంస్కృతము కాకపోఁగా, స్వరూపనాశనము నుమాత్రము పొందనేకలదు. కాఁబట్టి, స్నేహితులారా, నా చెప్పఁబోవు నంశమును శ్రద్ధతో విని, మనభాషపై నభిమానముంచి, దానిని అనఁగా, ఆంధ్రభాషను, నిల రింపఁ బ్రయత్నింపవలయును.

ఆంధ్రము.

౧. ప్రకరణము—ప్రకృతస్థితి.

"దేశభాషలలో నెల్లఁ దెలుఁగు లెస్స." ఆముక్తమాల్యద.

మిత్రులారా! నేఁటిసభలో నేను మీకు మనదేశభాష యయిన ఆంధ్రము విషయమై రెండుమాటలు చెప్పఁబోవుచున్నాను. దత్తావధానులై వినఁగోరుచున్నాను. నేనుజెప్పఁబోవుచున్న యంశము మనకు మిక్కిలి ముఖ్యమయిన దయినప్పటికిని, జరిత్రములులేక యెప్పటిసంగతు లప్పుడె మఱచిపోయినటువంటి మనవారి చేతులలోఁబడి దానదాన బ్రదుకుచున్న యీ మనభాషను గుఱించిన యేసంగతియు మన మెఱుంగుట సులభము గాదు.

ఆంధ్రమనుపేరు మనభాషకేలకలిగెనో తెలియుటకుఁ జీమకాలంతైన ఆధారము కానఁపింపదు. నిశ్చయముగా నీపేరు మనభాషకు నుత్తరదేశమునుండివచ్చిన యార్యు లిచ్చియుందురుగాని, అప్పటి యీదేశస్థులలో వాడుకయయి యుండదు. ప్రాఁగి యుత్తరమున మగధదేశములో ఆంధ్రులని యొకవంశమువారు కొన్నివందల సంవత్సరము లు పరిపాలించి యున్నట్లు కానవచ్చుచున్నది కాని, యాయంధ్రులకును మనదేశమునకును గల సంబంధములు తేటపడవు. కాశీదేశములోని యార్యులు తమకు దక్షిణమయిన మగధరాజు లాంధ్రులుగనుకఁ, దరువాతఁ జాలయేండ్లకు త్రోవ బాధపడలేక తాము మనదేశమునకు వచ్చినప్పుడు, ఇచ్చటివారిలోఁ బోలిక లేమైనఁ గనిపెట్టిరో, లేక, దక్షిణదేశజులన్న హేతుమాత్రముననో యీదేశమున కంధ్రదేశమని పేరుపెట్టి యుండవచ్చును. కొందఱిమతమునఁ బూర్వము కలకత్తా మొదలుగాని వంగవోలువఱకు నంధ్రమని పేరుక్రిందఁ జెల్లెననియఁట. ఆంధ్రమనుపదము రూఢము కావుటఁ జేసి వ్యుత్పత్తిచేత సాధింపనుగూడ వీలుకనుపింపదు. ఏదియెట్లున్నను జనులమనస్సులలోను, బుస్తకములలోను, వేరు బారుగదిగి నాటుకొన్న యీపేరును మనమిపుడు తుడిచివేయుట యసాధ్యము. కాఁబట్టి కృష్ణాగోదావరీ నదులయొక్క యుభయతటములను వ్యాప్తమగుదేశము ఆంధ్రదేశ మనవొప్పను. తరువాతను, చుట్టుపట్ల దేశములకు నిందలివారే కొందఱు పోయి కాపురములు చేయఁగా, నీదేశము మధ్యాంధ్రదేశమయ్యెను. ఆంధ్రదేశస్థులే యాంధ్రులైరి. వారిభాషయు నాంధ్రభాషయనఁబడు. ఇట్లే ద్రవిడదేశజులు ద్రావిడులయిరి. ఈదేశమునను నిప్పుడు కాఁపురములుచేయు వైష్ణవులలో నీయాంధ్రద్రావిడ సంప్రదాయములు స్పష్టములు.

...ములువెలుదొర ఆంధ్రాది దక్షిణ దేశభాషలకు ద్రావిడ...

భాషలను పేరుపెట్టుట యెంతయు నొప్పకయున్నది. కాని, ఘూర్జర మహారాష్ట్ర భాషలుగూడఁ జేరినయెడలఁ బంచద్రావిడభాష లనవచ్చును.

ఆంధ్రదేశమునకే త్రైలింగ్యమని త్రిలింగదేశమని నూఱేండ్లక్రిందట నొ నామము కలిగెను. నన్నయభట్టు తనపుస్తకములో నీపేరువాడుటయే అప్పటికి యుద్భవించినదనుటకుఁ దగినఋజువుగా నెంచవలసియున్నది. మరి, యప్పకవియిచ్చిన వ్యుత్పత్తియే యథార్థమయినయెడల దానివల్లఁగూడ నన్నయభట్టు భారతము వ్రాయ నారంభింపకమునుపే యీదేశమున కీపేరు కల్గియుండవలెనని తోఁచుచున్నది. లేక, నన్నయభట్టు సంస్కృత కావ్యనాటకములలోఁ గూడ వాడఁబడ్డప్పటికి ఆంధ్రశబ్దముమీఁది పాక్షికబుద్ధిలేక రెండవదానినిగూడ వాడినాఁడని చెప్పవలయును. త్రిలింగదేశమనగా మూఁడు లింగము (శైవక్షేత్రము)ల మధ్యనున్న దేశము. ఆ మూఁడులింగములును, శ్రీశైల, కాళహస్తి, ద్రాక్షారామ,లింగములని యతఁడు చెప్పటకుఁ దగుహేతువు కానుపింపదు. తక్కిన కొన్నిటివలెనే యిదిగూడ నాతనియూహించినదై యుండనోవును. త్రిలింగదేశమునకు రాజధానులై యుండిన ఓరుగల్లు విజయనగరము, (ఆనేగొంది) అనుపట్టణములు ఈ త్రిలింగమధ్యమున నున్నట్లుగూ స్పష్టములేదు. అయితే, మొట్టమొదట నీపేరుకల్గునప్పుడు త్రిలింగదేశము కొద్దిపాటిదయియుండి తరువాతఁ బ్రబలియుండునేమోయనిగూడ నూహింపఁదగ్గది. దీనివిషయమయి యన్యదేశీయులు భిన్నభిన్నాభిప్రాయులై యున్నట్లు కనిపించుచున్నది. ఒక్కఁడు కళింగమనుమాట క్లుప్తమయి క్లింగమయ్యెననియు, నిదియే తరువాత త్రిలింగముకాఁగా సంస్కృత భాషకనువగునట్లు దీనినే త్రిలింగమని పండితులు వ్రాసికొని దీనికి వ్యుత్పత్తి కల్పించుకొనిరనియు, నభిప్రాయపడెను. కకారతకారవినిమయము (...ఋప్ప) ఆతతాయివల్లఁబుట్టిన 'ఆకతాయ'లోఁ గానవచ్చుచున్నదిగదా. మరియొక్కనియభిప్రాయప్రకారము కొన్నిచోట్ల 'మోడోలింగ'మనిగూడ నన్యదేశజులు వాయుండుటచేత మూఁడుకళింగములు గలది, అనఁగా సంస్కృతములోఁ జెప్పనపుడు 'త్రికళింగము'అని యుండఁగా దానినే త్రిక్లింగముచేసి, పిదప సంక్లుప్తముగా 'త్రిలింగము'అని యేర్పడియుండవచ్చు. ఈయభిప్రాయములు రెండిఁటిలోను అప్పకవి చెప్పినదానికి విరుద్ధమయిన వ్యుత్పత్తియే కాన్పించుచున్నది. ఏనుఁగులకుఁ బ్రసిద్ధికెక్కిన కళింగదేశములలో మహేంద్రపర్వతమున్నట్లు కాళిదాసు రఘువంశము చెప్పుచున్నది. కాఁబట్టి మహేంద్రపర్వత సమీపమగు విజయనగరము మొదలుకొని కృష్ణాతీర పర్యంతము కళింగదేశభాగమేయగుటస్పష్టము. మగధదేశమునకు లోఁబడియున్న మూఁడుకళింగములలో దక్షిణకళింగమే యీదేశము, కనుక 'త్రిలింగము' అనఁగా త్రికలింగము అనుమాటకు 'తృతీయకళింగ'మని యర్థముచేసికోవలసినదగును. స్వబుద్ధికల్పితమయినను దేవతాసంబంధము కలిగియున్నది...

...రిలో అప్పకవి చెప్పిన వ్యుత్పత్తియందే ప్రపత్తి విస్తారముగలదు. అంతమునించినది గా తెలింగియనుండరు. ఏమూలముచేతనయిననేమి త్రిలింగమను పేరు మనదేశము ... బూర్వముకలదని యుభయులును సమ్మతించినారు. 'త్రిలింగము' మీఁదనే ...లుంగు' అను రూపము పుట్టి, పిమ్మట బిందువు నర్ధింపఁగా 'తెలుఁగు' అయ్యెను. ...రంగము' అను సంస్కృతపదము చెడి 'తలుఁగ, తలుంగము' అని యగుటయు నిటువం టిదే. ఈ వ్యుత్పత్తికి బిందుదర్శనమే బాహాటమయిన ఋజువుగా నెన్నవలసియున్నది. తెలుఁగునాటి (తెలఁగాణ్యులు) వారు, తెలఁగలు—దీనివలని రూపములె. మనభాషకు నీరెండుపేర్లుకాక తెనుఁగు (తెనుంగు) అని యింకొకపేరున్నది. వ్యుత్పత్తిలోఁగూడ నీమాటకును తెలుఁగు (తెలుఁగు) అను దానికిని భేదములేనట్లు రెంటిని వినఁగానే కనఁగానే తెలియఁబడుచున్నది. ఉచ్చారణములో లకారనకార వినిమయము నీది ...నములలోఁ గ్రిందిజాతులవాండ్రలోఁ దఱుచుగా వినుచున్నపుడు, పూర్వపుకాలము లోని నాగరికులుకాని యీదేశస్థులు 'తెలుఁగు' అనుచు తెనుఁగనికూడ దానినే వాడి యుందురని మనమూహించుటకు హేతువులేదే? రూపములోఁ జూచితిమా రెండుపద ...ములయందును బూర్ణార్థబిందువులు గలవు. ఇంతదగ్గఱపోలికగల వీని నొకటితో నొకటి సంబంధములేనివానినిగా భావించుటకంటె విరుద్ధమింకొకటి యుండదు. కొందఱేమొ, తెనుఁగు శబ్దము తేనెఅనుమాటతోఁ గలిసియున్నదందురఁట. వారిత లంపు మనభాషకు దానిమాధుర్యమును బట్టి—పలుకుందేనియలను జేసి, యీపేరు కలి గెనని కాఁబోలును. దక్షిణదేశభాషలలోనెల్ల మనయాంధ్రము మాధుర్యనిరంధ్రమ నుటకు సందేహములేదు. అట్టి దాని గుణమును దేశదేశముల నాచంద్రార్కముగా నిలుపఁ బెట్టి యభిప్రాయము మంచిదేకాని యీవ్యుత్పత్తిమాత్రము యథార్థమై నదికాదని నేను జెప్పవలసివచ్చినందులకు విచారించుచున్నాను. ఇదిగాక ద్రవిడదేశ ములోఁ గాపురములుచేయుచున్న యాంధ్రులను దద్దేశస్థులు 'వడగులు' అని పిలుచు ... ఉత్తరాదివారు అని వివేచనకొఱకే కాని మఱియొకందునకుఁ గాదు. మనదేశము లోని కోనసీమలోనున్న ద్రావిడులకీపేరు కలిగినదిటువంటి హేతువుచేతనే. కాని పంచద్రావిడులు' అనుదాని పరిగణములోఁ గొందఱాంధ్రులను జేరుచున్నట్లు కాన వచ్చుచున్నది. ఈభాషను "జెంటూ" భాషయని పోర్తుగలువారు పిలుచుటకు హేతు వుచాలదు.

పయినఁజెప్పిన చొప్పునఁ, దొల్లింటికాలములో 'ఆంధ్రదేశము' అను పేరు కృష్ణాగోదావరీతీర భూమికే చెల్లుచువచ్చినను, రాఁగా రాఁగా, నాంధ్రరాజులు దిగ్వి జయమందిచుట్టుపట్లనున్న దేశములలోఁగూడఁ దామే కాపురములు చేయసమకట్టిరి. కావున, ఆంధ్రదేశముయొక్క దైర్ఘ్యవైశాల్యము లెచ్చెను. పురాతనకాలములో మనరాజమహేంద్రవరమె యాంధ్రదేశ రాజధానిగా నున్నను, దరువాత ఓలుగల్లు-

బీజియనగరములు రాజధానులయ్యెను. అనగా ఆంధ్రదేశము కృష్ణానదికి దక్షిణమున విస్తారము వ్యాపింపఁజొచ్చెను. మహమ్మదీయ ప్రభుత్వములు వచ్చినపిదప అందులో మరి కలుబర్గ సంస్థాన మేర్పడినతరువాతను, మన త్రిలింగదేశము నిక్కి బాధలకు లోనయి జనులు నలిగిపోయి, యిండ్లువాకిండ్లు వదలి దక్షిణమునకును బడమటికిని బాఱిపోయి కొంతకాలమున కాదేశములలోనే ప్రాంతకాపులై యుండి ఆంధ్రదేశమీవిధముగాఁ బెరిగినది. సరే, తమయిండ్లువదలి వలసపోయినవారుతమ మాటలలో నేమయిన మార్పుపూనిరాయనుమాట విచారింపవలెను. అచ్ఛమయిన యాంధ్రమున మాటలాడు నొక్క కుటుంబమువారు ద్రవిడదేశ సమీపగ్రామములకు వెళ్లి కాపురము చేయుచున్నారనుకొందము. కొద్దిదినములలోనె వారిమాటలలోఅరవ యాస పట్టియుండునే? అచ్చటియరవము వీరునేర్చుకొని యందులో మాటలాడుటయకాక, స్వభాషాభిమానముపోక, తెనుఁగులోనె మాటలాడుచురాఁగా, వారితెలుఁగుమాటలలోఁ దప్పక యరవమాటలుకొన్ని దూరునని చెప్పట యొక్క వింతలోనిదిగాదు. ఇట్టివారిభాష యాంధ్రభాషయేయని పిలువఁబడినప్పటికిని, మధ్యాంధ్రభాషకంటెఁ జాలవ్యత్యాసపడి, కొన్నిసమయములలో వేఱైనభాషవలెఁగూడఁ గనుపించును. ఇట్టిదే పడమటిదేశములయందలి కన్నడపుతెలుఁగుభాష, తురకలుదొలయి శ్రుతిస్మృతుల నాదరింపకపోఁగానే వెడలి లేచిపోయినవారు పోయిరి. మిగిలిన వారు త్రిలింగదేశమున నిలిచి యెట్లెట్లో కాలముగడిపిరి. ఇందుచేతనే యాంధ్రమున మాటలాడువారందఱు నొక్క పోగుగాఁగానుపింపరు. తెలుఁగుదేశము దక్షిణమునఁ జదరంగపట్టణము మొదలుకొని యుత్తరమున (పెద్ద) శ్రీకాకుళమువరకు వ్యాపించి యున్నది. పడమట మహారాష్ట్ర మహీసూరుదేశములే సరిహద్దులుగాఁగా నీనడుమ యావద్దేశము తెలుఁగుదేశమే. ఇంకను నాగపురము ఆవైపులను, కొన్నియరవదేశములలోను, దెనుఁగుమాటలాడుజనులుకలరు. కాశికాపట్టణమునఁగూడ ఆంధ్రులకు ప్రత్యేకముగా నొక్క వీధియున్నట్లు వింటిమి. చెన్నపట్టణము ఆవైపుల వాడుకఁనున్న తెలుఁగు మనతెలుఁగుతో నేమాత్రమును సంబంధింపక యదియొక్క భాష వినవచ్చుచున్నది. పడమటితెనుఁగు కడపఆవైపులలో వాడుకలోనున్నది, విశేషస్థలతో వికారముగా నున్నప్పటికిని గ్రామ్యములు మెండులేక యుండును. మ అందులోఁ గన్నడపుఁబోలికలు చివరకు నుచ్చారణములోనైనఁ బట్టుపడకపోవు. ద ణాంధ్రదేశస్థులు ద్రవిడపదములుకలిపినతెలుఁగు వాడుదురు. ఉత్తరాంధ్రులు ఓఢ్రోచ్చారణములతో మాటలాడుదురు

పశ్చిమదక్షిణములయందు వాడఁబడు మాటలు ఆంధ్రభేదములుగానెంచి వ మధ్యాంధ్రమునుగుఱించివిచారింతము. ఇరుగుపొరుగుల నన్యహిందూభాషలు లేమిం నితత్సంపర్కము లేకయుండెనన్నమాట యొక్కటే కాని మనయాంధ్రభాష సర్వవి

ములచేత స్వచ్ఛమని చెప్పటకు వల్లపడదు. రాజ్యము తురకలపాలయినప్పుడు క్రొత్త రాజులతోఁగూడ వారిభాషరాలేదే! అది హేయమని యెంచి యసహించుకొనువారులేచిపోయిరి మిగిలినవారు కాలక్రమేణ ఆనూతనభాషను రాజభాషగదాయని గ్రహించి నేర్చుకొని మరే మెప్పులువడసిరి. క్రొత్తరాజులతో దేశమునకువచ్చిన క్రొత్త వింతలకన్నిటికిని తెనుఁగులో మాటలులేక పరాయిమాటలనే వాడఁజొచ్చిరి. అది తప్ప మరియొక్కపద్ధతి లేనప్పుడు దానిని సముంజసమని స్వీకరించుటకంటె వేరేసదుపాయము లేదుగదా. ఇందుమూలమున మన తెలుఁగులోఁ దక్కినవానిలోకంటె నెక్కువగాఁ దురకమాటలు చేరుటగలిగె. ఈతురకమాటలు చాలఁగాలము వాడుకలోనుండి, యిప్పుడు దేశీయములవలెఁ బలుకఁబడుటేకాక తమరాకకుఁ బూర్వము వాడుకలోనుండిన పెక్కుమాటలనుసమయించి మూలఁబడవైచినవి. అట్లుమూలఁబడిన తెలుఁగుమాటల నిపుడు వాడుకలోనికిఁ దిరిగితెచ్చుట మేలో లేక చిరకాలమునుండి వ్యవహారములోనుండి యాంధ్రభాషీయములుగా మారినపదములను ద్రోచివేయక భాషలోనిలువుదలచేయుట మేలో యీక్రిందిపట్టికవల్లఁ దెలియఁబడఁగలదు. కొన్నిచోట్ల మొదటి తెలుఁగుమాటలుకూడ నిప్పుడు వాడఁబడుచున్నప్పటికిని దురకమాట క్లుప్తముగాను, విశేషార్థబోధకముగాను గానుపింపకపోదు.

అన్యదేశీయము	మాతృభాషారూపము.	తత్తుల్యాంధ్రభాషాపదము.
అంగరకా—	ఆంగర్ఖా—	నిలువుచొక్కా.
అవ్వాయి—	హవాయ్—	ఆకాశబాణము.
ఉమేదువారు—	ఉమ్మేద్వార్—	ఉద్యోగమునుగోరువాఁడు.
కచ్చేరి— / కచేరి—	కచ్హరి—	కొలువుకూటము.
కర్చు—	ఖర్చు—	వ్రయము-సెలవు. (అరవతెనుఁగు)
కలము—	ఖలమ్—	లేఖిని!
కాకితము—	కాఘిజ్—	కాకలము!
కాయిలా—	ఖాయ్లా—	రుగ్మత.
కిటికీ—	ఖిర్కి—	గవాక్షము.
కురిచీ—	ఖుర్సి—	చతుష్పాత్పీఠము?
కులాసా—	ఖులాసా—	నిశ్చింతత.
కేపు—	ఖేప్—	ఓడమాలి.
కైలు—	ఖైల్—	కోఁతకుప్పలలెక్క.

గడవంచి—	ఘరోంచ్—	నాల్గుకాళ్లబల్ల.
గోదు—	గోంద్—	బంక.
చందా—	చందా—	భాగము?
చాందిని—	చాంద్‌ని—	మేలుకట్టు.
జామపండు—	జామ్—	గొయ్యాపండు.
చీటి—	చీట్ఠీ—	చిన్నయుత్తరము.
చుక్కాని—	సుక్కాన్—	పడవకుదిక్కుచూపుసాధనము.
జేబు—	జేబ్—	చొక్కా.
జోక్యము—	జోక్షన్—	అపాయము.
చౌదరి—	చౌద్రి—	పెద్దవాడు.
టప్పా—	తప్పాల్—	అంచె.
టోపి—	టోఫ్—	కుళ్ళాయి?
తంటా—	తంటా—	సంకటము.?
దామాషా—	దామాశాహి—	.........?
దివాలా—	దివాలా—	.........?
తుపాను—	తుఫాన్—	గాలివాన.
దేవిడీ—	దియోఁరీ—	కోటవాకిలి.
తోటా—	తోటా—	తోలు, (మందు)పొట్లము.
నగారా—	నక్వారా—	చర్మవాద్యము.
నాడా—	నారా—	నేతపట్టా.
నిశానీ—	నిషాన్—	జెండాగుర్తు-చేవ్రాలు.
పంకా—	పంఖా—	విసరుయంత్రము.
బాకీ—	బాక్వీ—	అప్పు?
బిబ్బీ—	బీబీ—	తురకసాని.
బురుజు—	బుర్జ్—	చిన్నకోట.
పేట—	పెత్—	శాఖానగరము.
పైలుమాను—	పహెల్‌వాన్—	జెట్టివాడు.
బోయీ—	బోయ్—	వాహకుఁడు.
పౌజు—	పౌజ్—	దండు?
మజిలీ—	మన్‌జిల్—	.........?
మామూలు—	మామూల్—	వాడుక.
మిటాయి—	మిఠాయ్—	బెల్లపుపంటకము.

శ్లో॥ బ్రాహ్మణాజంగమంతీర్థం తీర్థభూతాహిసాధవః।
తేషాంవాక్యోదకేనైవ శుధ్యంతిమలినాజనాః॥ ౬౧॥

౬౧॥. బ్రాహ్మణులు సంచరించునట్టి పుణ్యనదియనబడుదురు. పరిశుద్ధులగు సుజనులవాక్యముచేతనే పాపులు నిర్మలులగుదురు.

శ్లో॥ బ్రాహ్మణాయానిభాషంతె మన్యంతే తానిదేవతాః।
సర్వదేవమయోవిప్రో నతద్వచనమన్యథా॥ ౬౨॥

౬౨॥. వేదవేత్తలాడిన వాక్యముల దేవతలంగీకరింతురు. బ్రాహ్మణుడు సకలదేవతాస్వరూపుడు. అతనివాక్యము వేరువిధమున కాదు.

శ్లో॥ ఉపవాసోవ్రతంచైవ స్నానంతీర్థంజపస్తపః।
విప్రసంపాదితంయస్య సంపూర్ణంతస్యతత్ఫలమ్॥ ౬౩॥

౬౩॥. బ్రాహ్మణుల యంగీకారముతో గూడిన యుపవాసము, వ్రతము, స్నానము, తీర్థము, మంత్రానుష్ఠానము, తపస్సును, సంపూర్ణముగ లాభముం గలిగించును.

శ్లో॥ అన్నాద్యేకీటసంయుక్తే మక్షికాకేశదూషితే।
తదంతరాస్పృశేచ్చాప స్తదన్నం భస్మనాస్పృశేత్॥ ౬౪॥

౬౪॥. పక్వమగు నన్నమును, పురుగు, ఈగ, వెండ్రుక, తాకినవాయన్నమునడుమ నీళ్లు నించుక భస్మమును చల్లవలయును.

శ్లో॥ భుంజానశ్చైవయోవిప్రః పాదంహస్తేనసంస్పృశేత్।
స్వముచ్ఛిష్టమసౌభుంక్తే యోభుంక్తేభిన్నభాజనే॥ ౬౫॥

౬౫॥. ఏబ్రాహ్మణుడు భోజనముచేయుచు నెడమచేత కాలుతాకునో వాడు తన యెంగిలితిన్న పాపముజెందును. ఎడమచేతితో పాత్రమును పట్టియుండక భుజించినను నాపాపమె కలుగును.

శ్లో॥ పాదుకస్థోనభుంజీత పర్యంకస్థఃస్థితోపివా।
శ్వానచండాలదృక్చైవ భోజనంపరివర్జయేత్॥ ౬౬॥

౬౬॥. పాదరక్షలు తొడిగికొని, మంచముపయిగూర్చుండి, నిలుచుండియు భుజింపవలదు. భోజనముచేయుచున్నపుడు కుక్కను మాలవానిని జూచినను భుజింపరాదు.

శ్లో॥ యదన్నంప్రతిషిద్ధంస్యా దన్నశుద్ధిస్తథైవచ।
యథాపరాశరేణోక్తం తథైవాహంవదామివః॥ ౬౭॥

౬౭॥. ఏయన్నముతినగూడదో, అన్నమెట్లుశుద్ధిజెందునో అదియంతయు పరాశరుడు చెప్పినట్లు మీకుదెలుపుదును.

శ్లో॥ శ్రితంద్రోణాఢకస్యాన్నం కాకశ్వానోపఘాతితమ్।
కేనేదంశుధ్యతేచాన్నం బ్రాహ్మణేభ్యోనివేదయేత్॥ ౬౮॥

౬౮॥. ద్రోణముగాని యాఢకముగాని బియ్యముపెట్టి వండిన యన్నము కుక్క

న్మైన కాకియయిన యెంగిలిచేసిన తానుపండితుడయిన నీయన్నమెట్లు శుద్ధిజెందునని యడుగవలయును.

శ్లో॥ కాకశ్వానావలీఢంతు ద్రోణాన్నం నపరిత్యజేత్॥ ౧౯

౧౯. వారునిరూపించినట్లు శుద్ధిచేయవలెనుగాని యంతయన్నము విడువరాదు.

శ్లో॥ వేదవేదాంగవిద్విప్రై ర్ధర్మశాస్త్రానుపాలకైః।
ప్రస్థద్వాత్రింశతిర్ద్రోణః స్మృతోద్విప్రస్థఆఢకః॥ ౨౦

శ్లో॥ తతోద్రోణాఢకస్యాన్నం శ్రుతిస్మృతివిదోవిదుః॥ ౨౦॥

౨౦-౨౦॥. వేదమును,వానియంగములనెఱింగి ధర్మశాస్త్రమును పాలించునట్టిబ్రాహ్మణులు ముప్పదిరెండుకుంచములు ద్రోణమనియు రెండుకుంచము లాఢకమనియు నిర్ణయించిరి. వేదములు ధర్మశాస్త్రములు నెఱింగినవారీపరిమాణముగల ద్రోణముయిన నాఢకమయిన బియ్యముతోవండినయన్నమె పరిశుద్ధిచెందునని తలంపుదురు.

శ్లో॥ కాకశ్వానావలీఢంతు గవాఘ్రాతంఖరేణవా।
స్వల్పమన్నంత్యజేద్విప్ర శ్శుద్ధిర్ద్రోణాఢకేభవేత్॥ ౨౧॥

౨౧॥. బ్రాహ్మణుడు, స్వల్పమయినయన్నము, కాకులయిన కుక్కలయిన నెంగిలిచేసినను, గోవుగాని గాడిదెగాని మూర్కొన్నను పారవేయునది. ధనికునియొక్క ద్రోణపరిమితమును పేదవానియొక్కయాఢకపరిమితమునగునన్నముశుద్ధిచేయతగును.

శ్లో॥ అన్నస్యోద్ధృత్యతన్మాత్రం యచ్చలాలాహతంభవేత్।
సువర్ణోదక మభ్యుక్ష్య హుతాశే నోపతాపయేత్॥ ౨౨॥

౨౨॥. తాకినదియు, చొంగతగిలినదియు నగు నన్నమంతయు తీసివేసి బంగారముతోగూడిన యుదకముచల్లి యగ్నిచేకాచవలయును.

శ్లో॥ హుతాశనేనసంస్పృష్టం సువర్ణసలిలేనచ।
విప్రాణాంబ్రహ్మఘోషేణ భోజ్యంభవతితత్క్షణాత్॥ ౨౩॥

౨౩॥. ఇట్లాయన్న,మగ్ని,బంగారునీరు, విప్రుల వేదనాదముచేతను తత్క్షణము భుజింపతగినది యగును.

శ్లో॥ స్నేహోవాగోరసేవాపి తత్రశుద్ధిః కథంభవేత్।
అల్పంపరిత్యజేత్తత్ర స్నేహస్యపచనేనచ॥ ౨౪॥
అనలజ్వాలయాశుద్ధి ర్గోరసస్య విధీయతే॥ ౨౫

౨౪॥-౨౫. నేయి, యావుపాలు, వీనినికుక్కలుమొదలయినవెంగిలిచేసిన కొంచెమయినవిడువవలయును. అధికమయిన నేయికాచుటచేతను, పాలు అగ్నిమంటచుట్టును త్రిప్పుటచేతను శుద్ధములగును.

ఆరవఅధ్యాయము సంపూర్ణము.

‘‘బురుజులమీఁద నిష్ఠురతరా యోధనసాధన సామగ్రిపాదుకొల్పి’’
‘‘బిరుదువస్త్రా’దులఁ బేర్వేరనాడాడ ‘ముస్తాదు’గానిల్వఁ గుస్తరించి’’
రంగారాయచరిత్రము.

‘‘ఏలారాఁడు భవత్ప్రభుండిటకు రాఁ డేనిక్ మతీమేల్ ‘గడీఖాలీ’ చే
సియథేచ్ఛ నేగుమని మీ ‘ఖావందు’ కుక్ వ్రాయుమీ॥’’ అదే.
‘‘మెలిఁబెట్టిచుట్టిన తెలి ‘సైణీతిపాగ’ చెవిసంది ‘పాగ’ లోఁ జెక్కు ‘కలము’,
‘‘ * * * * *
‘‘పదతలంబుల నెత్తు పాఁజు ‘పాపోసులు’ పెక్కు గాఁజంకఁ ‘జీటీఖలీతి’
నడికట్టులో మొలనిడిన ‘కలందాను’ హస్తాగ్రమున వ్రేలుదస్తరంబు’’
హంసవింశతి.

‘‘మిహిపనిండి ‘ఘరుంజు మొహదా’ కెలంకుల ‘తావుగుజ్జరి’ వన్నె కేవడంబు’’
మనుచరిత్రము.

‘‘ ‘మైసూరి కుతినీ తమాను’ వేసుక ‘జరీ పాగా తురాయి’ గన్పడఁగఁ జుట్టి,
‘భారి’ శాలువ వల్లెవాటుగా నమరించి ‘భేషైన’ రవలసర్పేసునుంచి’’
లావణ్యశతకము.

‘‘జాలివజ్రాల ‘బేసరి’ (?) ‘బులాకీనత్తు’ నాసాగ్రమున దూఁకి నాట్యమాడ’’ అదే.
‘‘అబిడాలు మృగీ మదశ్రీ ‘బిడారు’’’ విజయవిలాసము.
‘‘బిబ్బీలకు ముసుంగులబ్బఁ జేసె’’—వసుచరిత్రము.
‘‘ఇమ్ములై మరు ‘హజారమ్ములై’’’—అదే.

రామరాజభూషణకవి ‘‘నానావజీరసేనాము’’ అని యుపయోగించినపుడు ‘వజీరు’ అనునది యన్యదేశీయమని యెఱుఁగఁడా? ఎఱుంగకపోలేదు. అది యాంధ్రబిరుదపదముగా భావించి సంశయపడక పెద్దసంస్కృతసమాసములో దాని నిమిడిచెను. మరి యీతఁడు అన్యదేశ్యములను నలిపి నలిపి వానికిఁ దెనుఁగుకళలు కల్పించెను. ‘ముసలిమానులు’ అన్నచో శ్లేషకొఱకై ప్రకారలేనిలోపమును గూడ మఱచినాఁడు ఈ యంశము చెప్పుట యన్యదేశ్యములను దూరమున నుంచక యేలీలఁ బ్రసక్తివశమున గ్రహించినాఁడో చూపుటకుఁ గాని వేఱుగాదు.

ఇట్లు గ్రంథములలో లక్ష్యములు పెక్కు కానిపించుచుండుటే కాక, నిబంధన గ్రంథములగు నిఘంటులు వ్రాసిన పండితులు గూడఁ దమపుస్తకములందు నన్యదేశ్యములను బర్యాయముల క్రిందఁ జేర్చుకొన్నారు. వ్యవహారమునందు లెస్సగఁ బాతుకొని పెకలింపఁబడఁజాలకున్నవని వారికిఁ దెలిసియుండదేని, అట్టిపదములను తమనిఘంటులలో నేల చేర్చుకొనియుందురు? ఇవిగో!

అడిదము సూరయ్య, ఆంధ్రనామశేషము— ‘‘ఆస్థాన-
లై తనరు ‘హజారం’ బనంగ మోసలయన్షంగ’’, ఉ. ‘‘సగ

కరణాటీవేంకన్న, తన "ఆంధ్రభాషార్ణవమున—

౧. మూలకొత్తళములు చెల్లు 'బురుజు'లనఁగ, ౨. ప్రబలువస్త్రముకుటము 'కుల్లా కుళాయి'.....యనఁగజాతనఁ 'టోపి'నాఁదనరునభవ, ౩. 'పాగ'యంచ నఁగను బరగునుష్ణీషంబు। తద్భేదసంజ్ఞమై తగు 'రుమాలు', ౪. 'చీటి'యనఖండవస్త్రి కయలరును; 'కౌలన' నభయపత్రాభిదయలరుచుండు. ౫. కోటనఁగఁ 'బాఁజు'నాఁ గషడ్గుణములమరు. ౬. కుథము 'జూల'నఁగను బొదలుచుండు. ౭. 'కైజామోర'యన హయశీర్షకంపనము వెలయు, ౮. వంకలుగలకత్తి 'దోదుమ్మి'యనఁగాను దోఁచుచుండు, ౭వ దానికి, ఉ॥ హయనాథుఁడంపిన హరులు కైజామోర లార్పుచుఁ బతికిజ్జోహారు సేయ.—వసుచరిత్రము.

తక్కినవాని కుదాహరణములు చూచుకొనఁదగును, సులభముగాదొరుకును.

ఈపదములును, మరి యిటువంటివియుఁ, దెనుఁగునఁ గలిసిపోకుండిన,వీనికింత గౌరవమేల యబ్బెడును?

ఇంక, ఆంధ్రదేశముయొక్క యనాగరికస్థితినిబట్టి కాఁబోలును, ఆంధ్రపుస్తకములువ్రాసిన స్త్రీలు పెక్కండ్రు కానరారు. ఒక్కతెయో, యిద్దఱో యున్నారు అందులోను, తరిగొండ-వెంగమ్మ పద్మావతీపరిణయపుఁబట్టులో నెఱుకసాని యొక్క సంగతి చెప్పుచు, "ఆకురవంజి'యిట్లనియె నాడకురమ్మని పిల్వవచ్చినా। రాఁ కొని నాఁడుబిడ్డఁ డిపుడమ్మల నక్కల నేడనైన నేఁ। జోఁకఁగఁజేరి వారలకు సోదె నిజంబుగఁ జెప్పకుండినన్। నాకడుపెట్లు నిండునని నవ్వుచుబల్కుచు మూల్గియిట్లనెన్॥" అనిమరియు దీనినె, "అనుచుఁబల్కెనఁ గొఱవంజి"యని మార్చి వాడినది. స్త్రీప్రయుక్త మప్రసిద్ధమెట్లు?

మరియు శుద్ధాంధ్రములను బిరుదులతో వెలువడిన తెలుఁగు పొత్తములలోఁ గూడఁ దత్కర్తలు సంస్కృతపదములు దూరముండఁ జేసిరేకాని, యన్యదేశ్యములను దఱుమలేదు. నిజముగా నన్యదేశ్యములను ఆంధ్రమునకు ముఖ్యాంగములుగా నెంచఁబడిన వనుటకు సందేహములేదు. కావున్న నీక్రిందివానికి గతియేమిటి?

"పక్కీరా। జక్కి 'వజీరు' చెల్వు చెవిఁజక్కఁగ నాఁటిననాటనుండి య"

నీలాసుందరీ పరిణయము.

"పొత్తమును మేల్ 'కుళాయి' బల్మిత్తియంపు"అదే.

"మీసలుదువ్వుచు నుడుగని। రోసంబునఁ దేరులెక్కి ప్రోడలయినరా।
కాని 'వజీరులు'గొందఱు। బాసటగొని నట్టెఱఁగుల 'పాఁజులు' గొలువన్॥"

అచ్చతెనుఁగు రామాయణము.

"పక్కెరలబాబాలుమానికపుఁ జౌ 'డోలీల'యెనుంగులోఁవిఁజెలఁగ"అదే.

"జీలఁ' జెనయుమావులతోడ"అదే.

"బల్కుఁడంకను జెట్టు 'బిడారు' బొబ్బ మెకంబుపై నగ్గలంబుగఁ బాఱవాడి" అదే.

ఇట్టివి యయాతిచరిత్రములోను ఉండును.

ఈవిషయమం దింతకుమించి చెప్పనవసరములేదు. అన్యదేశ్యములు వచోవ్యవహారముననే కాక, గ్రంథస్థముగాఁగూడఁ గైకొనఁబడినవనియు, గైకొనఁబడక తప్పవనియు నిచ్చటికి నిష్కర్షయయ్యెను.

ఇట్లని వినఁబడిన యన్యదేశీయపదములెల్ల నిరాఘాటంబుగ వాడుచు మనభాషయొక్క స్వభావమును జెడఁగొట్టు టెంతమాత్రమును గూడనిపని. భాషావృక్షమును సహజరీతిని బెరుగనీయ మేలుసమకూడును. కాని పెరుగుచున్న మంచికొమ్మలను నఱికివేయఁగా మొదలే కృశించి వాడఁబాఱును. ఆలాగే యెక్కడివో యవ్యవహృతలగు పలుకులు దెచ్చి యతికించితిమా, బదనికవలెనే యవి నిజాశ్రయస్వభావమును బాఱఁదోలి వేరుగుండ నీరుదిగినకొలఁది నిష్ఫలమగు తమ యప్రశస్తప్రాధాన్యమును నెఱపఁగలవు "వసుచరిత్రకర్త' 'హిమవాలుకా' అను సంస్కృతపదమునకు 'చలువయిసుక' అని తర్జుమాచేసి కర్పూరపర్యాయముగాఁ బ్రయోగించుకొన్నట్లే, కూచిమంచి తిమ్మన్నగారు 'చరణాయుధము' అను దానిని మెటవాల్పిట్ట,యని తెనిఁగించి కోడి యను నర్థమున నుపయోగించినలాగుననే, 'వట్టు' అను ద్రవిడపదము ననుసరించి 'విడుచు' అను క్రియను సహాయక్రియఁగా ద్రవిడసాంగత్యముగల యాంధ్రులు వాడుచుండఁగా విన్నాను. ఇట్టి గ్రామ్యరూపములను గూడఁ జేర్చుకొని 'సతామగమ్యా' అగుటకు మనయాంధ్రభాష కభిలాష లేనట్లు మనీషావంతులకుఁ దేటఁపడఁగలదని యెన్నుచున్నాను.

అన్య దేశ్య విచారణ వదలక మునుపే యింకొక్క గొప్ప సంగతి వినిపింపవలసియున్నది. మనదేశము బ్రిటీషుదొరతనమువారికి లోఁబడి నూఱు నూటపాతిక యేండ్లకంటె నెక్కువయైనది. అదిమొదలుకొని సకలవిధములచేతను నిష్కళంకమయిన సౌఖ్యము మనకబ్బినదని యొప్పుకొనుటలో హేతువు విస్తారమున్నది. మనదేశస్థులు నాగరికులయిరి. కాయిక మానసిక స్థైర్యంబులు మనకు సంతసంబు హెచ్చేదును. సరే, యీయన్యదేశీయుల రాచఱికముతోడ వారిభాషయు వ్యాపనమగుచున్నదిగదా! దానివల్ల మనయాంధ్రభాష యేమయిన మార్పుచెందవలసి వచ్చెనా మొదలయిన సంగతులు విచారణీయములు. తొలుత సంస్కృతమాంధ్రమును నావరించినట్లే, ఇప్పుడింగ్లీషుభాష వానినుభయమును మీఱునట్లు జంకెనచూపులతో అంకెలువేయుచున్నదే కాక, ఈనూతనభాష యెఱింగినమీఁదటనె సర్వతో... మగు ప్రపంచజ్ఞానము కుదురఁగలదని ప్రత్యాంధ్రునకును దోఁచుచున్నది. ఈ భాషయందలి పదములు రాజకీయములును దక్షిణవియును నానా... ధ్రిస్వభావమంది మెల్లమెల్లఁగాఁ జేరుకొంచున్నవి. ఇం...

గయులుగా నేర్పడుటకుఁ దగినంతచనవు సంపాదించుకొన్నవని కూడఁ జెప్పనొప్పును. ప్రొద్దుక్రుంకఁగానే మన కెంతో యుపకరించుచుఁ జేతఁబట్టుకొనుటకుఁ బైనగొపి రెగల చిన్నయద్దపుఁబెట్టెకు మనభాషలోఁ బేరుదొరుకుటకుఁగారణమే లేదు. దానిని 'లాందరు' అని 'లాంతర'ని, యందఱు సందేహింపక యందురే కాని యామాటయొక్క వ్యుత్పత్తినిబట్టి గ్రహించినారే! ఇట్టివనేకములు రూపములుమారినవి, మారనివి 'అన్య దేశ్యములు'గా భాషలో గ్రహింపఁదగి, నిత్యవ్యవహారములోనున్నవి వంకరగానుండు చిన్నవ్రాతబల్లను బూర్వము మేజాబల్లయనువాడుక. ఇప్పుడు 'దసుకు(లేక)దసుగు' బల్లయని దానిని బిల్వవలెనికివెలి. నేను 'వోవరసీరు'గారి 'బోటు'మీద 'ఫూల్ రేటి' చ్చి మొదటి 'నెంబరు రూములో'గూర్చుండి, 'హాలు'లో 'ఫీ'గా నెక్కిన యిద్దరు 'పించెను సిపాయీ'లను బిల్చి వారితో మొక్క 'షాపు'లోఁగొన్న 'చీట్లపేక'యా డుచు, 'డైమనుజాకీ'మార్చి, 'యిస్పేటు తురుపు'చెప్పి, 'యొంటిమణేలా' పడిపోఁగా సంతసించి, మొక్క చేతిమీద 'మిన్నిటు'లోఁ 'గోటు'చేసి, యంతమందిచేత బెస్టు అనిపించుకొని, యంతఁబ్రొద్దువాలఁగాఁ 'టాపు'పయికిఁబోయి 'కళాసుల'చేత వడి వడిగా లాఁగింపుమని 'సరంగు'తోఁజెప్పి, 'తండే'లిని దగ్గఱకుఁబిల్చి యామెమెక్కిన పడవ యే'క్లాసు లైసెన్సు'పుచ్చుకొన్నదోయడిగి, 'ష్టిమర్ల'మీఁదఁ గొస్తా'రవాణా' లకమీషను 'వాకబు'చేసి 'తన్నేలు' రెండుమైళ్లున్నదనంగా 'లాకు'నొద్దదిగి 'రైలు' వలెఁబోవు బండిమీఁద 'నింజినెరు'వారి 'యాఫీసు'నకుఁ దిన్నగాఁ బడమరగా మా 'విలేజి'కిఁ బోయితిని. అనువాక్యములోనున్న యన్యదేశములన్నియు నిప్పటి లౌకిక మూఢులయిన జనులకు సహితము తెలిసియున్నవని నమ్ముచున్నాఁడను. ఈ నలువది యన్యదేశ్యములలోను, అయిదేమొ ఇంగ్లీషుపదములు కావు అవియును రెండుతప్ప నింగిలీషువారివల్ల వ్యవహారములోనికిఁ దేఁబడినవేయని తలంచెదను. చ-జ-ంక కారములు చివరగలవి వినాగా, నింగిలీషుమాటలును దెనుఁగులోనికి వచ్చి నప్పుడు సాంస్కృతిక హలంతములవలెనే యుగాగమ ద్విత్వములు పొందుచున్నవి. దీర్ఘపూర్వకములకు ద్విత్వము కానరాదు. ఉ. రేటు బొక్కు (బుక్కు) రేఫాంతము లున్నగలవు. కొన్నివేళల రేఫపూర్వస్వరము దీర్ఘము చేయంబడును. ఉ. కల్కటీరు, కాని చ-జ-ంక కారములంతమునఁగల మాటలు తెనిఁగింపఁబడునపుడు తుదిని ఇకారము వచ్చును. ఉ. కాలేజీ-బెంచి-జెడ్జి-బ్యాంకి. కస్తాను పరాయీమాటగా సేవినఁబడుట లేదు. ఈపయినఁజెప్పినవి కాక, లక్షోపలక్ష లాంగ్లోసమములు నుభవములును (అన్య ములు) జిల్లా'గెజెటీ'లలోఁ జూచుకొనఁదగును. 'ఇస్కూలు', 'ఇసుగూలుబడి' ను రోడ్డు' (లోడ్డు)యన్న మాటలురాని స్త్రీ మనలో లేదేమొ. స్థలముల నవి. ఈ'రాజమహేంద్ర'వరము'రాజమంద్రి'యయ్యె. పుట్టఁగల ట్టి యీపేరు కలిగెననుకొందురేమొ. [సశేషము.]

అభిజ్ఞానశాకుంతలము. [౧౯౨-పుటశేషము.]

అన—అలాగుననే. (అని వదులుచేయుచున్నది.)

ప్రియం—(నవ్వుచు) ఇప్పుడు నీగుబ్బలనుబ్బించిన నీయావన ప్రాదుర్భావమునే నిందించుకొమ్ము. ఊరక నన్నేల నిందించెదవు?

రాజు—ప్రియంవద యథార్థముచెప్పినది.

గీ॥ పండుటాకులలోఁ గప్పఁబడిన పూవు।
భంగి, నిజశోభ నింతిన వాంగకంబు।
చూపలేదయ్యెఁ, జిలుముడి మూపునెుఱయఁ।
గవచనులయుబ్బు మాఁటు వల్కలముచేత॥

ఏమీ! ఈమెశరీరమున కీవల్కలము తగనిదేయయినను, అలంకారశోభం బెంపుఁజెందింపకున్నది కాదు.

చ॥ నళినము శైవలంబునఁ బెనంగొనియుండియు రమ్యమేయగుకా।
మలినకళంకముంగలిగి మంజులతన్వహించుఁ జంద్రుఁడుకా।
జెలువునమించె నీజలజనేత్రయు వల్కలధారణంబునకా,।
దలఁపఁగ సుందరాంగులకుఁ దానువిభూషణమేదిగాదిలకా॥

మఱియు నాడెందంబునందు.—

గీ॥ కఠినమయ్యు మృగాక్షికిఁ గాంతవల్కలమ్ముమరుచిభంగమీయదయ్యెలవము,వికచ।
కంజములుగల్గు నళినికిఁ గంతమింత। విడువఁబడినకర్కశ వృంతవితతిపోలె॥

శకుం—(ముందువంకఁజూచి) సఖులారా! ఈపొగడచెట్టు గాలిచేఁగదలు చిగురుఁ గేల నన్నుఁ ద్వరపెట్టుచున్నట్టున్నది. దీనిం గారవింతమురండు.

[అని యందఱు నడుచుచున్నారు]

ప్రియం—సఖీ! శకుంతలా! ఇచ్చటనే మఱి నిమిషంబునిలువుము.

శకుం—ఎందునిమిత్తము?

ప్రియం—నీవు దాపున నిలుచుటంజేసి యీపొగడవృక్షము లతతోడం గూడి యున్నట్టు ప్రకాశించుచున్నది.

శకుం—ప్రియంవదా! ఇందువల్లనేకాదా నీవు ప్రియంవదవైతివి.

రాజు—ప్రియంవదోక్త ప్రియమయినను సత్యమేపలికినది. ఈమెకు—

గీ॥ కిసలయంబుపగిదిఁ గెమ్మోవితనరారు,। బాహువులు మృదువిటపములఁబోలు,।
నంగకములనెల్ల నమరెను బరువంబు,। వలపుగొలుపఁదగుచు నలరువోలె॥

అన—సఖీ! శకుంతలా! 'వనజ్యోత్స్న'యని నీవు పేరుపెట్టుకొన్న యీనవమాలిక యిప్పుడు బాలరసాలమునకు స్వయంవర వధువైనది. దీనింజూచితివా?

శకుం—(లతయొద్దకుఁబోయిచూచి) చెలియా! ఆహా! ఈరమణీయకాల లతాపాదపమిథునమునకు సొండోరులంగలియుట సంభవిం...

యౌవన యీవనజ్యోత్స్న: పల్లవరాగంబున నొప్పి భోగార్హమయినది యీక్రొమ్మావిగున్న. [అని చూచుచు నిలుచున్నది.]

ప్రియం—(చిఱునవ్వుతో) అనసూయా! ఎందుచేత శకుంతల 'వనజ్యోత్స్న'ను దడవుగఁ జూచుచున్నదో నీవెఱుంగుదువా?

అన—నేనూహింపఁజాలను, నీవే తెలుపుము.

ప్రియం— ఈవనజ్యోత్స్న యేప్రకారముగాఁ దగిన పాదపముతోడఁ గూడినదో, తాను నాప్రకారముగాఁ దనకుఁ దగినవరునిఁ బొందవలయునని.

శకుం—(అనసూయతో) ఇది నిశ్చయముగా నీకు నీమనసులోనున్నకోరిక.

[అని జలకలశమును వంచుచున్నది.]

అన—ఓశకుంతలా! జనకులగు కాశ్యపులచే నీవలెనే స్వహస్తముతోఁ బెంపఁబడిన మాధవీలతయిది. దీనిన్మఱచిపోవలవిగదా!

శకుం—నన్నునేను మఱతునేని, అప్పుడు దీనినిమ్మఱతును. (లతనుజూచి) ఆశ్చర్యము! ఆశ్చర్యము! ప్రియంవదా! నీకొక్కప్రియము చెప్పెదను.

ప్రియం—సఖీ! నాకుఁ బ్రియమేది?

శకుం—అకాలమయినను, ఈమాధవీలత యిప్పుడామూలమును మొగ్గదొడిగినది.

ఉభయ—(సత్వరముగాఁ జనుచు) చెలియరో! నిజముగానా? నిజముగానా?

శకుం—నిజముకాదా? మీరుచూడుండి.

ప్రియం—(సంతోషముతోఁ జూచి) సఖీ! దానిచేతనే నీకు నేనొక్క ప్రతిప్రియము చెప్పెదను.

శకుం—నాకుఁ బ్రతిప్రియమేది?

ప్రియం—నీకుఁ బాణిగ్రహణము సమీపించుచున్నది.—

శకుం—(అనసూయతోఁగూడినట్టుగా) ఇదినీమనసులోని పిచ్చియూహ. కాఁబట్టి నీమాట నేనువినను.

ప్రియం— సఖి! నేను పరిహాసమునకుఁ జెప్పుచున్నదానను గాను. ఇది నీ కళ్యాణసూచకమైననిమిత్తమని పూజ్యులగు కణ్వమహర్షుల ముఖమువలననే విన్నదానను.

అన—ప్రియంవదా! అందుచేతనే శకుంతల యీ మాధవీలతకంత ప్రేమతో నీళ్లుపోయుచున్నది.

శకుం—అది నాకుఁదోఁబుట్టువు. కాఁబట్టి నేనెట్లు నీళ్లుపోయకుండఁగలను?

[అని కలశము వంచుచున్నది.]

రాజు—(మనసులో) నా యీ మనోరథము దుర్లభమేమో! ఈ మెకులపతియగు వను సజాతీయమైన భార్యయందుఁ బుట్టినదికాకుండవచ్చునా? తప్పఁదలఁ ...ంప బనిలేదు.

గీ॥ నృపపరిగ్రహయోగ్య యీనెలఁత నిజము; కాక, నామది నిర్దోషమాకె నెట్లు
తవులు? నెందుసందేహవస్తువులయందు నాత్మగతులె ప్రమాణంబు లార్యులకును॥
అయినను, ప్రత్యక్షముగానే యీమె నెఱింగెద.

శకుం—(తొట్రుపాటుతో) నీళ్లుపోయుటచేఁ దుళ్లిపడి, యీతుమ్మెద నవమాలికా కుసుమమ్మును విడిచిపెట్టి నా నెమ్మోమున వ్రాలవచ్చుచున్నది!

[అని భ్రమరబాధ నభినయించుచున్నది.]

రాజు—(ఆశమీరవిలోకించి) మేలు! ఈమెపీడయును రమణీయముగానే యున్నది.

క॥ ఎంథెందుఁ దిరుగుఁదుమ్మెద, యందందే బెళుకుఁగనుల నడరింపుచని
చ్ఛందిప్పెడు బొమలళుకున, మందగమన దృష్టివిభ్రమము నేర్చెడునో॥
(అసూయకలిగినట్టుగా)

చ॥ కదలెడికల్కి బెళ్కుఁగడ కన్నులనంటెదు మాటిమాటికిన్,
బదిగరహస్యమాడుగతిఁ బల్కెదు కర్ణముచెంతఁ జేరి, బల్
ముదమున కాస్పదంబయిన మోవిని గ్రోలెదు కేల్విదల్ప, ష
ట్పద! కృతివీవ, మేము చెదువారము తత్త్వవిచారమగ్నతన్॥

శకుం— చెలులారా! నీతిమాలిన యీతుమ్మెదచేత బాధింపఁబడుచున్న నన్ను రక్షింపుఁడు.

ఇద్దఱు—(చిఱునవ్వుతో) ఈతపోవనంబులు రాజుచే రక్షింపఁబడుచుండ, నిన్ను రక్షించుటకు మేమెవరము? దుష్యంతునింబిలువుము.

రాజు—(తనలో) బయల్పడుటకు నాకిదియె మంచిసమయము. (ప్రకాశముగా) భయపడవలదు— (అని సగముచెప్పి మనసులో) ఇట్లయిన రాజభావము వెల్లడి యగును. అవుఁగాక, ఇట్లుపలికెదను.

శకుం—ఈదుష్ట షట్పదము నన్నువదలకున్నది. మఱియొకచోటికేగెద. (మఱియొక యడుగు నడచి నిలిచి చూపులు నిగుడించుచు) పో! పో! ఇదేమి! ఇక్కడను వెంటఁబడుచున్నది!

రాజు—(సత్వరముగావచ్చి)

గీ॥ ఎవఁడవురనీవు? ముగ్ధలౌ యీతపస్వి కన్యలను నేచవచ్చితి కావరమున,
దుర్వినీతులదండించు చుర్వినెల్లఁ బౌరవుండేలుచుండంగ భయములేక॥

[అందఱును రాజుంజూచి కొంత తత్తర[illegible]రి.]

అన— అయ్యా! ఇప్పుడు విశేషోపద్రవము మఱేమియులేదు. మాప్రియ, యీకొమ్మ తుమ్మెదబాధవలన బెగడొందినది. [అని శకుంతలం జూపు

రాజు—(శకుంతలవంకఁదిరిగి) చక్కఁగాఁ దపస్సువర్ధిల్లుచున్నదా?

శకుం—(సిగ్గుచేతఁ దలవంచుకొని యూరకున్నది.)

అన—ఇప్పు డతిథిలాభము చేత మఱింతచక్కఁగా వర్ధిల్లుచున్నది.

ప్రియం—దేవరవారికి సేమమా? (అని శకుంతలవంకఁదిరిగి) సఖీ! శకుంతలా! నీవు పర్ణశాలకుంబోయి, పండ్లతోడఁగూడఁ బూజాద్రవ్యంబులం గొనిరమ్ము. ఇంతలో నీయుదకము పాదప్రక్షాళనంబున కుపయోగించును.

రాజు—ఏమియు నక్కఱలేదు. ఇప్పుడు మీప్రియవాక్యములచేతనే నాకాతిథ్యము జరిగినది.

అన—అట్లయిన ముహూర్తమాత్రము దేవర యీచల్లనినీడగల యేడాకులయరటిచెట్టుక్రింది వేదికమీఁదఁ గూరుచుండి యలయికం దీర్చుకోఁదగును.

రాజు—పనిచేసి మీరును నలసియున్నారు. ముహూర్తము కూర్చుండుఁడు.

అన—సఖీ! శకుంతలా! మనకతిథిసేవయే యర్హాకృత్యము. కాఁబట్టి యిందుఁగూర్చుందము. [అన నందయుఁగూరుచున్నారు.]

శకుం—(ఆలోచించి మనసులో) ఇదియేమో కాని యీయనం జూచి తపోవనంబులం గారాని యొకవికారంబునకు లోనయినదానను.

రాజు—(అందఱినిజూచి) ఓహో! మీస్నేహము సమానమయిన వయస్సుచేతను రూపముచేతను రమణీయముగానున్నది!

ప్రియం—(రహస్యముగా) అనసూయా! ఈయనయెవరు? చతురగంభీరాకారంబున, మధురప్రియవాక్యంబులం బలుకుచు రాజువలెఁ గానవచ్చుచున్నాఁడు.

అన—నాకును గౌతూహలమగుచున్నది. ఈయననడిగెదను. (ప్రకాశముగా) దేవరవారి మధురాలాపంబుల వలనంగలిగిన విశ్వాసము తమ్ముఁ గొన్నిసంగతుల నడుగ నన్నుఁ బ్రేరేపించుచున్నది. తముచే నేరాజర్షివంశ మలంకరింపఁ బడుచున్నది? ఏదేశమందు జనులు దేవరవియోగమునకుం గుందుచున్నారు! సుకుమారమయ్యు నీశరీర మెందునిమిత్తము తపోవనగమన పరిశ్రాంతిపాలు సేయఁబడినది?

శకుం—(మనసులో) హృదయమా! ఆరాటమున్మానుము. నీవడుగఁదలఁచిన దాని నీయనసూయయే యడుగుచున్నది.

రాజు—(మనసులో) నన్ను నేనేమని యిప్పుడు తెలుపుకొందును! ఏలాగున నన్ను నే మఱుంగుపెట్టుకోనైన నేర్తును! ఏమయినంగానిమ్ము; ఈప్రకారముగాఁ జెప్పెదను. (ప్రకాశముగా) పురువంశసంభవుండయిన రాజుచేత ధర్మాధికారమునందు నియోగింపఁబడిన వాఁడనయి, యాశ్రమవాసుల సత్క్రియానుష్ఠానములు నిర్విఘ్నములుగా నెగడుచుండుటం దెలిసికొన నీధర్మారణ్యంబునకు వచ్చినాఁడను.

...మార్గమునం జరించు నాశ్రమవాసు లిప్పుడు గదారక్షకునింగలవారైరి.

(శృంగారలజ్జ నభినయించుచున్నది.)

...భయులయాకారములం దెలిసికొని రహస్యముగా) సఖీ! శకుంతలా!

...నుహాను లిప్పుడిచ్చటనుండి రేని,—

శకుం—(రోషముతో) ఉండిన నేమి!

సఖు—తమప్రాణతుల్యమయిన ధనమొసఁగి యీయతిథిం గృతార్థునిఁగావింపఁగలదు.

శకుం—సఖులారా! వేఱొక్కటేదియో మనసున నుంచుకొని గూఢముగా మాటలాడెదరు. మీపలుకులాలింపను.

రాజు—మేము నించుక మీ నెచ్చెలివృత్తాంతము నడుగుదుమా?

సఖు—దేవరయట్లువేఁడుట మాకనుగ్రహముకదా!

రాజు—మహానుభావుండగు కాశ్యపుఁడు శాశ్వతబ్రహ్మనిష్ఠుఁడని ప్రసిద్ధి. అట్టివానికెట్లు మీ నెచ్చెలి కూఁతురయ్యెను?

అన—దేవర యాకర్ణింపవలయును. కౌశికుండని వంశనామముగల మహాప్రభావసంపన్నుఁడయిన రాజర్షి యొకఁడు కలఁడుగదా!

రాజు—కలఁడు; వినియున్నాము. అనంతరము.

అన—అతఁడె మాచెలియంగన్నవాఁడు. కన్నవారిచే విడువంబడిన యీమెను బెంచుట మొదలుగాఁగలపనులు నిర్వర్తించుటంజేసి పూజ్యులగు కణ్వులును నీమెకు జనకులయిరి.

రాజు—"విడువఁబడి"యను శబ్దశ్రవణముచేతనే వేడుకపొడముచున్నది. మొదటినుండియు వినఁగోరుచున్నాను.

అన—దేవర యవధరింపవలయును. పూర్వమారాజర్షి యుగ్రతపస్సు చేయుచుండఁగా, దేవతలు భయపడి యానియమమునకు విఘ్నమాచరింప మేనకయను నప్సరంబుచ్చిరి.

రాజు—దేవతలకీ పరతపోభయశీలత యెప్పుడునున్నదియే. తర్వాత, తర్వాత.

అన—అంత నత్యంతరమణీయమగు వసంతకాలమున నున్మాదమునుబుట్టించు నామెరూపమునుజూచి—(అని సగముచెప్పి లజ్జచే నూరకున్నది.)

రాజు—ఆపయిని దెలియనే తెలియుచున్నది. తప్పక యీమె యప్సరస్సంభవయే.

అన—మఱియేమి?

రాజు—స్పష్టమగుచునేయున్నది.

క॥ ఇటువంటిరూపమారయ। నెటుపుట్టును మర్త్య చంచలేక్షణలందున్;।
జటులప్రభాతరళమగు। తటిల్లత జనింపఁగలదె ధారణినెందున్॥

శకుం—(క్రిందుఁజూచుచుఁ గూరుచున్నది.)

రాజు—(మనసులో) నామనోరథమున కవకాశమున్నది. అయినను, చెలికత్తియచేఁ బరిహాసముగా నుదాహరింపఁబడిన యీమెయొక్క వరునివిషయమైన ప్రార్థననువిని నాడెందము సందేహముచే నాందోళించుచున్నది.

ప్రియం—(చిఱునవ్వుతో శకుంతలవంకఁజూచి, నాయకాభిముఖియై) —
మఱియూనేమో పలుకఁ దలఁపుగలిగియున్నట్లు కనుపట్టుచున్నా—

—(అంగుళిచే నెచ్చెలిం బెదరించుచున్నది.)

రాజు—నీవు లెస్సగాఁ గనిపెట్టితివి. సచ్చరిత్రశ్రవణమునందలి యపేక్షవలన మఱి యొక ప్రశ్న యడుగవలసియే యున్నది.

ప్రియం—సందేహింపవలదు. తపస్విజనులను సంకోచములేక యడుగఁదగును గాదా!

రాజు—మీ సఖిసంగతి యెఱుంగఁగోరెదను.

ఉ॥ ఈరమణీలలామ హృదయేశున కీఁబడుదాఁక కామువ్యా।
పారనిరోధియైన వ్రతభారము దీనినెపూనియుండునా?
చారువిలోచనప్రభల సామ్యమువచ్చు కురంగభామినీ।
వారముతోడ నిచ్చటనె వాసమునిత్యము సేయుచుండునా?॥

ప్రియం—దేవా! ధర్మాచరణమునందుసహిత మీతరుణి పరాధీనయే. అయిన నీమెం దగినవరున కీవలెననియే యెప్పుడును దండ్రిసంకల్పము.

రాజు—(సంతోషముతో మనసులో) ఆయనసంకల్పము దుర్లభము కాదు.

గీ॥ హృదయ! సాభిలాషివిగమ్మి యింక నీవు,। సంశయనివృత్తియిత్తఱిఁ సంభవించె;।
ననలమని దేనిభ్రమియించితది యిప్పు। డంటఁగూడినమానికమయ్యెఁ జుమ్ము॥

శకుం—(రోషముతోఁ గూడినట్లుగా) అనసూయా నేనువెళ్లెదను.

అన—ఎందునిమిత్తము?

శకుం—ఈయసంబద్ధప్రలాపములను బ్రేలు ప్రియంవదసంగతి పూజ్యురాలయిన గౌతమితోఁ జెప్పుటకు.

అన—సత్కారముం బడయని యతిథిప్రశస్తునిట్లు విడిచిపెట్టి మనసువచ్చినట్టు పోవుట యాశ్రమవాసినులగు నాఁడువారికిం దగవు కాదు.

శకుం—(ఏమియు బదులుపలుకక బయలుదేఱినది.)

రాజు—ఆ! ఎట్లుపోవుచున్నది! (కూడఁజనఁగోరు తనమనసును నిగ్రహించి) కాముకజన మనోవ్యాపారము చేష్టలతో సమానమయినదిగానే యుండును! కావుననే. నేనును—

క॥ మునిపుత్రికవెంటంబడి। చనఁజూచియు నిలువఁబడితి సౌశీల్యముచే।
తనిపుడ, యిమ్ముఁగదలకయుఁ। జని క్రమ్మఱివచ్చినట్టె సరిగాఁదోఁచుఁ॥

ప్రియం—(శకుంతలం బట్టుకొని) సఖీ! నీవు వెళ్ళఁగూడదు.

శకుం—(బొమముడితో) ఎందుచేత?

ప్రియం—నీవు నాకు రెండుచెట్లకు నీళ్లుపోయ నప్పుపడియున్నదానవు. కాఁబట్టి నాఋణముం దీర్చి మఱిపోవుదువుగాని రా.

[అని బలాత్కారముగా మరలింపుచున్నది.]

ర. దయామయీ! నాకుం జూడ వృక్షములకు నీళ్లుపోయుటవలననే యాపె [illegible] తోఁచుచున్నది. ఔనుగదా? ఈమెకు,

ఉ॥ ఖండనుఖూన మూఁపులవి క్రుంగెను, హస్తతలంబులెఱ్ఱనై।
యుండె, వడంకఁజొచ్చెఁగుచయుగ్మము, మిక్కిలియయ్యె శ్వాసముల్,।
నిండెను మోమునందుఁ జెవినిడ్డ శిరీషము వాడఁజెమ్మటల్,।
వెంట్రుకలుంగలంగె ముడివీడఁగఁ దానొకచేతఁజేర్చుటన్॥

కావున నీమెఋణమును నేనుదీర్చెదను; కైకొనుఁడు.

[అని చేతియుంగరమునిచ్చెను.]

సఖులు—(పుచ్చుకొని నామముద్రాక్షరములఁ జదువుకొని యొకరినొకరు చూచుకొనుచున్నారు.)

రాజు—మమ్ము వేఱువిధముగా భావింపవలదు. రాజపురుషులమగుటచే, మాకిది రాజువలన లభించినది.

ప్రియం—అందుచేతనే యీ యుంగరము దేవర వ్రేలి నెడఁబాయఁదగదు. తమ మాటచేతనే యీమె ఋణము తీఱిపోయినది.

అన—సఖీ! శకుంతలా! దయాళువయిన యీయనచే, లేక, యీ మహారాజుచే, నీఋణవిమోచనమయినది. ఇప్పుడు నీవు పోవచ్చును.

శకుం—(మనసులో) నేనే స్వతంత్రురాల నయితినేని—

ప్రియం—ఇంకను వెళ్లవేమి?

శకుం—ఇప్పుడు నేనేమియు నీయాజ్ఞకు లోఁబడియుండలేదు. నాయిష్టమువచ్చినప్పుడు నేనుబోయెదను.

రాజు—(శకుంతలంజూచి మనసులో) ఈమె మీఁద మనకెట్లున్నదో యీమెకును మనమీఁద నట్లే యున్నదేమో! ఏలాగయినను నాకోరిక కవకాశమున్నది. ఎట్లంటేని—

గీ॥ కలిసిమాటాడకున్న, నాపలుకులకును। వీనులొగ్గెడు నభిముఖియై నెలంత;।
వెలఁదినామోమున నెచూడ్కి నిలుపకున్న,।నన్యవిషయంబులకుఁబోవదతివదృష్టి॥

[తెఱలో]

ఓహో! తపస్వులారా! మీరు తపోవనమునందలి జంతువుల రక్షింప సిద్ధముగానుండుఁడు. మృగయావిహారియగు దుష్యంతమహారాజు సమీపమున వచ్చుచున్నాఁడట.

గీ॥ కొమ్మలకుఁగట్టి తడివల్కలమ్ములున్న।
యాశ్రమ మహీజములయందు, హయఖురాళి।
నడరు పెనుధూళిపడెడు, సాయంతనంపు।
టరుణరుచిఁబొల్చు శలభచయంబువోలె॥

రాజు—(మనసులో) అక్కటా! సైనికులు నన్నువెదకుచుఁ దపోవనంబులకు బాధ గలిగించుచున్నారు!

(మరల తెఱలో)

ఓహో! తపస్వులారా! వృద్ధులును, స్త్రీలును, బాలురును, వ్యాకులపడ నిదిగో యేనుఁగొక్కటి సంప్రాప్తమయినది.

చ॥ అరదముఁ జూచి భీతి నొకహస్తి, కురంగసమూహముక్కలఁక౯,
దరువు ప్రకాండముం బొడువ దంతముఖంబొకఁడంచు పోవఁగాఁ
జరణములం దగుల్కొనిన చారులతావళి నీడ్చుకొంచు, న
ఖ్ఖరముగఁ జొచ్చెఁ బుణ్యవనము౯, వ్రతవిఘ్నము రూపుదాల్చెనా౯॥

[అందఱు నది విని యించుక సంభ్రాంతులయి లేచుచున్నారు.]

రాజు—(మనసులో) అయ్యో! నేను దపస్వుల కపరాధము చేసినవాఁడ నైతిని! కానిమ్ము. నేఁబోయి నివారించెదను.

సఖులు—దేవా! ఈ యడవి యేనుఁగు వృత్తాంతము చేతఁ గలగుండువడినారము. పర్ణశాలకుం జన ననుజ్ఞ యిమ్ము.

అన—సఖీ! శకుంతలా! పూజ్యురాలగు గౌతమి వి—ంచుచుండును శీఘ్రముగా రమ్ము. అందఱము నొకటిగాఁ గూడుకొందము.

శకుం—(నడవలేనట్లభినయించుచు) హా! హా! నడవం గాళ్లాడకున్నవి!

రాజు—(తొట్రుపాటుతో) మీరు యథేచ్ఛముగాఁ బొండి. మేమాశ్రమపీడ తొలఁగు ప్రయత్నముం గావించెదము. [అందఱును లేచినారు.]

సఖులు—మీ మహత్త్వముం గుర్తెఱిఁగి యుపచారము చేయమిం జేసి యిప్పుడు మీ యెడ నపరాధలమయితిమి. క్షమియింపుఁడు. మాచే నర్హసత్కారముం బడయని దేవరను వెండియుఁ జూడవేడుక గలదని విన్నవించుటకు మాకు లజ్జయగుచున్నది.

రాజు—అట్లు కాదు. మీ దర్శనము చేతనే మేము సత్కృతులమయితిమి.

శకుం—అనసూయా! సూదివంటి క్రొత్తదర్భ పుడక నా పాదమునం గ్రుచ్చుకొన్నది. (మఱియొకయడుగుపోయి) చెలులారా! నా నారచీర కురువకవృక్షము యొక్క కొమ్మం జిక్కుకొన్నది. దీనిం దీసికొనువఱకును నిలిచి నన్నుఁ గొనిపొండు. (అని మిషపెట్టి రాజుం జూచుచు నాలస్యముగా సఖులతో నడచుచున్నది.)

రాజు—(నిట్టూర్పు పుచ్చి) అందఱుం జనిరి! కానీ నేనును జనియెదను. శకుంతలం బొడగాంచినది మొదలు నగరగమనమును గుఱించిన యుత్సాహము తగ్గినవాఁడ నైతిని. వెంటవచ్చినవారిం గలిసికొని తపోవనమునకు సమీపమున విడియించెదను. శకుంతలా వ్యాపారమునుండి నా డెందము మరలింపఁజాలకున్నాఁడను,—

గీ॥ నడుచుచున్నది ముందుకు నా శరీర। మాత్మ పరుగులిడు వెన్క కవశమగుచు।
మంచిగాలికి నెదురుగఁ గొంచుఁబోవు। ధ్వజమునకుఁగట్టు పట్టువస్త్రంబు వోలె॥

[అందఱు నిష్క్రమించిరి.]

అభిజ్ఞానశాకుంతలము.

ద్వితీయాంకము.

ప్రదేశము—ఆశ్రమారణ్యము.

[అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ—(నిట్టూర్పువిడిచి) హా! దైవమా! మృగయాశీలుఁడగు నీరాజుచెలిమిచేత నోసపోతినిగదా! ఇదిగోమృగము, ఇదిగోవరాహము, అదిగోశార్దూలము, అని మిట్టమధ్యాహ్నమున మండువేసవికాల మగుటచేఁ బలచని నీడలుగల యరణ్యమార్గముల నొక యడవినుండి యొక యడవికిఁ ద్రిప్పట యగుచున్నది. ఆకులు పడి చెడిపోయిన వెచ్చని కొండయేళ్లనీళ్లు త్రాగనబ్బుచున్నవి. వేళతప్పి కాలినట్టి మాంసము భోజనమునకు సంభవమగుచున్నది. గుఱ్ఱములయొక్కయు నేనుఁగులయొక్కయు ధ్వనులచేత రాత్రియైనను మంచినిద్రపట్టలేదు. పెద్ద తెల్లవారుజామున దాసీకొడుకులగు పిట్టవేటకాండ్రు చెవులుబద్దలుగా నఱచు వనగమనకోలాహలముచే మెలఁకువవచ్చినది. ఇప్పటికిని పీడపోలేదు. ఆమీఁద స్ఫోటకము మీఁద వ్రణమయినది. నిన్న మేము వెనుకపడియుండ, లేడివెంబడి నాశ్రమపదమును బ్రవేశించిన యీ మహానుభావునకు నాదురదృష్టముచేత శకుంతలయను తాపసకన్యయొక్క తెకాఁజబడినది. అప్పటినుండియు నగరగమనమును కథయేనిఁ దలపెట్టఁడు. దీనినే యత్యంతము చింతించుచున్న నాకన్నులనె ప్రభాతమయినది. ఏమిగతి? సమయకృత్యములం దీర్చుకొని, వేషముందాల్చియున్న యామిత్రునిం గాంచెదను. (అని వెళ్లిచూచి) ఇదిగో చేతులయందు విండ్లుదాల్చి, యడవిపువ్వులదండలు వేసికొని కిరాతకాంతలు తన్నుఁజుట్టుకొనియుండఁ జెలికాఁడీలాగుననే వచ్చుచున్నాఁడు. రానిమ్ము. అంగభంగమునఁ గదలలేనివానివలె నుండెదను. ఈవిధముననయినను కొంతవిశ్రమము పొందెదను.

[అని దండకాష్ఠము నానుకొని నిలుచున్నాఁడు.]

[అంతమున్ను చెప్పిన పరివారముతో రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు—(మనసులో)

గీ॥ కనఁగఁ బ్రియురాలు సులభగాఁ గానిపించ,।
దామె భావముఁ గని మదియాసపడెడు,।
నింక మరుపూన్కి తుదముట్ట దిప్పడయిన,।
నుభయులకుఁ గోర్కు లానంద మొసఁగుచుండె॥

(చిఱునవ్వునవ్వి) ఇట్లు కాముకుఁడు తనయభిప్రాయమున కనుగుణముగా నిష్టురాండ్రయొక్క చిత్తవృత్తులను భావించుకొని పరిహాసపాత్రుఁడగును.

నిద్దపుఁజూడ్కి నెందుకడ నేత్రము ద్రిప్పటయు, న్నితంబముల్
పెద్దవియౌట మందగతి లీలనుబోవుట, బోటులాపిపో
వద్దనుచో ననూయమెయి వారలఁబల్కుట, కాముకుండు దా
నద్దిర! సర్వమాత్మవిషయంబుగ నేకొనుచుండు నాత్మలోన్॥

విదూ—(ఆలాగున నేయుండి) ఓవయస్యా! నాకరచరణంబులు గదలవు. వాఙ్మాత్రముచేతనే (యాశీర్వదించెద) విజయీభవ!

రాజు—(చిఱునవ్వుతో) నీకీయంగవైకల్య మెందువలనఁ గలిగినది?

విదూ—ఇదియేమి? స్వయముగానే కన్ను గలియఁబెట్టి కన్నీళ్ళేలఁ బొడమెనునని యడిగెదవు.

రాజు—నాకేమియుం దెలియకున్నదే.

విదూ—ఓవయస్యా! ఆప్రబ్బరూను కుబ్జలీలను విడంబించుచున్నది. అది స్వప్రభావముచేతనా?

రాజు—నదీవేగమే యందునకుఁ గారణము.

విదూ—ఆప్రకారముగా నాకును నీవే!

రాజు—ఏప్రకారముగా?

విదూ—ఈవిధముగా నీవు రాజకార్యములను విడిచిపెట్టి, యిటువంటి వ్యాకులప్రదేశములయం దాటవికవృత్తి నుండఁదగితివి. నేనును నిశ్చయముగాఁ బ్రతిదినమును క్రూరమృగములను దోలుటచే కీళ్లు సడల నాయవయవములు నాయధీనములు గాకయున్నవి. కాఁబట్టి నాయందనుగ్రహించి యొక్క దినమయినను నన్ను విశ్రమముపొందుటకు వదిలివేయుము.

రాజు—(మనసులో) వయస్యుఁడును నిట్లనుచున్నాఁడు; నాకును కణ్వతనయం దలంచి డెందంబు వేఁటయందు విముఖమగుచున్నది.

గీ॥ ఎపుడుఁ బ్రియురాలితోఁగూడ నిచట నుండి
సొగసుఁజూపులఁ గఱపిన మృగచయంబు
పయిని బాణంబుఁ బూఁచి వంచఁ జాల
నెక్కుపెట్టిన యీవింటి నింకనేను॥

విదూ—(రాజుమొగమువంకఁజూచి) దేవా! ఏమో మనసున నుంచుకొని యాలోచించుచున్నావు. నాపలుకు లరణ్యరోదనమాయెను.

రాజు—(చిఱునవ్వునవ్వి) మఱియేమున్నది? మిత్రునిమాట దాటరాదని చింతించుచుంటిని.

విదూ—దీర్ఘాయుష్మంతుడవుగమ్ము. [అని చనఁబోవుచున్నాఁడు]

రాజు—మిత్రుఁడా! నిలువుము. నేనింకను నీతో మాటాడవలసినదే యున్నది.

విదూ—దేవా! ఆనతిమ్ము.

రాజు— అలపు తీర్చుకొన్నపిమ్మట నీవు నాకొక్క యనాయాస కార్యంబునఁ దోడుపడవలయును

విదూ—కుడుములు తినుటయందాయేమి?

రాజు—చెప్పెదనుండుము.

విదూ— ఊరకున్నాను.

రాజు—ఓరీ! ఎవఁడురా? అక్కడ.

దౌవారికుఁడు—(ప్రవేశించి) దేవా! ఆజ్ఞయిండు.

రాజు—రైవతకా! సేనాపతింబిలువుము.

దౌవా—అలాగుననే. (అని నిష్క్రమించి సేనాపతితోడంగూడఁ బ్రవేశించి) ఇదె యాజ్ఞాపించువేడ్కతో భర్తయీవంకనే చూడ్కి నిగిడించియున్నాఁడు. దేవర న్సందర్శించుకొమ్ము.

సేనాపతి—(రాజుపైఁ జూడ్కివాలయించి) వేఁటచూచుటకు దోషయుక్తమయిన దయ్యును, స్వామియెడఁ గేవలము మేలుచేయునదియే యైనది. ఎట్లంటేని,

చ॥ పొరిపొరిమౌర్విలాగుటను బూర్వశరీరము గట్టివారఁ భా।
స్కరకిరణాళి కెంతయును సైచుచుఁజెమ్మట లేశమైననుం।
బొరయక, చిక్కియున్ దృఢతఁబొందుటఁ బల్చనిమేన, విక్రమ।
స్థిరుఁడయి యీతఁడొప్పెడును జెల్వగ శైలచరద్విపంబనన్॥

(దగ్గఱకువచ్చి) స్వామీ! జయమవుఁగాక! ఈయరణ్యమందుఁ గ్రూరసత్వముల సంచారములు నరికట్టినారము. ఇఁక నిచ్చటనుండ నేల?

రాజు—సేనాపతీ! మాఢవ్యుఁడు వేటను దూషించుటచేత నాకు దానిమీది యుత్సాహము పోయినది.

సేనా—(రహస్యముగా) వయస్యా! విదూషకా! నీపట్టును వదలకుండుము. నేను స్వామిచిత్తవృత్తి ననుసరించి ప్రవర్తించెదను. (ప్రకాశముగా) ఈమూర్ఖునిం బ్రేలుకోనిండు. ఇక్కడ దేవరయే నిదర్శనముగా నున్నారు.

సీ॥ కడుపులోఁగ్రొవ్వెల్లఁ గరఁగియత్యంతంబు నుదరంబుపలచనై యొప్పెసంగు।
వ్యాయామమునఁజేసి కాయంబుచులకగా నెత్తుటకర్హమై యేపుమీఱు।
జంతుసంతాన హృదంతరభయకోపముల వికారములును దెలియనగును।
శరముచలించు లక్ష్యమునందుఁదాఁకిన ధన్వికిఁ గరము సంతసముగలుగు।
వ్యసనమంచును వేటనుబలుకుచుంద్రు। రదియసత్యంబు కేవలమరసిచూడ।
వేఁటయే కానిపనియేని వేఱుచేనఁ। బుట్టునిట్టి వినోదంబు పుడమిమీఁద॥

విదూ—(కోపముతో) రాజుగారిప్పుడు తెలివిగలిగియే యున్నారు. నీవే వనచరుఁడవయి యడవడవి తిరుగుచుఁ గడకు ముసుక్కండలు కబళింపఁగోరు నొకముది యెలుంగు నోటఁ బడియెదవు.

రాజు——భద్ర! సేనాపతీ! పలుపలుకులేల? మనమాశ్రమసమీపమున నున్నవారము. కాఁబట్టి నీమాటల కేము సమ్మతింపనేరము. ఇప్పుడు——

మ॥ మునుఁగంజెల్లు నిపానవారిమహిషంబుల్ కొమ్ములాడించుచున్।
పెనునీడన్వసియించి లేళ్లు నెమరున్వేయం దగున్గుంపులై।
పనిగాఁబందులు ముస్తలెత్తఁ జను విశ్వాసంబునన్ గుంటలన్।
ధనువిప్పట్టున విశ్రమింపఁగనగున్ జ్యాబంధమున్బాయుచున్॥

సేనా——ప్రభువువారికి రుచించునట్లు కానిండు.

రాజు——అట్లయిన ముందుపోయియున్న వలవేఁటకాండ్రఁ గ్రమ్మరింపుము. మన సైనికులం దపోవనంబును విడిచి దూరంబుగఁ బోవునట్లు దిట్టము చేయవలయును. చూడు——

గీ॥ శాంతిపరులౌ తపోధనచంద్రులందు। దహనశీలమౌ తేజంబు దాఁగియుండు।
తాఁకఁదగియుండు సూర్యకాంతంబులట్లు। వెలికిఁదార్తురుపర తేజమడరదాని॥

సేనా——స్వామియానతిచ్చినట్లు.

విదూ——నీ యుత్సాహవార్తలు చాలించి, తొత్తుకొడుకా! పో.

[సేనాపతి నిష్క్రమించెను]

రాజు——(పరివారమునుఁ గాంచి) మీరు వేటవేషంబులఁదీయుండి. రైవతకా! నీవును నాయాజ్ఞ నడిపింపుము.

పరిజనము——దేవర యాజ్ఞాపించినట్లు. [అని నిష్క్రమించిరి.]

విదూ——నీవిప్పుడీగనైన లేకుండఁ జేసితివి. ఇఁక దట్టములగు తీవజొంపములతోడఁ గూడిన యీ చెట్టునీడను గూరుచుండుము. నేనును సుఖాసీనుండనయ్యెద.

రాజు——ముందునడువుము.

విదూ——రమ్ము నీవును రమ్ము. [ఇద్దఱును నడచి కూర్చున్నారు.]

రాజు——మాధవ్యా! నీవు కన్నులుగలఫలంబుఁ బొందలేదు. ఏలయన—— నీవు దర్శనీయమగు పదార్థముం జూడకపోతివి.

విదూ——అదేమి? నీవు నాయెదురనే యున్నావే.

రాజు——ఎల్లవారుం దమవారిని మనోహరమయినవారినిగానే చూచుకొందురు. నేనన్ననో యీయాశ్రమమున కలంకారభూతయగు నాశకుంతలం గూర్చి చెప్పుచున్నాను.

విదూ——(తనలో) కానీ నేనీయనకు సందీయకుండెదను. (బిగ్గఱగా) ఓమిత్రుఁడా ఇప్పుడు తాపసకన్యను సహింతము కామించుచున్నట్లు గనఁబడుచున్నావే?

రాజు——సఖా! పరిహార్యవస్తువుమీఁదికిఁ బౌరవుల మనస్సు పోదు.

విదూ——అట్లయిన నిదియేమి?

రా—గీ॥ అప్సరస్త్రీకిజన్మించియామెచేత। విడువఁబడిమానికిలభించె వెలఁదియామె।
చెట్టునను జాఱి జిల్లేడుచెట్టుమీఁదఁ। బడిన నవమాలికాప్రసవంబుపగిది॥

విదూ—(నవ్వి) ఓమిత్రుఁడా! ముద్దఖర్జూరంబు రుచియింపనివారికిఁ జింతపండు మీఁద బుద్ధిపోయినట్లు, స్త్రీరత్నముల పాటింపని నీకీకోరిక.

రాజు—నీవామెం జూచినవాఁడవు కావుగావున నీవిట్లు పలుకుచున్నావు.

విదూ—నీకును వింతఁబుట్టించుటంజేసి యామె సుందరియే కావచ్చును.

రాజు—వయస్యా! పెక్కేల?

ఉ॥ చిత్తరువందువ్రాసి తగజీవముపోసి విధాతతానులో,
కోత్తరరూపబృందముల నుల్లమునం దలపోసిచేసెనో।
యుత్తరుణీలలామ ననినీడొడగూడక చెన్నుమీఱుటన్।
దత్తనురామణీయకము ధాత సమర్థతయుం దలంపఁగన్॥

విదూ—అట్లయినచో, ఇఁకఁ జక్కని స్త్రీలకెల్లను బరాభవమే యగును.

రాజు—నామనసునకట్లే తోఁచుచున్నది.

ఉ॥ వాసనచూడనట్టి ప్రసవంబు, నఖంబులఁ ద్రుంపనట్టి నూ।
త్నాసమపల్లవంబు, పరులానని క్రొవ్విరితేనె, నూఁచివి।
న్యాసములేనిరత్నము, మహాతత పుణ్యఫలంబుఁబోలునా।
భాసురగాత్రినోయగ మెవండుభుజింప విరించివ్రాసెనో॥

విదూ—అట్లయిన, గారనూనెచే జిడ్డైన యొక యరణ్యవాసియయిన తపస్వి యొక్క చేతిలోఁ బడకముందే నీవామెను శీఘ్రముగా దక్కించుకొనుము.

రాజు—పరాధీనురాలుగదా యామె? ఇప్పుడామె జనకులును దగ్గఱలేరు.

విదూ—మఱి నీయం దామెకెట్టి యనురాగముగలదు?

రాజు—తపస్వికన్యలు స్వభావముచేతఁ బ్రగల్భురాండ్రు కారుగదా? అయినను—

గీ॥ ఏనభిముఖుండఁగాఁ జూపుఁ ద్రిప్పె। నన్యకారణమున నవ్వినట్లు నవ్వెఁ।
గావునమరుండుశీలంబుకలిమినడఁగి। స్పష్టముగ గూఢముగ గాక పరగియుండె॥

విదూ—ఏమి? అట్లుగాక చూచినంతమాత్రమున నీతొడమీఁదవచ్చి కూర్చుండునా?

రాజు—సఖులతో గూడి వెళ్లునపుడు వినయవతియయ్యును మిక్కిలి నాయెడ భావము గనుపఱిచినది. అట్లేకదా?

గీ॥ చరణముఁ గ్రుచ్చుకొనెఁ గుశాంకురమటంచుఁ।
గొన్నియడుగులె నడచి యాఁ గొన్నసలిచె।
తరుపుశాఖల వస్త్రంబు తగులుకున్నఁ। దీనికొసు దానివలె వెన్కఁ దిరిగిచూచె॥

విదూ—ఇట్లు నీకు బత్తెంబు లభించునేని, ఇఁక నీవీ తపోవనమును ఉద్యానవనముగాఁ జేసికొందువని తలంచెదను.

రాజు—మిత్రుడా! ఇక్కడి తపస్వులుకొందఱు నన్నానవాలుపట్టిరి. మనమొకసారి యేమిషచేత మరల నీయాశ్రమమును ప్రవేశింతమో యాలోచనచెప్పుము.

విదూ—మఱియొక యాలోచన యెందుకు? నీవు రాజవుకావా?

రాజు— అయిననేమి?

విదూ—నీవారధాన్యములో నాఱవభాగము మాకురావలెనని వెళ్లుము.

రాజు—ఓయిమూర్ఖుడా! వీరలను పరిపాలించినందునకయి, రత్నరాసులయినను విడిచిపెట్టి చేకొనందగిన మఱియొక భాగధేయము లభించుచున్నది. చూడుము—

గీ॥ ప్రజలవలన భూమిపతులకులభియించు। ఫలముక్షయము చెందఁగలదియగును;।
తాపసేంద్రులిచ్చు తపములనాఱవ। భాగమక్షయముగఁ బరగుమాకు॥

(నేపథ్యమునందు)—ఆహా! మేము కృతార్థులమయితిమి.

రాజు—(చెవియిచ్చి)ఓహో! ఇదిధీరప్రశాంతమగుస్వరము. తపస్వులుకాఁబోలును.

[దౌవారికుడు ప్రవేశించుచున్నాఁడు]

దౌవా—దేవా! జయమగుఁగాక! ఇద్దఱు ఋషికుమారులు వెలుపలనిలిచియున్నారు.

రాజు—అట్లయిన, వారినాలస్యము చేయక లోపలికిం దోడ్కొనిరమ్ము.

దౌవా—తీసికొనివచ్చెదను. (అని వెళ్లి ఋషికుమారులతోఁ బ్రవేశించుచున్నాఁడు) ఇటు. ఇటు. పూజ్యులారా! [ఇద్దఱును రాజువంకఁ జూచుచున్నారు]

ప్రథ— అహో! ఈయనమూర్తి తేజోవంతమయ్యును విశ్వసనీయముగా నున్నది! ఋషులకంటె నంతిన్నదు కాని రాజునందిట్లుండుట యుక్తమే. ఎట్లన్న—

చ॥ అరయఁగ సర్వభోగ్యమగు నాశ్రమమం దితఁ డుండు, నిత్యముఁ।
వరపరిపాలనంబునఁ దపఃఫల మాఱవపాలు గాంచు, నం।
బరతలమంటు ఋష్యభిద పావన రాజపదానుపూర్వమై।
సరసతమింబాడు పటుచారణ గీతముల దు మాటికిఁ॥

ద్వితీ—గౌతమా! ఈపార్థివుఁడు దేవేంద్రసఖుఁడయిన దుష్యంతుఁడా?

ప్రథ— మఱియేమి?

ద్వితీ— అట్లగుటచేత నేకదా!

చ॥ పురపరిఘాతి దీర్ఘభుజముల్ గల యీతఁడు శ్యామలాబ్ధియా।
వరణముగాఁగఁగల్గు మహీభారము నొక్కఁడె పూనుట బ్రమే।
సురయువతుల్ సురాహితుల క్షోభలుపుట్టినచో జయార్థమీ।
వరధునధిజ్యకార్ముకము వాసవవజ్రముఁ గోరుచుండఁగఁ॥

ఇద్ద—(సమీపమునకువెళ్లి) రాజా! నీకు జయమగుఁగాక!

రాజు—(పీఠమునుండిలేచి) మీకు నమస్కరించుచున్నాను.

ఇద్ద—మీకు మేలగుఁగాక! [అని ఫలములు కానుకయిచ్చుచున్నారు.]

రాజు—(నమస్కారపూర్వకముగా స్వీకరించి) మీయాజ్ఞకయి వేచియున్నాను.

ఇద్ద—మీరిక్కడనుండుట యాశ్రమవాసులెఱిఁగి మిమ్మొక్కటి ప్రార్థించుచున్నారు.

రాజు—వారేమి యాజ్ఞాపించుచున్నారు?

ఇద్ద—పూజ్యులయిన కణ్వమహర్షులు దగ్గఱలేనందున, రాక్షసులు యజ్ఞమునకు విఘ్నము చేయుదురు. కాఁబట్టి కొన్నిరాత్రులు మీరు సారథిద్వితీయులరై యథాహణులై యుండి యీయాశ్రమమును సనాథమునుగాఁ జేయవలయునని.

రాజు—నాకది యనుగ్రహమే కదా!

విదూ—(రహస్యముగా) ఇప్పుడీప్రార్థన యనుకూలమయినదే.

రాజు—రైవతకా! ధనుర్బాణసహితముగా రథమ్మును గొనిరమ్మని సారథితో నాపలుకులుగాఁ జెప్పుము.

దౌవా—దేవా! జయమగుఁగాక! దేవర యాజ్ఞాపించునట్లు చేసెద. [అని నిష్క్రమించుచున్నాఁడు.]

ఇద్ద—(హర్షముతో)

గీ॥ వినుము పూర్వులమార్గంబున ననుసరించు। నీకునియ్యది యుక్తంబునిక్కువముగ।
సవని నాపన్నరక్షణ యాగమందు। దీక్షితులుగారె పౌరవుల్ ధీవిశాల॥

రాజు—మీరుముందుగానడువుండి. నేనును మీవెనుకనే వచ్చెదను.

ఇద్ద—రాజా! నీకు విజయమగుఁగాక! [అనినిష్క్రమించిరి.]

రాజు—మాధవ్యా! నీకు శకుంతలాదర్శన కుతూహలము గలదా?

విదూ—ప్రథమమున వెల్లువగాఁ బాఱుచుండెనుగాని, యిప్పుడీ రాక్షసవృత్తాంతము చేత నొక్కబిందువయినను మిగులదయ్యెను.

రాజు—నాసమీపమున నుండువుగాని భయపడకు.

విదూ—ఎవ్వఁడునువచ్చి విఘ్నము చేయనియెడల, నేను నీరథమునకుఁ జక్రరక్షకుఁడ నయ్యెదను.

[దౌవారికుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దౌవా—స్వామీ! జయమగుఁగాక! రథము సిద్ధముగానుండి దేవరవారు విజయచేయుటను గోరుచున్నది. మఱియు రాజధానినుండి దేవిగారియాజ్ఞను బట్టుకొని కరభకుఁడు వచ్చియున్నాఁడు.

రాజు—(ఆదరముతో) ఏమి? అమ్మగారు పంపినారా?

దౌవా—అవును.

రాజు—అట్లయినఁ దీసికొనిరా.

దౌవా—ఆలాగే. (అనినిష్క్రమించి కరభకునితోడఁ బ్రవేశించి)—అదిగో రాజుగారు. సన్నిధికిం బొమ్ము.

కర——(దగ్గఱకు వెళ్లి) స్వామీ! శుభము గుంగాక! "నేటికి నాలవదినమునందు పారణ మానివేసి యుపవాసము చేయఁబోవుచున్నాను గాన, ఆదినమున దీర్ఘాయుష్మంతుఁడవగు నీవు దగ్గఱనుండవలయు"నని దేవిగారు తమ కాజ్ఞయిచ్చి యున్నారు.

రాజు——ఇక్కడ తపస్వికార్యము. అక్కడ గురుజనానుజ్ఞ. రెండును దాటఁగూడనివే. ఇందేది సేయుదును?

విదూ——త్రిశంకునివలె నడుమ నిలువుము.

రాజు——నీపరిహాసము చాలించు; నిజముగా నాకేమియుం దోచకున్నది.

ఉ॥ రెండును రెండుచోట్ల నొనరింపఁగఁ దగ్గవి యాటఁ గృత్యముల్।
రెండువిధంబులన్మది చరింపుచు నున్నది నాకు నియ్యెడన్।
గొండనువచ్చి కొట్టుకొని ఘూర్ణిలి వెన్కకుఁ బాఱినట్టి యు।
ద్దండ నదీప్రవాహము విధంబున నేనిపుఁడేమి సేయుదున్॥

(ఆలోచించి) అమ్మగారు నిన్ను నను గొమారునిగానే పరిగ్రహించియున్నారు. కాఁబట్టి నీవిక్కడనుండి కదలి, తపస్వికార్యము యొక్క ప్రాముఖ్యమును నివేదించి, దేవిగారికిం బుత్రకృత్యమును నిర్వహింపసమర్థుఁడవు.

విదూ——నేను రాక్షసులకు భయపడితినని గణించెదవు సుమీ.

రాజు——(చిఱునవ్వుతో) గొప్పబ్రాహ్మణుఁడవు నీకు భయముగలదని యెట్లు సంభావింపవచ్చును?

విదూ——అట్లయిన, రాజుగారితమ్ముఁడే ప్రకారముగా వెళ్లఁదగునో నేనాప్రకారముగా వెళ్ళెదను.

రాజు——తపోవనమునకు బాధకలుగకుండుటకయి నావెంటవచ్చినవారి నందఱిని నీతోడం బంపెదను.

విదూ——అట్లయిన, నేనిప్పుడు యువరాజనయితిని.

రాజు——(మనసులో) ఈబ్రహ్మచారి చపలుఁడు. అంతఃపురములో నొకవేళ నా కోరిక తెలుపునేమో! కానిమ్మి ప్రకారముగాఁ జెప్పెదను. (అని విదూషకుని చేయి పట్టుకొని ప్రకాశముగా) మిత్రుఁడా! మహర్షులయెడఁగల గౌరవముచేతనే నేనాశ్రమమునకు వెళ్లుచున్నాను. నిజముగాఁ దాపసకన్యయగు శకుంతలయందు నాకభిలాష లేదు చూడుము——

గీ॥ కనఁగ మనమేడ? యజ్ఞాతకామ యగుచు। సరిగ మృగశాబములతోడఁ బెరిగినట్టి।
ముగుదయిదియేడ! పరిహాసమునకు నేను। బలుకుమాటలు నిజమని తలఁపవలదు॥

విదూ—— ఆలాగే.

రాజు——వయస్యా! నీవు నీకార్యమునం బ్రవర్తిల్లుము; నేనును దపోవన రక్షణార్థమక్కడకు వెళ్లెదను. [అందఱు నిష్క్రమించుచున్నారు.]

ఉత్తరరామచరిత్రము- షష్ఠాంకము. [౨౧౬-పుటశేషము.]

స్త్రీ—ఏమి యిది! చంచలములగు మెఱుపుతుదుములచే నావరింపఁబడి మత్తమయూర కంఠములవలె శ్యామలములయిన వారివాహములు నభోభాగమున నిల్వఁజోటు లేక పరుగులిడుచున్నవి!

పురు—ఆశ్చర్యము! ఆశ్చర్యము! ఇదియావత్తు లవకుమారుఁడు ప్రయోగించిన వారుణాస్త్రప్రభావము గాని, తదితరము గాదుసుమా! చూడుము! చూడుము! దీనినుండి వారిధారలు అవిచ్ఛిన్నాసారముగాఁ గురియుచుఁ బావకాస్త్రమును బ్రశాంతిం బఁజేసినవి! వింత!

స్త్రీ—అహహ! ఇది నాకు బాగున్నదిసుమా! వహవా! ఎంతసొగసుగానున్నది!—

పురు—అయ్యో! అయ్యో! అబ్బబ్బా! ఇదిగో మితిమీఱినయెడలఁ జెఱుపుచేయును సుమీ. చూడుము! ప్రబలమారుతములచే నందఱు గుణగుణమనుచుఁ బరుగులెత్తుచున్న మేఘములు నిండుకొని, బ్రహ్మాండమెల్లను ధకారబంధురము గావింప నదియెల్ల, విశ్వము నొక్కముద్దగాఁ గబళింపఁదలంపుగొను కాలకంఠుని తెఱచిన యత్యంత కరాళవదన గహ్వరములోఁ జొచ్చినట్లు, లేక యుగాంతమునందు యోగనిద్రలో సర్వద్వారములను నిరోధించియున్న నారాయణుని యుదరము ప్రవేశించినట్లు అయి, సమస్తభూతజాలమును గంపిల్లుచున్నది!

మంచిపనిచేసితివి చంద్రకేతూ రే! నీపుణ్యము బ్రదికెదము. సమయమునకుఁ దగినట్లు వాయవ్యాస్త్రప్రయోగము చేసితివిగదా. చూడుము!

క॥ కుదురఁగ బ్రహ్మజ్ఞానము। మదిని బ్రపంచంబుమీఁది మమతలువోవుం।
గద, యట్లె మారుతాస్త్రము। చిదిమెనుగా మేఘపఙ్క్తిఁ జెల్లచెదరుగా!॥

స్త్రీ—ఎవరు ఈయన? ససంభ్రమముగా వస్త్రాంచలము చేతనెత్తి, దూరమునుండియే యుద్ధము చేయుచున్న రాజకుమారులను మధురవచనములతో నామంత్రించి యాపి, తనయొక్కన విమానముతో నారుపురనడుమను దివినుండి భువికి దిగుచున్నవాఁడు?

పురు—(చూపించుచు) ఈయనా? శంబూకవధచేసికొని తిరిగి వెనుకకు వెళ్లుచున్న రఘురాముఁడు కాఁడా?

మత్తకోకిల॥ సంగరి దివ్యజనోక్తవాక్యము నీతిమైని శాంతియు।
ప్పొంగఁగా లవుఁడెంతొ భక్తిని బోరుమానఁ గలంబడెన్।
సంగరంబదె చంద్రకేతువు ప్రమోక్కెఁ; బుత్రుల గూడుటన్।
మంగళంబౌ గూడుతన్ మనమంచి రాజునకింతటన్॥

ఇఁక మనము పోదము రావే. [అని యిద్దఱును నిష్క్రమించిరి.]

ఇక్కడను విష్కంభము సరి.

[అంతట రాముఁడు, లవుఁడు, బ్రణతుఁడగుచు చంద్రకేతువును ప్ర॥తు.]

రామ—(పుష్పకమునుండి దిగుచు)

క॥ దినపకులచంద్రకేతూ! నను బిగియంగా గౌఁగిలింపనడ తెమ్మా! చ
ల్లని నీమృదులాంగస్పర్శనయిన నాచిత్తవహ్ని శాంతిలు నేమో!॥

చంద్ర—ఇదె, నానమస్కారము!

రామ—(లేవనెత్తి, స్నేహబాష్పములతోఁ గౌఁగిలించుకొని.) దివ్యాస్త్రధరదేహుఁ
డవగు నీకుఁ గుశలముగలదుగదా?

చంద్ర—అద్భుతచరిత్రుఁడై ప్రియదర్శనుఁడగు ఈలవుతో నాకు స్నేహము కూడఁ
గాఁ, గుశలమునకుఁ గొదవేమి? నాయనా! మీ ప్రభావ మేము మనవిచేయగల
మ్మ? వీరిని, నాయనా!, మీరు, నన్నుఁజూచెడు అభేదదృష్టితో నే కాక, నాకంటె
నెక్కువదయతోఁ జూడవలయును. ఈతండు మహావీర ప్రకాండుఁడు గాని
సాధారణుఁడు గాఁడు సుండీ!

రామ—ఆహా! మాకుమారుఁడు చంద్రకేతువుయొక్క వయస్యుఁడగు ఈఅబ్బాయి
యాకారము అతికళ్యాణావహముగా నున్నది! ఏమిభాగ్యము! ఇతఁడు—

ఉ॥ జగములఁ బ్రోవ గాఁ బుడమి జన్మముఁ దాల్చిన యస్త్రవేదమో,
నిగమసమూహరక్షణకు నిల్చిన క్షత్రియధర్మమైనమో!
సుగుణసుపౌరుషంబులను జొక్కపు మేను వహించు నున్నతిమో!
జగదతిపుణ్యకార్యముల సంచయమై వెలుగొందు సత్వమో!॥

లవ—అహో! ఈమహాపురుషుఁ డెవ్వరో కాని, ఈయనదర్శనమువల్లఁ బుణ్యాను
భావము లభ్యేడు గదా! ఈయన,

క॥ ఆశ్వాసస్నేహములకు శౌర్యద్యుతికి నొక విశాలాధారుఁ
డీశ్వరుఁ డక్షతధరమో విశ్వము లోమూర్తితోడ వెలసినవాఁడో॥

ఆశ్చర్యము! వింత!

ఉ॥ ఈమహనీయుఁ జూడఁగ నదేమొ విరోధము మాని, సంతసం
బీమెయిఁ బర్వె సుద్ధము సహింపక నన్ను వినీలవంచెడున్,
ప్రేమను నన్నుఁ బెంపఁగల పెద్దల దర్శనమైన దిక్కుడన్;
భూమిసమస్తతీర్థములవోలె మహాత్ములు గౌరవాస్పదుల్॥

రామ—ఏమియిది? ఈచెప్పపాటులో నాదగు చిరకాలసంతాపము చల్లారి, నా
యంతరాత్మ ఏనిమిత్తముచేతనో కాని వాత్సల్యపూరితమయినది! స్నేహమునకు
బాహ్యనిమిత్తముండుననుట యసంగతముగనుక, యిందులకు నిమిత్తము లేదనియే
చెప్పనొప్పును.

ఆ॥వె॥ వస్తువులకుఁ బ్రీతివర్ధిల్లఁ జేయదు బహిరుపాధియెపుడు: పరమగూఢ
కారణంబుగలదు; కానున్న సూర్యుని ఖరకరములు దగిలి కమలవనము

లవ—చంద్రకేతూ!— వీరెవ్వరు?

చంద్ర—ప్రియవయస్య! వీరా!— మా తండ్రిగారుగాదా?

లవ—సరే, నీకుఁ దండ్రిగారైనచో, న్యాయముగ నకు వీరు నాకును దండ్రిగారే కదా. కాని, నీకుఁ దండ్రిగారి వరుసవారు రామాయణకథాపురుషులు నలుగురుగాదా మహాత్ములున్నారంటివి. అందులో వీరెవ్వరో చెప్పవా?

చంద్ర—మా తండ్రులలోని కెల్ల వీరు జ్యేష్ఠులుసుమా.

లవ—(ఉల్లాసముతో) ఏమీ? రఘురాములా వీరు? ఈదివ్యపురుషుని దర్శనము లభించినదిగనుక ఈ ప్రొద్దు ఎంతో సుదినముగదా! (వినయకౌతుకములు పెనఁగొన) నాయనగారూ! శ్రీవాల్మీకి శిష్యుఁడగు లవుఁడు నమస్కారము సమర్పించుకొనుచున్నాఁడు!

రామ—(స్నేహముతో) దీర్ఘాయుష్మంతుఁడవు! అబ్బాయీ! ఇటురా! ఇటురా! (వాత్సల్యముతో నాలింగనము చేసికొని) ఓయీ! అబ్బాయీ! అతివినయమేల? చాలు. వలదు. త్వరగావచ్చి యనేకపర్యాయములు నన్ను బిగువుగాఁ గౌఁగిలించుకొనుమా!

క॥ మందపుఁ రేకులపద్మము । నందలి పల్లవదళంబు నంటను దోఁపన్ ।
జందన చంద్రస్పర్శా । నందము నీస్పర్శ నామనంబున కొసగెన్!॥

లవ—(తనలో) ఈమహానుభావునకు నామీఁద నిరుపాధికవాత్సల్యము పుట్టెను. అయ్యో! అజ్ఞుఁడనై యీయనతో నింతటి విరోధము తెచ్చిపెట్టుకొంటిని. అంతట ఆగక, ఆయుధమునుగూడ ధరియించి, యింతమంది బలమునోర్చి, ఇంతటి మర్యాదను గూర్చితి! (ప్రకాశముగా) ఇప్పటి లవుని బాలిశతకుఁ బెద్దలు వానిని లోఁగొని మన్నింపవలయును.

రామ—లవకుమార! ఇపుడు నీవేమి యపరాధము చేసితివి?

చంద్ర—తండ్రిగారూ! మీయశ్వము వెంబడి రక్షకులుగావచ్చిన సైన్యపతులు మీ ప్రతాపోత్కర్షము నుద్ఘోషింపఁగా, విని యీతఁడు సహింపక వీరచారిత్రము నెఱపినాఁడు.

రామ—సరే! బాగున్నది. అట్లు చేయకున్న క్షత్రియకుమారున కలంకారమేగాదె?

మ॥ ఒక తేజస్విది తేజమన్యులు సదా యోర్వంగలేకుండుటల్ ।
ప్రకృతిస్థాపనగాని మధ్య కృతకప్రాయంబుగాదెప్పుడున్ ।
స్వకరవ్రాతము సాఁచి భాస్కరుఁడజస్రంబుం దపింపఁగా ।
నకృతంబౌచును సూర్యకాంతమణి పూన్కిం గ్రక్కదే తేజముల్?॥

చంద్ర— నాయనా! ఈ నా సఖుఁడగు వీరుని క్రోధావేశముగూడ అప్రతిహత

ప్రయోగించిన జృంభకాస్త్రప్రభావముచేత నే కదలక మెదలక స్తంభించిపోయినవి.

రామ—(అటుచూచి) లవకుమార! నీఅస్త్రములను ఉపసంహరింపవోయి! చంద్రకేతూ! నీవు వెళ్లి తాము నిర్వ్యాపారులైనందులకు లజ్జించుచున్న ఆసైన్యపతులను బరామర్శించిరావోయి.

లవ—పెద్దలు మీరుచెప్పినట్లు చేసెదను. (అని ధ్యానించుచున్నాఁడు.)

చంద్ర—మీయాజ్ఞనశిరసావహింతును. (అనినిష్క్రమించెను.)

లవ—నాఅస్త్రము ప్రశాంతమయినది

రామ—కుమార! ఈఅస్త్రములు సంధానసంహారములులలో గూఢమంత్రప్రయోజ్యములే! ఇవినీకు గురుపరంపరావశమునఁ జేపడెనాఏమి?

పూర్వము వేదరక్షణకొఱకు,

తే॥గీ॥ బ్రహ్మమొదలైనట్టిపురాణగురులు పట్టివేయేండ్లపైనఁ దపస్సుచేసి,।
కొనకునిజతపోమయతేజమునఫలముగఁ గాంచిరిజృంభకాస్త్రప్రకాండములను!॥

తరువాత, ఈ మంత్రపారాయణోపనిషద్రహస్యమును భగవత్స్వరూపులగు కృశాశ్వమహర్షులవారు, తమతోడ వేయేండ్లునిండ నధ్యయనంచిన శిష్యుఁడగు కుశికపుత్రునకు విశ్వామిత్రునకు: గటాక్షపూర్వకముగా నుపదేశించిరి పిమ్మట, ఆవిశ్వామిత్రులవారు నాకుపదేశరూపముగా ననుగ్రహించిరి.— ఇది యీయస్త్రముల పూర్వప్రకారము, నేనెఱుగుదును. మరి, ఇప్పుడివి యేయేసంప్రదాయము గుండ, గుమారలవ! నీకుఁజేపడినవో వినఁగోరుచున్నాఁడనుగదా?

లవ—తండ్రీ! ఇవి మా ఉభయులకు వానిఅంతట అవే ప్రకాశముతో వచ్చినవి!

రామ—(ఆలోచించి) ప్రకృష్టమగు వీరల పూర్వపుణ్యము పరిపక్వముగాఁగా, యీమహిమ వీరికి బహుమానముగా గలిగియుండనోపును! కాని, 'ఉభయులకం'టి వెందుచేతనోయి, నాయనా!

లవ—మేము కవల మన్నదమ్ములమిద్దఱముఁ గనుక.

రామ—అట్లయిన, అరెండవవాఁడేడీ?

అంతట నేపథ్యమందు— భాండాయనా! భాండాయనా!

శా॥ ఆయుష్మంతుఁడు మా లవుండు రఘురామాధీశుసైన్యంబుతోఁ।
దాయుద్ధంబున నోహరించినది సత్యంబేకదా, స్నేహితా!
నాయీనాటి పరాక్రమద్యుతి నిరాఘాటంబు చక్షుంజుమా!
మాయన్నేటికి క్షత్రవీరుల శిరోన్మత్తజ్వలత్కీలలుః!॥

రామ—తే॥గీ॥ నీలనీరదగర్జలు నెఱయఁగానె। ముగ్ధదాల్చుకదంబముపోల్కిఁగాను;
బలుకువినఁగానె నామేనఁబులకలెసఁగె, నింద్రనీలమణిచ్ఛవి, యీతఁడెవరొ?॥

లవ—ఇదుగో? ఇతఁడే మాఅన్న! ఈయనపేరు కుశుఁడు. భరతాశ్రమమునుండి

రామ—(దివ్యదృష్టితో) కుమార! దీర్ఘాయుష్మంతుఁడగు ఆపిల్లవానిని ఇటఁబిలు, చూతము!

లవ—సరే. [అని నడిచివెళ్లుచున్నాఁడు.]

[అంతటఁ గుశుఁడును ప్ర॥ఁడు.]

కుశ—(అద్భుత హర్షధైర్యములతో వింటినారి సారించుచు)

ఉ॥ భాస్కరగోత్రమందు మనువంశమునం జనియించి భూరితే
జస్కతయొప్ప నింద్రునకు సౌఖ్యము గూర్పఁగనేర్చి, దృప్తచే
తస్కుల రూపుమాపఁగఁ బ్రతాపముచూపెడు గొప్పవారితోఁ
బుస్కన నాకుఁ బోరుదగెఁ! బోల్పఁగ నాధనువెంతధన్యమో!॥

[అని భయంకరముగా నడుచుచున్నాఁడు]

రామ—ఈ క్షత్రియ డింభకునితోఁ గల పౌరుషాతిరేక మేమనిచెప్పను?

తే॥ గీ॥ చూపుముజ్జగములు మెచ్చ దేపుబలిమిఁ, గాలిత్రొక్కుడులకునువంగం ధరిత్రి;
పనితనంబునె కొండంతబలముపట్టె! వీరమో, దర్పమో, పుట్టి వీఁడెవచ్చె!॥

లవ—(చేరవచ్చి) అన్నగారికి జయవిజయములు!

కుశ—ఆయుష్మంత! తమ్ముఁడా! ఏమిటియిది? "యుద్ధము" "యుద్ధము"అనుచు వార్తపుట్టినది?

లవ—ఇది యెంతటిసంగతిగాని,— అన్నయ్యా, నీవిపుడు నీదర్పోద్రేకము మాని, ఈపెద్దలకు వినయముగా నడుచుకొమ్మా!

కుశ—ఎందుచేత?

లవ—ఈ కూర్చున్నవారు రఘురాములు! వీరు మనయిద్దఱిమీఁద వాత్సల్యము చూపుటేకాక, యింతకుమునుపు నిన్నుఁ జూడవలెనని కోరియున్నారుగూడ.

కుశ—(లక్ష్యభావముతో) వేదంబులకు రక్షాకర్తయగు రామాయణ కథానాయకుఁడా యీయన?

లవ—మరేమి? ఆయనయే, అన్నయ్యా!

కుశ—అటులయినచో, ఈమహాత్ముని దర్శనము పుణ్యదముగనుకఁ గోరఁదగినదే. అన్నీసరేకాని, ఇంతటివారితో నేనెట్లుమాటలాడఁదగినదినిశ్చయింప నేరకున్నానే.

లవ—దానికేమి? తండ్రిమొదలగు పెద్దవారిని సంబోధించినవిధముగానే చేయవచ్చును.

కుశ—ఇదియెట్లుగుదురును? ఏమనిపిలుచువాఁడను?

లవ—ఊర్మిళాతనయుఁడగు చంద్రకేతువు సౌజన్యధురంధరుండు నాయీడువాఁడు నాతో మిగుల సఖ్యంబు చూపుచుండెను. కాఁబట్టి, యతని సంబంధముచేత ఈ రాజర్షి మనకు ధర్మపితవరుస కావచ్చును.

కుశ—ఇదిగాక, రాజకుమారునకు రాజ్ఞిని గౌరవింపకపోవుట అతిగర్హణీయము గూడ.

లవ—ఇదిగో! ఇదిగో! అన్నా! ఈదివ్యపురుషునిఁజూడుము! ఈయన ఆకారానుభావములు, గాంభీర్యమును వేనోళ్ల యీయన లోకోత్తర చరితాతిశయుఁడని చాటుచున్నవి!

కుశ—(చూపించుచు) ఆహాహా!

క॥ ప్రామోదికరూపంబును। గానింపఁ బవిత్రశక్తి కలఁడుగనుకనే।
రామచరిత్రము దెలిపెడు। రామాయణవాక్యములు సరస్వతిమెచ్చెన్॥

(సమీపించి) నాయనా! ప్రాచేతసశిష్యుఁడగు కుశుఁడు నమస్కరించుచున్నాఁడు.

రామ—దీర్ఘాయుష్మంతుఁడా? ఇటురా! ఇటురా!

క॥ అమృతముగురిసెడు జీమూతమువలె నునుసేను నీవు దాల్పఁగ వాత్స।
ల్యముకొలఁదిఁ గౌఁగిలింపం। దమకించెదు నీకు నామనంబు, కుమారా!॥

(కౌఁగిలించుకొని, తనలో) ఏమిటియిది? ఈపిల్లవాఁడు నాకుఁబుత్రుఁడా ఏమిటి?

ఉ॥ కండకుఁ గండదాఁకఁగనె కాయమును స్నేహములం గమంగమం।
దుండియు, దేహసారమును నొక్కటి, నాపరమాత్మ బైట ని।
ల్చుండెనొయేమొకాని చెడియున్నహృదిన్ సవరించియద్భుతా।
ఖండముదబ్ధి లబ్ధమయి, కౌఁగిలిముంచెననున్ సుధాంబుధిన్॥

లవ—నాయనా! ఘర్మదీధితియయి సూర్యభగవానులు లలాటమును దపియించుచున్నాఁడు. కాఁబట్టి తమరు ఈసాలవృక్షచ్ఛాయను ముహూర్తమాత్రము దయచేసి కూర్చుండుఁడీ!

రామ—మంచిది! సరే! నాప్రియకుమార!

[అని అందఱువెళ్లి నీడక్రిందఁ గూర్చున్నారు.]

తిరిగి, రామ—(తనలో)

క॥ కుశుఁడును లవుఁడును వినయ। ప్రశంసలకు గజ్జెగట్టు వాండ్రైనను, ద।
ద్విశద స్థితిగతులు సమ। స్తశరణ్యత దెలుపు భువనసమ్రాట్చిహ్నల్॥

తే॥గీ॥ విప్పఁదమ్మికి మకరందబిందులవలె,। నమలినమణికి రశ్ములయంది కగతి।
వీంద్రుఁడ సహజన్య సద్గుణవితతివీంద్ర। ప్రతిజనమనోజ్ఞ వపువులకతిజగద్వి।
లాసలక్ష్మిని గూర్చెదులాఁగుఁదోఁచు॥

ఇదిగాక, ఈకుశలవకుమారులయందు రఘువంశీయ రాజకులస్వాభావిక కాంతులును మెండుగఁ గానవచ్చుచున్నవి!

తే॥గీ॥ కాయములుమీరుఁగలరవకంఠకాంతి,।
మూఁపులెంతయు నాబోఁతుమూఁపురములు;।

అరయఁ జూపు ప్రశాంత సింహ స్తిమితము।
ధ్వని మృదంగమువలె శుభావహము, వహవ!॥

(సూక్ష్మముగాఁ బరీక్షించిచూచుచు) ఓహోయి! ఈకుమారుల యాకారములు మావంశస్థులవానితోఁ బోలికలు నైజపుటేకాదోయి!

తే॥గీ॥ నిపుణముగనీకవలయందగుపడెడునవె। జనకతనయానురూపలక్షణములన్ని!।
కనుక, నళినవశతపత్ర కాంతిమంత। మైననాప్రియురాలి యాస్యంబుతీరిగి।
వేడుకలుమీఱఁ గన్నులంజూడఁగల్గె!॥

తే॥గీ॥ ముత్తియపు దంతములసౌరు, మోవితీరు,।
పోల్కి వెలిదూఁక వీనులపొంకమదియు!।
కన్నులెఱుపును నలుపైనఁ, గానితలఁప,।
వానిసౌభాగ్యగుణము సమానమగును!॥

ఈచోటు శ్రీమద్వాల్మీకి తపోవనముగదా! వెనుక, సీత ఒంటరిగా విడువఁబడినదిగూడ ఇక్కడనేకదా! వీండ్రశరీరలక్షణములు సీతను బోలియే యున్నవిగదా! మరి, జృంభకాస్త్రములు తమకు వానిఅంతట అవే స్వయంప్రకాశములతో వచ్చినవనికదా చెప్పిరి! మంచిది, వెనుకఁ జిత్రపట దర్శనకాలములోఁ బ్రసంగవశమునఁ బూర్ణగర్భిణియగు సీతకు 'ఆమెకుఁ గల్గఁబోవు సంతానమునకు ఈ మహాస్త్రములు స్వయంప్రకాశితములై రాఁగలవ'నిగదా వరమిచ్చియుంటిని. అవును. జ్ఞాపకమునకువచ్చినది! ఆవరమువల్ల వీండ్రకుఁగలిగియుండునేమొకదా! దివ్యాస్త్రము లెప్పుడును సంప్రదాయసిద్ధములుగానివి ఉండునని పూర్వులచే నెవ్వరిచేతను వినియుండలేదుగదా! ఈ యీ యంశములనన్నిటిని విచారించుటలో నిలుకడదప్పి మున్నీటఁ గొట్టుకొంచున్న నాహృదయమునకు సుఖాతిశయము దొరికినట్లున్నది! ఇంతేకాకుండ, వెనుక, నాప్రియురాలి గర్భముచూచి కవలపిల్లలు పుట్టుదురనికూడ నేను అనుకొంటినే! (కొలఁకులనీరుదెచ్చి)

ఉ॥ తొల్లిరహస్యవేళ సతితో నొకనెజ్జఁ బరున్నయప్పుడే।
మెల్లగఁజేతితోఁ గడుపుమీఁద మహాప్రణయాప్తి దువ్వుచుఁ।
బల్లవపాణిగర్భ మిఱుపాయలుగా విడియుంటెఱింగితిఁ।
జెల్లినకొన్నినాళ్లకును సీతయుఁదానెఱిఁగెం ద్విధాస్థితిఁ॥

(అని యేడ్చుచున్నాఁడు) సరే, దానికిఁ జేయవలసినదేమిటి? ఏయుపాయముచేతనయినను, వీండ్రనడిగి జాడలుదీయుదునా!

లవ——నాయనా! ఇదియేమిటి? ఎందులకు?

క॥ పెనుమంచు సోనలంబడి। మునిఁగిన వెలిదమ్మిచాయ మొలతేర, జగ।
జ్జనమంగళమగు నీముఖ। కనత్కపోలములగుండఁ గన్నీరేలా?॥

కుశ—ఏమోయి! తమ్ముఁడా!

ఉ॥ పాయఁగ సీత రాముఁడు ప్రపంచములో సుఖియింపనెట్లగున్?।
మాయము గాఁగనే ప్రియసమస్తజగత్తు నరణ్యమైతగున్।
బాయపునాఁటి స్నేహ మెడబాసిరి యెన్నటికీ; వుమున్నరా।
మాయణమే యెఱుంగని క్రమంబున నిట్లడుగంగ బోలునే!॥

రామ—(తనలో) సరే! ఇప్పడీమాటలవల్ల నేమి ప్రయోజనము? ఓ నా పాడుహృదయమా! వీండ్ర ప్రసంగమువల్ల నా యూహ యసత్యమని తెలియుచుండఁగా, వేఱే ప్రశ్నవల్ల లాభమేమి? ఓ పనికిమాలిన హృదయమా! ఏల నీకిట్లు హఠాత్తుగా వాత్సల్యచాంచల్యము ఉదయించినది! ఈ విధముగానయిన, నా హృదయచాంచల్యమెఱిఁగి, యీ పిల్లవాండ్రు గూడ నన్నుఁజూచి జాలిపడఁదగ్గస్థితిపట్టెను గదా! కాని, యీ సంగతి కప్పివేసి, యింకొక్క ప్రసంగమునకు దింపెదను. (ప్రకాశముగా) కుమారులారా! మీరేమో 'రామాయణమని' మాటలాడుకొన్నారే? అది ప్రభాకరవంశప్రశస్తిని శ్రీమద్వాల్మీకులవారు సరస్వతీ మనోహరముగా రచియించిన యుద్గ్రంథము గాదా! అది మీరు అభ్యసించియుండినయెడల, అందలిది, ఏదో కొంతభాగము మీ ముఖతః వినఁగాఁ గుతూహలపడుచున్నాను.

కుశ—ఆ గ్రంథము సమగ్రముగా మేము వల్లించినారము. అందలి బాలకాండము యొక్క యంత్యాధ్యాయమందలి రెండుశ్లోకములివిగో నా నాలుకమీఁద ఆడుచున్నవి!

రామ—ఏవీ! అబ్బాయీ! అవిచదువు.

కుశ— "క॥ రామునకు సుగుణతత్పరి। రామునకును సీతయట్లు ప్రకృతివశమునన్।
రామయయి, స్వగుణగణమున। రాముఁడు తనమీదఁ గూర్చు ప్రణయము పెంచెన్॥"
"క॥ సీతయు నటువలె రామునికై తన ప్రాణము అకంబై నధికము పలచెన్।
ఖ్యాతిగ వారిరువుర సంప్రీతియొఱుఁగవశమె, వారిహృదయమె యెఱుఁగున్॥"

రా—అయ్యో! ఎంత దారుణములాయెను! ఈ మాటలు నా హృదయ మర్మములను ప్రీల్చుచున్నవే! అయ్యో! నా ప్రాణనాయికా! అప్పుడిట్లు నన్ను నీవలచిన మాట సత్యమే! అయ్యయ్యో! ఈ మధ్య నాకస్మికముగా సంభవించిన దైవవిపర్యాసములమూలముగా, ఈ సాంసారవృత్తాంతము ఇష్టజనవియోగమును ఘోషించుచు, ఎన్నటికిం దుదగానిపింపని దుఃఖములో నన్ను ముంచుచున్నది!

ఉ॥ పూనికతోనటుల్ మనము పొందినహర్ష సుధాబ్ధియేదొకో!।
ఏనిను నీవు నన్నుఁ బ్రణయించిన యత్నము లెందుఁబోయెనో!।
ఓ నలినాక్షి! నాఁటి మనయుత్సవమెం దదుగంటియుంకెనో!।
తూనిక నైత్యమొంది సుఖదుఃఖములొందు మనస్సు లేదనో!।

వీనినిగోలుపోయి పలవించెదునన్ సుఖపెట్టలేకనా।
ప్రాణముపోదు! పూర్వకృతపాపము పండ సుఖంబులబ్బునే?

అయ్యో! అయ్యో!

క॥ నాహృదయేశ్వరిసద్గుణ। సాహస్రముఁదలఁచుకొనఁగఁ జనదనిమానం।
గా, హృదయమగలనీగతి। నూహలుదలఁపించి, దుఃఖముప్పొంగించెన్॥

క॥ అంతటఁ గొన్నిదినములకుఁ। గాంతకు జవ్వనమునిండఁ, గాయమనసులం।
దంతంతఁ బెరుగఁజిహ్నలు,। మంతనములమాటువెట్టె మదనుఁడు నెలమిన్॥

కుశ— వెనుక మందాకినీతీరములందుఁ జిత్రకూట వనవిహారములో రఘుపతి సీత నుద్దేశించి పలికిన శ్లోకమిదిగో జ్ఞాపకమునకు వచ్చినది.

“క॥ ఈకొండమొదటఁ, బ్రక్కల। నీకొని వకుళంబు పుష్పవృష్టి గురియఁగా।
దాఁకొన్నశాతిచౌకము। నీకొఱకే యేర్పడినది, నీరజనేత్రా!॥”

రామ—(సిగ్గుపడియు, స్నేహకరుణములుదోఁప) వీంద్రవాగ్ధోరణి అతిమధురముగా నున్నదిగదా! అందులో, అరణ్యసంచారులుగనుక, మరీ మెచ్చవలసియున్నది!— అయ్యో! ఓప్రాణనాయికా! అట్లు, అప్పటి మన పరస్పర విశ్వాసస్నేహములకు సాక్షీభూతములగుచున్న ప్రదేశములను మఱువవుగదా! అయ్యో! ఎంతకష్టము వచ్చెను!

(షట్పాది)ఉ॥ చేకొనిమేనఁబెంపెసఁగు చెమ్మటబిందువు లాఱ్పఁగానుమం।
దాకినిచల్లగాలి, విడినల్లడ ముంగురులున్ లలాటమున్।
బైకొని మోముచందురునిఁ బాజునుజిమ్మఁగఁ, గుంకుమాంకిత।
త్వాకృతిలేకయేసొగసు లాడెడుమేలి కపోలపాళితో,।
లేకె విభూషణావళులు లీలవహించెదు కర్ణలక్ష్మితో।
నాకుఁ బ్రియాస్వరూపమిటు జ్ఞప్తికివచ్చెఁ దలంచుచుండఁగా!॥

(కొంతవడిబాపడినట్లుండి జాలితో) అయ్యో! ఎంతలెంతలు పాపిష్ఠకార్యములు వచ్చెను!

(పంచపాది) ఉ॥ ఆదటఁజిత్తవీథిని బ్రియాంగనఁగూర్చి నరుండువేమఱున్।
దాఁదలఁపం బ్రవాసమునఁ, దప్పకకన్నుల ముందునిల్చియెం।
తోదయసంతసంబిడెడుఁ; దుట్టతుదన్ మదినూహచావఁగాఁ।
జీదరగొట్టి యీజగము జీర్ణవనంబయి ఖేదపెట్టఁగా,।
నూదరచిచ్చులో హృదయమూరక రాఁజుచు మండునక్కటా!॥

అంతటఁ దెఱవెనుక—

ఉ॥ ఈకడబాలయుద్ధమని యెవ్వరుచెప్పిరొ, భీతినొందివా।
ల్మీకివసిష్ఠులున్ జనకమిత్రుఁ డరుంధతి వృద్ధరాజ్ఞులున్।

జీఁకుటాడళ్లతోఁ దమరు చేరఁగలేక తపోవనంబు, నెం।
తోకఠినంబుగా నడుచుచుండిరి, చిత్తముతీవరింపఁగన్॥

రామ—భగవత్స్వరూపులగు అరుంధతీవసిష్ఠు లిక్కడ కెట్లువచ్చిరో! మాతల్లులు, జనకమహీపాలుండునుగూడనా? వీరిందఱు నిక్కడ నెట్లయిరో! (జాలిగొలుపుచుఁ గలయఁజూచి) అయ్యో! నిర్భాగ్యుఁడను! జనకమహారాజుగూడ వచ్చుచున్నాఁడనఁగానే నాగుండెలు పిడుగుతాఁకుచేతవలె రెండువ్రక్కలయ్యెను!

(షట్పాది) చ॥ వలచినమన్వగూడెనిటు భాగ్యమటంచు వసిష్ఠముఖ్యులున్।
వెలయ, వివాహదీక్షగొను పెండ్లికుమారులఁ బెండ్లికూఁతులన్।
గలకలచూచి వేడ్కపడఁ గంటిని దండ్రినిమామనట్టు, నేఁ।
డెలుగులుతోడుగా మహదనిష్టము పాలయియున్ననన్నునూ।
మలుకనుగొన్నవెంటనె సమస్తవిధంబుల నామనస్సుము।
ద్రలువిడిపోకయుండెను నెః రాముఁడు చేయని ఘోరముండునే!॥

తిరిగి తెఱవెనుక—అయ్యో! పాపము!

తే॥గీ॥పూర్వసౌభాగ్యములగుర్తుపోల్కఁగల్గి। చిక్కియున్నయల్లునినివీక్షించిమొదట।
మూర్ఛపోయినజనకుండుస్మరణదెలిసెఁ। బిదపరఘురాముతల్లులుప్రిదిలిపడిరి!॥

రామ—అయ్యో! తండ్రీ! అయ్యో! తల్లులారా! అయ్యో జనకా!

క॥ జనకరఘువంశరాజుల। కునశేషమహాభివృద్ధి గోత్రశుభంబుల్।
దనరించినదయితనుద్రో। సినరామునిఁ గనికరింపఁ జెల్లదుమీకున్!॥

ఇంతకు, వీరిని గౌరవింపవలదా! [అని లేచుచున్నాఁడు.]

కుశ & లవ—నాయనా! ఇట్లు, ఇట్లు. (అని, జాలిగొన్న మొగములతోఁ గొంత నడుచుచు, అందఱు నిష్క్రమించిరి.)

ఉత్తరరామచరిత్రము.

సప్తమాంకము.

[అంతట లక్ష్మణుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

లక్ష్మ—ఓయి! ఓయి! నేఁడిచ్చటికి బ్రహ్మక్షత్రియ పౌర జానపదసహితముగా మనను శ్రీమద్వాల్మీకులవారు ఆహ్వానముచేసిరేకాకుండ, ఆయనగారు నిజమాహాత్మ్యప్రభావముచేత దేవాసురులను, దిర్యక్కులను, ఉరగులను, వేయేల స్థావరజంగమరూపమగు నఖిలజగజ్జాలమును ఇచ్చోట సన్నిధియగునట్లు చేసినారు. మాఅన్నగారు నన్నుఁబిలిచి "తమ్ముఁడా! లక్ష్మణకుమార! భగవత్స్వరూపులగు శ్రీవాల్మీ

కులవారు తమరురచియించిన నాట్యప్రబంధమును దివ్యగాయనులగు అప్సరస్త్రీల మేళముచేత ఆడింతురఁట. ఆమహోత్సవమును జూచివెళ్లఁగా మనను బిల్చి నారుగనుక, నీవు శీఘ్రముగాఁబోయి గంగాతీరమునందు రంగభూమి యేర్పర్చి, యందు ఆతోద్యస్థానమును, సమాజసన్నివేశమును క్రమముగాఁ దీర్చినట్లు నిర్మించి రావోయి'' అని యాజ్ఞాపించినారు. నేనును వెళ్లి, తదాజ్ఞానుసారముగా రంగభూమిని గల్పించి, అందులో, మర్త్యామర్త్య రూపములగు నిఖిలభూతములకు ను దత్తదుచితస్థానములను గూర్చి వచ్చినాఁడను. ఇరుగో!

క॥ నిజరాజ్యాశమమునని। ష్ఠఁజరించుచుఁ గష్టబ్రహ్మచర్యము విధిగా।
సుజరుగ, వాల్మీకులస, ద్విజకులు మాయన్నగారు వచ్చిరి యిరుగో!॥

[అంతట రాముఁడు ప్ర॥ డు.]

రామ—తమ్ముఁడ! లక్ష్మణ! రంగప్రేక్షకులు నిజనిజపీఠములఁ గూరుచున్నారుగదా!

లక్ష్మ—కూరుచున్నారండీ, అన్నయ్యగారూ 3!

రామ—కుశలవ కుమారులకుఁ గూడఁ జంద్రకేతువుయొక్క స్థానముతో సమాన పీఠములో సంగవోయి! తమ్ముఁడా!

లక్ష్మ—వారియెడ దేవరకుఁగల్గు స్నేహప్రత్యయముల నెఱింగి, వారికటువంటి పీఠములె యిచ్చినాఁడను. ఇదిగో! ఈపెద్దపీఠము దేవరవారిది! ఇందుపయిని తమరుదయచేయుండి!

[రాముఁడు కూర్చున్నాఁడు అంతటఁ, దక్కినవారందఱును గూర్చున్నారు.]

ఇఁక మీరూపకమును బ్రస్తావింపవచ్చునోయి!

[అంతట సూత్రధారుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సూత్ర—ఓయి! ఓయి! సామాజికులారా! సత్యైకవాదియగు భగవద్వాల్మీకుల వారు చరాచరాత్మకమగు యావజ్జగత్తునకు "మేము ఆర్షేయమగు మాదివ్యదృష్టిచేతఁ గనుకొన్నయంశమును ఒక్కింతరూపకముగా వ్రాసి, కరుణాద్భుత రస నిగుంఫితముగాజేసి బావనముగాను దలపోసి, దానిని నేఁడు మీయెదుట నభినయాదిపూర్వకముగా నడిపింపఁదలంచితిమి. కాఁబట్టి, ప్రస్తుత రూపకాభినయమందు గౌరవముంచి సావధానముగా వినవలసినద''ని ఆజ్ఞాపించుచున్నారు!

రామ— ఇట్లనుటవల్ల మహర్షులు సాక్షాత్కృత ధర్ములుగనుక, వారిప్రజ్ఞానములు అమృతసారములు; భగవత్స్వరూపులగు వారివాక్యములు ఒకానొకప్పుడైనను బ్రతిఘటింపఁబడనేరవని తాత్పర్యముగాని, వారిచోట అసత్యత్వము తలంపవలదనుండీ!

ఇంతలో నేపథ్యమందు— హా! ప్రాణనాయక! హా! మఱఁది! లక్ష్మణకుమార! మందభాగ్యురాలనగు నన్ను ఏకాకినిగా, దిక్కుమాలిన నట్టడవిలో విడిచివెళ్లితిరి! ఘాతుక

మృగములు నన్ను విలోకించి తిన నభిలాషపడుచున్నవిగో! నావంటి దౌర్భాగ్యురాలు జగతిలోఁ బుట్టఁబోదు! నేనిపుడు భాగీరథీనీరములంబడి మేను దొఱంగెదను. ఆసన్నగర్భవేదనలకుఁగూడఁ దాళఁజాలను! ఏటిలోఁబడిచత్తును!

లక్ష్మ—(తనలో) అబ్బా! ప్రపంచములో నింతకుమించిన కష్టమంచు ఒక్కటి యుండునే? ఎంతదుస్సహము!

సూత్ర—తే॥గీ॥ రాజపుత్రి సీత రాజుచే నడవిలో। విడువఁబడియు నెంతో యిడుమఁబొంది
ప్రసవవేదనలకుఁ బడలేక గంగలో। మేను దొఱఁగఁగడఁక పూనుచుండె!॥

[అని సూత్రధారుఁడు నిష్క్రమించెను.]

రామ—ప్రాణనాయికా! సంతోషము దెచ్చుకొమ్ము! లక్ష్మణ, కాపాడుము! కాపాడుము!

లక్ష్మ—అన్నగారు! ఇది వట్టి నాటకమండీ, వట్టి నాటకమండి.

రామ—హా! దేవీ! దండకారణ్యవాస ప్రియసఖీ! దుర్మార్గుఁడగు ఈ రామునివల్లఁగదా నీకిన్నిపాట్లు వచ్చె!

లక్ష్మ—అన్నగారూ౩! ప్రబంధార్థమును జక్కఁగా వినవలయును.

రామ—ఇదిగో, చూచుచున్నాఁడను. నా హృదయము వజ్రముతోఁ జేయఁబడినది. నేను ఏదైనఁ జూతును, విందును!

[అంతటఁ జెఱియొక్కపిల్లవానిని జంకఁబెట్టుకొన్న గంగాపృథ్వీదేవతలచేఁ బట్టుకొనఁబడి, సీత ప్ర॥ ది.]

రామ—తమ్ముఁడ! లక్ష్మణా! మున్నెన్నఁడును ఎఱుఁగని యంధకార పటలములో మునుఁగుచున్నట్లున్నాఁడను! నన్నుఁబట్టుకో! పట్టుకో!

గంగా & పృ—క॥ పుపుబోఁడి! యోర్చుకొమ్మా!। భువిపై నీనోముపండెఁబో, కళ్యాణీ!।
భవదీయకులపవిత్రులఁ। గవలఁగుమారులను గంటి గంగజలములో!॥

సీత—(ఒడలు తెలిసి) అహో! నాయదృష్టము! ఇద్దఱు కవలకొడుకులను గంటిని!—అయ్యో! ప్రాణేశ్వర! [అని మూర్ఛిల్లినది.]

లక్ష్మ—(కాళ్లకు సాఁగిలిమ్రొక్కి) అన్నగారూ౩! అన్నగారూ౩! మనయదృష్టము పండినది! మనమిఁక వృద్ధిపొందెదము! రఘువంశము నేఁటితో శుభావహాంకురితమయ్యెను! (ఆయనవైపు చూచి) చూడుండి! అన్నగారిముఖము సుందరమయ్యును బాష్పవారి నిర్భరమయియున్నది! [అని తాను విసరుచున్నాఁడు]

పృథ్వీ—కుమారీ! ఓర్చుకో. ఓర్చుకో.

సీత—(తెప్పిఱిలి) అమ్మా! మీరెవరు? ఈమె ఎవ్వరు?

పృథ్వీ—ఈమె నీ అత్తవారియింటి యిలువేల్పు, భాగీరథీదేవి.

సీత—నీకు నమస్కారము, నీకు నమస్కారము, అమ్మా!

భాగీ—పవిత్రచరిత్రమువల్ల లభింపఁగల కళ్యాణముల ననుభవింపుదువుగాక!

లక్ష్మి—ఆహా! మామీఁద ఎంతఅనుగ్రహము.

భాగీ—ఈమె, మీఅమ్మగారే, వసుంధరాదేవి.

సీత—అయ్యో, అమ్మా! నీకూఁతు నిట్టిదుర్దశలోఁ జూడవలసి యున్నదానవుగదా!—

పృథ్వి—అమ్మాయీ, ఇటురా. ఏదీ, నాకుమారీ! [అని సీత నాలింగనముచేసికొని మూర్ఛిల్లెను.]

లక్ష్మి—(సంతోషముతో) మనపుణ్యము బాగుండఁబట్టియే మావదినెగారికి పృథ్వీగంగాదేవతల ప్రసాదము లబ్ధమయినది.

రామ—చూడఁగఁజూడఁగఁ గరుణరస మెక్కువగుచున్నదిగదా! విశ్వంభరాదేవి యంతటి యామెకుఁ గూడ అపత్యవాత్సల్యము తప్పించుకో నలవికాదుగదా. అవును. అదినిజమే. ఈసంసారతంతువు సమస్తప్రాణులకు సాధారణమయిన మోహగ్రంథి, ఇది అప్రతిహతముగా అంతఃకరణమున నివసించును.

భాగీ—కుమారీ, వైదేహీ, ఓర్చుకో. భూతధాత్రి, వసుంధర, ఓర్చుకో.

పృథ్వి—భాగీరథీ! సీతనుగన్నదిమొదలుకొని, ఓర్పనకును నాకును ఎంతదూరమైనది.

తే॥గీ॥ ఒకటిరక్షోగృహవసతియుర్విఁజెల్లె,। రెండవదివినఁబాల్పోకయుండుమదికి,।

భాగీ—యింతమను,దైవపరిపాకమెచ్చిరాఁగఁ।తలుపుమూసిపెట్టంగానుగలఁడెవండు?॥

పృథ్వి—భాగీరథీ! నీవన్నమాటబాగున్నది. ఇదియంతయు రామభద్రునకే సరిపోవలెఁగానీ.

ఉ॥ తొల్లివివాహకాలమునఁ దోరణముంచిన పాణిచోటనా।
యల్లునకీదురూహపడుటౌచుఁ బ్రమాణములేకపోయెఁగా,।
ఒల్లఁడె నన్ను, ఆజనకునొల్లఁడె, ఒల్లఁడె వీతిహూత్రునిన్,।
పల్లవపాణిచేసిన సపర్యలు గర్భము మాన్పఁజాలెనే?॥

సీత—అయ్యో, నాప్రాణేశ్వరు నామశ్రవణ మెంతసంతోషదాయకము.

పృథ్వి—చాలు, చాలు. నీకింకఁ బ్రాణేశ్వరుఁడెవ్వఁడు?

సీత—(లజ్జాశ్రువులురాల) అమ్మా! నీచిత్తమువచ్చినట్లే.

రామ—అత్తా!పృథ్వీ!అవును ఇటువంటిమాటలకు నేను దగుదునే. సందేహములేదు.

భాగీ—భగవతీ! వసుంధరా! కోపగింపకమ్మా! యావత్ప్రపంచమునకును నీవు ఉత్పత్తికారణమగు శరీరమవే? నీకుఁదెలియనిదుండునా! ఇన్నిదెలిసియేనా, నీఅల్లుని మీఁద ఇంతకోపింతువు! చాలింపవమ్మా!

చ॥ అపయశమల్లుకోఁగ జగమంతట, దూరవులంకలోనవ,।
హ్నాపయివిశుద్ధిచేయుటది యిక్కడివార లెఱుంగు టెట్లగున్?।
ఎపుడురఘుప్రకాండులకు నెంతయునం జనరంజనంబువం।

శపథనము, స్ఫురాముఁడటు చానసుద్రోయక యేమిచేసెడుఁ॥

లక్ష్మ—దేవతలకు మనుష్యుల యంతఃకరణవృత్తులుగూడ నిరాఘాటముగాఁ దెలియును గదా! అందులో మరీ, గంగాదేవికి! కనుక, ఈమెకు నేనంజలి యొనరించుచున్నాఁడను!

రామ—హేదేవీ! నీప్రసాదమే కాదా భగీరథుగృహమునందు శాశ్వతలక్ష్మి నెలకొల్పెను.

పృథ్వీ—హేభాగీరథీ! భవత్ప్రసాదపాత్రములగు భగీరథవంశీయులయెడ నాకును బ్రసన్నబుద్ధికలదుగాని, నాకడుపుదుఃఖము పట్టఁజాలక యిట్లు ప్రలాపించినదానను! మరి, రామభద్రునకు సీతచోటఁగల స్నేహముమాత్ర మెవరెఱుఁగుదురు?

క॥ అతఁడును జానకినిహృతా। గ్రతివిడిచియు, మనసునెంతో కష్టముపడెమఁ!।
సతతనిజసత్త్వమహిమను। బ్రతుకుచునున్నాఁడు ప్రజలబహుపుణ్యమునన్॥

రామ—పెద్దవారికి ఎప్పుడును తాము కన్నపిల్లలపయిఁ గరుణయూరుచుండునుగదా!

సీత—(ఏడుచుచు, చేయిదోయిమోడ్చి) ఓఅమ్మా! నేను సహింపలేనమ్మా! నన్ను నీదేహములో నైక్యము చేసికొనవమ్మా!

రామ—అబ్బా! ఎంతకష్టమువచ్చెను! ఇంతకంటె ఘోరముగుకోర్కి గలదే?

భాగీ—శాంతము! లీనవుగాకుండ, వేయేండ్లు బ్రదికెదవుగాక!

పృథ్వీ—కుమారీ! ఇఁక నీకొడుకుల నెవ్వరుపెంచెదరు?

సీత—అనాథనయిన నాకుఁ గొడుకులఁ బెంచుకొనుటెట్లు?

రామ—హృదయమా! నిజముగా నీవు వజ్రమయమవుగదా?

భాగీ—కుమారీ! సనాథవగు నీవు అనాథనని యెందులకంటివి?

సీత—నన్నుఁబోలిన దురదృష్టవంతురాలికి 'సనాథ'అను బిరుదుగూడనా!

గం & పృ—క॥ జగములకుమంగళములిడఁ। దెగువలుగలనిన్ను నీవెతట్టుకొనంగాఁ।
దగదిటు; మాకునునీచే। మిగులఁబవిత్రత్వమబ్బె, మిథిలకుమారీ!॥

లక్ష్మ—అన్నగారూ! వింటిరా?

రామ—లోకులది విందురుగాక!

తెఱలో—కలకలధ్వని.

రామ—ఇదియేదో అద్భుతతరముగానున్నది!

సీత—ఏమిటియిది! అంరిక్షముయావత్తును బర్యాకులమయినది.

గంగా & పృథ్వీ— మాకుఁదెలిసినది. అవును, అవును.

క॥ ప్రేమను గృశాశ్వకౌశిక। రాములు తమగురుపరంపరగ విలసిల్లన్।
దామిట్లావిర్భూతములై మెఱసెను బయల జృంభకాస్త్రములవిగో!॥

మళ్లీ తెఱలో—క॥ వెనుకనుజిత్రపటంబును। గనుగొనుచో, సీత! దేవగణ్యుఁడురఘునం।
దనునాజ్ఞ నేమువిని, నీ। తనుజుల శరణొందినాము, దండములమ్మా!॥

సీత— దివ్యదేవతాకములగు మహాస్త్రిములు, చూడుము! ఎంతెంతదీప్తిమంతములుగా నున్నవో! నాసంతోష మింతింతనరాదుగదా!

లక్ష్మ—అవును, నాఁడు మాఅన్నగారు 'ఇవి సర్వవిధములచేత నీకన్న కాన్పులవశముగాఁగలవ'ని సెలవిచ్చిరిగాదా!

గం & పృ—క॥ వరరాముని చేపట్టిన। పరమాస్త్రిములార, మీకుఁబదివేలునమ।
స్కారణములివె! భవదీయ స్మరణము శిశువులకు మీకు మంగళమొసఁగుత॥

రామ— క॥ కరుణరసముప్పొంగ్పై। యరుదుగ నాలోన విస్మయానందములం।
బొరసి, యిదియది యనంగాఁ। దరమెప్పుడుగాని యట్టిదశననుముంచెత!॥

గంగా & పృథ్వీ—(సీతతో) కుమారీ! రామభద్రతుల్యులగు కొమాళ్లిరువురిదే నీకుఁ గలిగిరి! ఇఁకసంతోషింపవమ్మా!

సీత—ఓమాఅమ్మలారా! ఈనాపుత్రకులకిప్పుడు క్షత్రియోచితముగా జాతకర్మవ మొదలగు సంస్కారములు చేయువారెవ్వరు?

రామ—క॥ సుకృతివసిష్ఠ సురక్షితు।లకు రఘువంశజులకెల్ల లక్ష్మియయిన సీ।
తకుమారవృద్ధికోసం। బకటా! సంస్కర్తకొఱకు నరయవలసెగా!॥

గంగా & పృథ్వీ—కుమారీమణీ! ఏలనీకీచింత? ఈనీకొమాళ్లు చనుబాలువదలినతోడనే వీండ్రను శ్రీమద్వాల్మీకులవారిసన్నిధిలో మేమర్పింతుముగాదా! ఆయనయే వీండ్రకు క్షాత్రకృత్యములు యావత్తు నెరవేర్చి తీర్పఁగలరు
క॥ కలితవసిష్ఠశతానం। దులవిధమున జనక రఘుసుతులితోభయరా।
ట్కులములకు గురులు వాల్మీకులవారు, భవత్కుమారకుల సంస్కర్తల్॥

రామ—మాపాలిటిదేవతలగు గంగాపృథ్వీదేవులు లెస్సగ నాలోచించినారుగదా!

లక్ష్మ—అన్నగారూ! కుశలవులుగూడ నీయిాయుపాయములచేతనే పెరిగిరే! వారే వీరుగారుగదా!
క॥ వాఁడ్రకునీమదలంపఁగఁ। బండ్రెండేండ్ల, స్త్రిబలమువడసి పురిటిలోఁ,।
'దండ్రిగ, వాల్మీకులు.గయి। కొండ్ర'ని ప్రార్థింప, వారిమూర్తిమనిరిగా!॥

రామ— తమ్ముఁడా! నాహృదయముగూడ ఈవిషయమందు సందిగ్ధమయి కొట్టుకొనుచున్నది.

పృథ్వీ—కుమారీ! రమ్మా! మారసాతలమును బవిత్రముచేయుదువుగాని రమ్మా!

రామ—అయ్యో, నాప్రాణేశ్వరీ! లోకాంతరవాసినివగుచున్నావా!

సీత—ఓతల్లీ! ఇట్టియపరావస్థను అనుభవింపఁజాలను. నన్ను శీఘ్రముగా నీయవయవముతో లీనను జేసికోవమ్మా!

రామ—ఈప్రశ్నకుఁ దల్లి యేమనునో వింద్దము.

పృథ్వీ—నీపిల్లలు చనుబాలువదలినదాఁక ఓర్చుకో! ఆపయిన, నీయిష్టముచొప్పునఁ జేయుదువుగానిలే.

గంగా—సరే, ఇదిబాగున్నది! ఇట్లుచేయుమా. (అని గంగా పృథ్వీ సీతాదేవులం నిష్క్రమించిరి.)

రామ—ఏమిటియిది! వైదేహి విలయమునుబొందినదా? అయ్యో! దేవి! దండకారణ్యవాసప్రియసఖీ! అయ్యో! చారిత్రదేవతా! లోకాంతరమును బొందితే(అని మూర్ఛిల్లెను.)

లక్ష్మ—ఓ భగవద్వాల్మీకులవారూ 3! కాపాడుండి, కాపాడుండి. ఇదేనా మీనాటకప్రబంధముయొక్క పరమార్థము?

తెఱలో—మీఆతోద్యకసంగీతము లాపుండి. ఓ జంగమస్థావర భూతములారా! ఓ మర్త్యామర్త్య ప్రాణధారులారా! చూడుండీ! శ్రీమద్వాల్మీకి మహర్షులవారు జగత్పవిత్రమయిన, ఆశ్చర్యకర దివ్యదర్శనము మీమీఁదియనుగ్రహముచేత మీకుఁ జూపింప నాజ్ఞాపించినారు. అదిగో! చూడుండి!

—(అదిచూచుచు)

తే॥గీ॥ ఏమివింత! ఏమిదివింత!! ఏమివింత!!!। అంతరిక్షము దేవర్షులధిగమింపఁ,
గవ్వమునఁ జిందఁగొట్టిన కరణిగాఁగ। దివ్యసలిలోర్మ్యులల్లాడు దివినిగంటె!॥

తే॥గీ॥అదియెగాకండునుండిమావదినెగారు।గంగయొకప్రక్క, నొక్కప్రక్క నిలఁబృథ్వి,
తక్కుదేవతలంతలదన్నుబలియఁ। బైకివచ్చుచునున్నారుప్రతిభవీని॥

తిరిగి, తెఱలో—

క॥ త్రిజగత్పూజ్యారుంధతి। విజయంచేసి కరుణించి పృథ్వింగంగం,।
గజగామినిసీతావధు। వుజగద్వంద్యంగయికొని పొమ్మారమ్మా!

లక్ష్మ—మనపంటపండినది. ఆశ్చర్యము! ఆశ్చర్యము! అన్నయ్యా! అన్నయ్యా! చూడుండి! చూడుండి! (ఆయనవైపరికించి) అయ్యో, ఏమియిది! ఇంకను, అన్నగారికిశ్వాసఆడుచుండలేదే?

[ఇంతట సీతనుదీసికొని అరుంధతి ప్ర॥ది]

అరుం—క॥ వేగిరమేవైదేహీ!। రాగదవే, సిగ్గువదిలి రావేమమ్మా?।
మాగారాబుకుమారుని। బాగుగస్పృశియింపవమ్మ పాణితలమునన్!॥

సీత—(సంభ్రమముతో రాముమేనుస్పృశించుచు) ప్రాణేశ్వర! మేనుదెలియుండి.

రామ—(ఒడలుదెలిసి-ఆనందముతో) ఆహా! ఏమియీచిత్రము! (చుట్టునుజూచి, హర్షాద్భుతములు పెనఁగొన) నాప్రాణపాయిక యిట కెట్లురాఁగలిగెను! (లజ్జాస్మితములు తొట్రువడ) మాతల్లులుగూడనా! అరుంధతీదేవియు! ఇదుగో! ఋశ్యశృంగుఁడు, శాంత, మొదలయిన సమస్తగురుబంధువులును దయచేసి కన్నులపండుగు చేయుచున్నారు!

గం—కుమార! ఈమెభగీరథాన్వయులకిలువేల్పగుప్రసన్నదేవత,శ్రీమద్భాగీరథీదేవి!

తెఱలో, భాగీ—జగన్నాయక! రామభద్ర! వెనుకఁజిత్రపటదర్శనకాలములో, నన్ను ఉద్దేశించి నీవన్నమాటలు జ్ఞాపకమునకుఁ దెచ్చుకొమ్మా! అప్పటిలో నీవు నన్నుఁ గూర్చి, "అమ్మా! భాగీరథీ! నీకోడలు సీతను, అరుంధతీదేవియెట్లో అట్లే నీవును గాపాడుచు, ఆమెకు క్షేమము నెగూర్చుచుండుట ధర్మముగాదా!"అంటివే? నేనిప్పుడు నాఋణము దీర్చుకొని ధన్యురాలనైతిని సుమా?

అరుం—ఈమె మీఅత్తగారు, వసుంధరాదేవి.

తెఱలో, పృథ్వీ—ఆయుష్మంతుఁడగు రామభద్రకుమారుఁడు పూర్వము సీతాపరిత్యాగకాలమున నన్నుఁగూర్చి చెప్పినదేమనఁగా; "భగవతి! వసుంధరాదేవి! శ్లాఘ్యచారిత్రయగు నీకూఁతును జానకిని గాపాడుకొమ్మా"అని. కనుక, నామాట నేనుదక్కించుకొని 'కృతార్థీభూతచేతస్క'రాల నైతిని, భూపాలా! మదీయ జామాతా!

రామ—నేనెంతపుణ్యాత్ముఁడను! మీయెడఁ గృతాపరాధినైనను, నన్ను భగవత్స్వరూపలగు మీరిట్లు కటాక్షించితిరి. ఇవిగో,మీపాదపద్మములకు నానమస్కారములు.

అరుం—ఓయి! ఓయి! పౌరజానపదులారా! పరమపవిత్రచరిత్రయగు విదేహరాజపుత్రి, భగవత్స్వరూపులగు శ్రీమద్భాగీరథీవసుంధరాదేవతలచేత నిరంతర జేగీయమానయై, నాకు అనఁగా, అరుంధతికి సమర్పింపఁబడ్డదిదిగో! పూర్వమె యీమె పుణ్యచారిత్రము శ్రీమద్వైశ్వానరునిచేతఁ బరీక్షితమయ్యెను. బ్రహ్మాదిసురులు గూడ ఈమెను దేవయజనసంభవ, సావిత్రకులవధువు, జగత్పావని, అనుచు సంస్తవించిరి. అట్టియీమెను మీరిప్పుడు గ్రహింపఁదలంచెదరా?

లక్ష్మ—సమస్తసామాజికులును, భూతసంతానమును, భగవతి అంరుధతీదేవిచేత నిర్భర్త్సింపఁ బడినవారై, విమలచారిత్రయగు మా వదినెగారికి అష్టాంగాలింగితభూతలంబుగ నమస్కరించుచున్నారు! దిక్పాలురును సప్తమహర్షులును ఆమెపయిం బుష్పవర్షము గురిపించుచున్నారు!

అరుం—జగత్పతీ! రామభద్ర!

క॥ నిర్మలచరిత్ర,నీసహ। ధర్మిణి, జానకి నపూర్వదయఁగొనుచుయథా।
ధర్మంబుగనుహయాధ్వర। కర్మను నెరవేర్చి జగముఁ గాపాడఁగదే!॥

సీత—సీతామనోవేదన యెట్లార్పవలెనో నాప్రాణేశ్వరుండు లెస్సగ నెఱుఁగును.

రామ—భగవతీ! మీయనుజ్ఞనడిపెదను.

లక్ష్మ—కృతార్థుఁడ నైతినిగదా నేఁడు!

సీత—బ్రతికితినిఁక! ప్రాణదానమును జేసితిని గాఁబోలును బూర్వము!

లక్ష్మ—అమ్మా! వదినెగారూ౩! ఇదిగో, సిగ్గుమాలిన మఱఁది లక్ష్మణుఁడు మీకు మ్రొక్కుచున్నాఁడు.

సీత— ఇప్పటికిని, నీవు ఎప్పటికిని దీర్ఘాయుష్మంతుఁడవై యుండవలెనని యే నేఁ గోరెదను.

అరుం—భగవద్వాల్మీకులవారూ ౩! సీతారాముల ముద్దులబిడ్డలగు కుశలవకుమారుల నిఁకఁ దోకొనిరండీ! [అని ఆమెనిష్క్రమించెను.]

రామ--లక్ష్మ—(చూచి) అవును. మనమనుకొన్నట్లేఅయినది!

సీత—(బాష్పాకులయై) ఏరీనాపుత్రులు. ఎక్కడ, ఎక్కడ!

[ఇంతటఁ గుశలవులనువెంటఁబెట్టుకొని శ్రీమద్వాల్మీకులవారు ప్ర॥రు.]

వాల్మీ—కుశలవకుమారులారా! ఇఁదుగో, ఈయన మీతండ్రి రఘురాముఁడు. ఇతఁడు మీకక్క లక్ష్మణుఁడు! ఈమెమిమ్మును గన్నతల్లి సీతాదేవి! ఇఁదుగో, ఈయన మీమాతామహుఁడయిన జనకరాజర్షి పుంగవుఁడు

సీత—(హర్ష కరుణాద్భుతములుముప్పిరిగొనఁ, దండ్రినిజూచి) ఇరుగో, మానాన్నగారు.

కుశ--లవ—ఆహా! మాకుఁదండ్రి! మాకుఁదల్లి! మాకుఁ దల్లిదండ్రిగూడ!

రామ--లక్ష్మ—హర్షముతోఁ గౌఁగిలించుకొని) ఓఅబ్బాయిలారా! మాపుణ్యములు పండియుండఁగా, మీరుగలిగితిరి!

సీత—మానాయనా! కుశా! మాతండ్రీ! లవా! రండీ! పునర్జన్మమెత్తిన మీతల్లిసీతను గౌఁగించుకొని సంతోషపెట్టుండి. రండి! రండి!

కుశ--లవ—(అట్లుకావించి) నేఁడు మేము ధన్యులమయితిమి! ధన్యులమయితిమి!

సీత—భగవన్మహర్షులవారూ ౩! మీపాదములకు నమస్కారము!

వాల్మీ—కుమారీమణీ! ఇట్టిసుఖస్థితిలో నెల్లకాల ముండువుగాక!

సీత— అమ్మా! నాభాగ్యము! మానాయన! మాకులగురువు! మాఅత్తగార్లు! మాఆడుబిడ్డశాంతాదేవి! ఆమెపెనిమిటిగూడ, ఇవతల, లక్ష్మణసమేతులయి, నాప్రాణేశ్వరులు! ఆవతల, నాముద్దులమురహరులు కుశలవులు! ఇందఱినొక్కచోటఁ గనఁ గల్గితినిగదా! కాఁబట్టి, ఆనందము నాడెందములోఁ బొంగిపొరులుచున్నది!

తెఱలో—కలకలధ్వని.—

వాల్మీ—(లేచిచూచి) ఇఁదుగో! లవణాసురునిజంపి, మధురేశ్వరుఁడగు శత్రుఘ్నుఁడును వచ్చినాఁడు!

లక్ష్మ—సత్యమే! కళ్యాణములు ఒకటివెంబడి ఒకటి కలుగునుగదా!

రామ—ఇట్లు సమస్తానుభవములును దిరిగి కలిగినను, నాకన్నులను నేనె నమ్మలేకున్నవాఁడను! సరే! ఇది అభ్యుదయమొందినవారందఱికును సహజమే కాఁబోలును!

వాల్మీ—రామభద్ర! నీకిఁక నేనుజేయవలసిన యుపకారము కలదేని ద్వరఁగజెప్పుము!

రామ—ఇంతకంటె నాకుపకారమేమియున్నది, ఋషివర! అయిన నాకిదిమాత్రము వరమిండి.

[భరతవాక్యము.]

స్రగ్ధరావృత్తము॥ పాపంబుల్ చెండివేయన్ బలపఱుచు శుభవ్రాతమీ దృక్చరిత్రం।
బేహాఱుంగంగవోలెన్, హితముగురియఁగా యెప్పుడుందల్లివోలెన్।
వ్యాపారాధిక్యవిద్యా ప్రవణులభినయ న్యస్తవేషంబులొప్పన్।
నైపుణ్యంబాఱనీయ న్నతకవిపలుకుల్ నాఁటికైకొంద్రుగాతన్॥

[అనిఅందఱును నిష్క్రమించిరి.]

క॥ విక్రమము నెఱపినలుగడ। వక్రేతరగతులఁబ్రోచి పాలించెడుమా।
చక్రేశ్వరి విక్టోర్యా! యక్రమ పద్ధతులమాన్పి యరసెడుఁగాతన్॥

సప్తమాంకముతోడి సర్వము

సంపూర్ణము.

విషయసూచిక.

ఈనాటకమునందువచ్చు పాత్రములు.

పురుషులు.

రాముఁడు—అయోధ్యరాజు.
కుశుఁడు. లవుఁడు. } —రాముని కవలకొడుకులు.
లక్ష్మణుఁడు—రాముని(సవతి)తమ్ముఁడు.
వాల్మీకి—ఒక బ్రహ్మర్షి పుంగవుఁడు. రామాయణగ్రంథకర్త. కుశలవుల ఉపదేష్ట.
జనకమహారాజు—సీతతండ్రి, తమమిథిలరాజ్యమునువదిలి, ఆశ్రమములందుఁ దపస్సు చేసికొనువాఁడు.
శంబూకుఁడు— ఒక శూద్రముని. రాముఁడితనినిచంపఁగా, ఇతనియాత్మ రాముని తోఁ బ్రసంగించును.
అష్టావక్రుఁడు—ఒకఋషి.
సుమంత్రుఁడు—చంద్రకేతువుయొక్క సారథి.
దుర్ముఖుఁడు—రామునిచారుఁడు.
సౌధాతకి భాండాయనుఁడు } —వాల్మీకులవారి శిష్యులలోఇద్దఱు.
ఒకవిద్యాధరుఁడు—దివ్యపురుషుఁడు.

స్త్రీలు.

సీత—రామునిభార్య.
అరుంధతి—ఒకపతివ్రత. వసిష్ఠునిధర్మపత్ని—సీతచోటఁ బ్రేమగలది.
ఆత్రేయి—అత్రిభార్యఅయిన మునికన్య.
కౌసల్య—రామునితల్లి.
వాసంతి—జనస్థానవనదేవత.
తమస—నదీదేవత.
మురళ—నదీదేవత.
కవిద్యాధరి—దివ్యస్త్రీ.

శ్రీపరాశరస్మృతి-ప్రాయశ్చిత్తకాండము-షష్ఠాధ్యాయము. [౨౭౪-పుట శేషము.]

శ్లో॥ ఏవంచతుష్పదానాంచ సర్వేషాంవనచారిణామ్।
అహోరాత్రోషితస్తిష్ఠేజ్జపన్వైజాతవేదసమ్॥ ౧౫

౧౫. ఇట్లు నాలుగుకాళ్ల జంతువులనన్నిటిని అడవిమృగములను చంపినవాడొక పగలు రాత్రియు భుజింపకుండి జాతవేదసమను మంత్రము జపింపవలయును.

శ్లో॥ శిల్పినంకారుకంశూద్రం స్త్రియంవాయస్తుఘాతయేత్।
ప్రాజాపత్యద్వయంకృత్వా వృషైకాదశదక్షిణా॥ ౧౬

౧౬. చిత్రములు వ్రాయువాడు మొదలగు శిల్పులు, వంటవాండ్రు, కాపులు, ఆడువారు, వీరిని చంపినవారు, రెండు ప్రాజాపత్యము లాచరించి పదియావుల నొక యాబోతును దానముచేసిన శుద్ధులగుదురు.

శ్లో॥ వైశ్యంవా క్షత్రియంవాపి నిర్దోషంయోభిపాతయేత్।
సోతికృఛ్రద్వయంకుర్యా ద్గోవింశద్దక్షిణాందదత్॥ ౧౭

౧౭. నేరములేని కోమటిని, రాజునైన చంపినవాడు రెండతికృఛ్రము లాచరించి యిరువదియావుల దానముచేయవలయును.

శ్లో॥ వైశ్యంశూద్రక్రియాసక్తం వికర్మస్థంద్విజోత్తమమ్।
హత్వాచాంద్రాయణంతస్య త్రింశద్గాశ్చైవదక్షిణామ్॥ ౧౮

౧౮. శూద్రకృత్యములందగిలిన కోమటిని మహాపాతకములాచరించిన ద్విజుని చంపినవాడు చాంద్రాయణమొనర్చి ముప్పదియావుల దానముచేయవలయును.

శ్లో॥ చండాలం హతవాన్కశ్చి ద్బ్రాహ్మణోయదికంచన।
ప్రాజాపత్యంచరేత్కృఛ్రం గోద్వయందక్షిణాందదత్॥ ౧౯

౧౯. విప్రబ్రాహ్మణుడైన చండాలునిచంపిన ప్రాజాపత్యకృఛ్రము చేసి రెండావుల దానము చేయవలయును.

శ్లో॥ క్షత్రియేణాపివైశ్యేన శూద్రేణైవేతరేణవా।
చండాలస్యవధేప్రాప్తే కృఛ్రార్ధేన విశుధ్యతి॥ ౨౦

౨౦. రాజు, కోమటి, శూద్రుడు వీరుగాని, మఱియొకడుగాని, చండాలుని చంపిన కృఛ్రము సగముచేసిన శుద్ధుడగును.

శ్లో॥ చోరశ్శ్వపాకశ్చండాలో విప్రేణాభి హతోయది।
అహోరాత్రోషితస్స్నాత్వా పంచగవ్యేనశుధ్యతి॥ ౨౧

౨౧. దొంగతనముచేసిన చండాలునినైన శ్వపాకునినైన చంపిన బ్రాహ్మణుడు పగలురాత్రియు నుపవసించి పంచగవ్యము పుచ్చుకొన్న శుద్ధిజెందును.

శ్లో॥ శ్వపాకంవాపిచండాలం విప్రస్సంభాషతేయది।
ద్విజైస్సంభాషణంకుర్యా త్సావిత్రింతు సకృజ్జపేత్॥ ౨౨

౨౨. బ్రాహ్మణుడు శ్వపాక చండాలులతో సంభాషించిన వేదముచ...

బ్రాహ్మణులతో సంభాషణమువలననైన నొకమారు గాయత్రి జపించుటవలననైన శుద్ధుడగును.

శ్లో॥ చండాలైస్సహసుప్తంతు త్రిరాత్రముపవాసయేత్।
చండాలైకపథంగత్వా గాయత్రీస్మరణాచ్ఛుచిః॥ ౨౩

౨౩. చండాలునితో నేకశయ్యాపరుండిన మూడుదినములుపవసింపవలయును. చండాలునితో నొకత్రోవనడచిన గాయత్రిదలంచిన పవిత్రుడగును.

శ్లో॥ చండాలదర్శనేసద్య ఆదిత్యమవలోకయేత్।
చండాలస్పర్శనేచైవ సచేలంస్నానమాచరేత్॥ ౨౪

౨౪. చండాలుని చూచిన నాక్షణముననె సూర్యుని చూచునది. మాలవాని తాకిన నాబట్టలతో స్నానముచేయవలయును.

శ్లో॥ చండాలఖాతవాపీషు పీత్వాసలిలమగ్రజః।
అజ్ఞానాచ్చైకభక్తేన త్వహోరాత్రేణ శుధ్యతి॥ ౨౫

౨౫. మాలవాడు త్రవ్వించిన బావులనీటి నెఱుగక త్రావిన బ్రాహ్మణుడొకపగలు భుజింపకుండుటవలన శుద్ధిజెందును. ఎఱిగి త్రావిన నొకపగలురాత్రియు నుపవాసము వలన శుద్ధుడగును.

శ్లో॥ చండాలభాండసంస్పృష్టం పీత్వాకూపగతంజలమ్।
గోమూత్రయావకాహార స్త్రిరాత్రాచ్ఛుద్ధిమాప్నుయాత్॥ ౨౬

౨౬. మాలవాండ్రు కుండలు ముంచిన నూతినీరు త్రావినవాడు మూడుదినములు గోమూత్రమును యవలపిండియు భుజించుటచే శుద్ధుడగును.

శ్లో॥ చండాలఘటసంస్థంతు యత్తోయంపిబతిద్విజః।
తత్క్షణాత్క్షిపతేయస్తు ప్రాజాపత్యంసమాచరేత్॥ ౨౭

౨౭ మాలవానికుండయందున్న యుదకము నెఱుంగక త్రావి యప్పుడే తెలిసి వమనముచేసికొన్న ప్రాజాపత్యము చేయవలెను.

శ్లో॥ యదిన్నోత్క్షిపతేతోయం శరీరేయస్యజీర్యతే।
ప్రాజాపత్యంనదాతవ్యం కృచ్ఛ్రంసాంతపనంచరేత్॥ ౨౮

౨౮. అట్లుగాక యాజలము జీర్ణమయిన సాంతపనకృచ్ఛ్ర మాచరింపవలెను.

శ్లో॥ చరేత్సాంతపనంవిప్రః ప్రాజాపత్యమనంతరః।
తదర్ధంతుచరేద్వైశ్యః పాదంశూద్రస్యదాపయేత్॥ ౨౯

౨౯. ఎఱిగి యట్టినీరుత్రావిన బ్రాహ్మణుడు సాంతపనకృచ్ఛ్రమును, క్షత్రియుడు ప్రాజాపత్యమును, వైశ్యుడు దానియందుసగమును శూద్రుడు నాల్గవభాగమును ప్రాయశ్చిత్తము చేసికొనవలయును.

శ్లో॥ భాండస్థమంత్యజానాంతు జలందధిపయఃపిబేత్।

బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః శూద్రశ్చైవ ప్రమాదతః॥ ౩౦

శ్లో॥ బ్రహ్మకూర్చోపవాసేన ద్విజాతీనాంతు నిష్కృతిః।
శూద్రస్యచోపవాసేన తథాదానేన శక్తితః॥ ౩౧

౩౦-౩౧. చాకలిమొదలగు కడజాతులవారి పాత్రములయందున్న నీరు, పెరుగు, పాలు నెఱుంగక త్రావిన బ్రాహ్మణుడు, రాజు, కోమటియు, బ్రహ్మకూర్చముతో గూడిన యుపవాసమున శుద్ధులగుదురు. శూద్రుడు యథాశక్తి దానముచేతను నుపవాసము చేతను శుద్ధిజెందును.

శ్లో॥ భుంక్తేఽజ్ఞానాద్ద్విజశ్రేష్ఠ శ్చండాలాన్నంకథంచన।
గోమూత్రయావకాహారో దశరాత్రేణశుధ్యతి॥ ౩౨

౩౨ సద్బ్రాహ్మణు డెఱుంగక యేవిధముచేతనయిన మాలవానియన్నము తిన్న గోమూత్రమును యవలపిండియు పదిదినములు భుజించుటచే శుద్ధిగాంచును.

శ్లో॥ ఏకైకంగ్రాసమశ్నీయా ద్గోమూత్రంయావకస్యచ।
దశాహంనియమస్థస్య వ్రతంకర్తుంవినిర్దిశేత్॥ ౩౩

౩౩. స్నానముమొదలగు నియమముగలవాడు గోమూత్రముతో వండిన యవాన్నము ప్రతిదిన మొక్కొక్కకబళము తినుచు పదిరోజులు వ్రతముచేయవలెను.

శ్లో॥ అవిజ్ఞాతస్తుచండాలో యస్యవేశ్మనితిష్ఠతి।
విజ్ఞాతేతూపపన్నస్య ద్విజాఃకుర్వంత్యనుగ్రహమ్॥ ౩౪

౩౪. ఎవనియింటనయిన చండాలుడు తెలియబడక కొంతకాలముండిన, నెఱింగివచ్చినవానియందు బ్రాహ్మణులు దయచేయుదురు.

శ్లో॥ మునివక్త్రోద్గతాన్ధర్మాన్గాయంతో వేదపారగాః।
పతంతముద్ధరేయుస్తం ధర్మజ్ఞాః పాపసంకరాత్॥ ౩౫

౩౫. వేదములందుదముట్టజదివి ధర్మములనెఱింగినవారు మునిముఖములవలన బుట్టిన ధర్మశాస్త్రముచదివి యాపాపమేళనమునకు ప్రాయశ్చిత్తమువిధించి వానిరక్షింతురు.

శ్లో॥ దధ్నాచసర్పిషాచైవ క్షీరగోమూత్రయావకమ్।
భుంజీతసహభృత్యశ్చ త్రిసంధ్యమవగాహనమ్॥ ౩౬

౩౬. ఆయజమానుడాయింటివారందఱు ననుదినము మూడువేళల స్నానములు చేయుచు గోమూత్రముతోవండిన యవాన్నమును; పెరుగు, నేయి, పాలు, వీనిలో నొక్కొక్క దానితో మూడు మూడు దినములును పిమ్మట నొక్కొక్క దినమును భుజింపవలయును.

శ్లో॥ త్ర్యహంభుంజీతదధ్నాచ త్ర్యహంభుంజీతసర్పిషా।
త్ర్యహంక్షీరేణభుంజీత ఏకైకేనదినత్రయమ్॥ ౩౭

శ్లో॥ భావదుష్టం నభుంజీత నోచ్ఛిష్ట క్రిమిదూషితమ్॥ ౩౬

శ్లో॥ దధిక్షీరస్యత్రిపలం పలమేకం ఘృతస్యతు॥ ౩౭

౩౬-౩౭. అభక్ష్యముపోలికగా గాన్పించినట్టియు, నెంగిలి, పురువులుండినట్టియు, యావకముతినరాదు. పెరుగుపాలు వేర్వేరుగా మూడుపలములు నేయి యొకపలము ను చేర్చుకొననగు.

శ్లో॥ భస్మనాతుభవేచ్ఛుద్ధి రుభయోస్తామ్రకాంస్యయోః।
జలశౌచేనవస్త్రాణాం పరిత్యాగేనమృన్మయే॥ ౩౯

౩౯. రాగియు, కంచును వెలిమిడితో శుద్ధములగు. బట్టలు తడిపిన పరిశుద్ధము లగును. మృన్మయములు పారవేయునది.

శ్లో॥ కుసుంభగుడకార్పాస లవణంతైలసర్పిషీ।
ద్వారేకృత్వాతుధాన్యాని దద్యాద్వేశ్మనిపావకమ్॥ ౪౦

౪౦. కుసుంభము, బెల్లము, ప్రత్తి, ఉప్పు, నూనె, నేయి వీని నతిశయముగా కాలుటకు ద్వారముననుంచి యాయింట నిప్పంటింపవలయును.

శ్లో॥ ఏవంశుద్ధస్తతఃపశ్చా త్కుర్యాద్బ్రాహ్మణతర్పణమ్।
త్రింశద్గావృషశ్చైకంచ దద్యాద్విప్రేషుదక్షిణామ్॥ ౪౧

౪౧. ఇట్లుశుద్ధినొంది పిమ్మట బ్రాహ్మణసంతర్పణముచేసి బ్రాహ్మణులకు ముప్పది యావులు నొకయెద్దును దక్షిణ యీయవలెను.

శ్లో॥ పునర్లేపనఖాతేన హోమజప్యేనశుధ్యతి।
ఆధారేణచవిప్రాణాం భూమిదోషోనవిద్యతే॥ ౪౨

౪౨. మఱియు, నాభూమి, కట్టబడినచోట నలుకుటచేతను, తక్కినచోట త్రవ్వుటచేతను, బ్రాహ్మణులు నివసించుటచేతను శుద్ధినొందునుగాని కుండలవలె విడువ జనదు.

శ్లో॥ చండాలైస్సహసంపర్కం మాసంమాసార్ధమేవవా।
గోమూత్రయావకాహారో మాసార్ధేన విశుధ్యతి॥ ౪౩

౪౩. పాలముననయిన, పొరుగూరు వెడలునపుడయిన నెలుంగమిచే మాలవాండ్ర ౦ం నెలసంపర్కము చేసిన నెలయును పక్షము సంపర్కముచేసిన పక్షమును గోమూ త్రముతోడి యవాన్నము భుజించుటచే శుద్ధిబొందును.

శ్లో॥ రజకీ చర్మకారీచ లుబ్ధకీ వేణుజీవనీ।
చాతుర్వర్ణ్యస్యచగృహే త్వవిజ్ఞాతాతుతిష్ఠతి॥ ౪౪
జ్ఞాత్వాతు నిష్కృతింకుర్యా త్పూర్వోక్త స్యార్ధమేవతు।
గృహదాహంనకుర్వీత శేషంసర్వంసమాచరేత్॥ ౪౫

౪౪. చాకిత, పాదరక్షలుకుట్టువానిస్త్రీ, ఎఱుకలసాని, చెంచిత, వీండ్రలో

నెవలెవైన నాలుగువర్ణములలో నెవరియింటనయిన నెఱుంగరాకయున్న తెలిసిన తరువాత వెనుకచెప్పబడిన ప్రాయశ్చిత్తములో సగమె యాచరింపనగు. ఆయిల్లుం టింపనక్కఱలేదు. మిగిలినదంతయు నెనర్పవలయును.

శ్లో॥ గృహస్యాభ్యంతరంగచ్ఛేచ్చండాలోయదికస్యచిత్।
తమాగారాద్వినిర్వాస్య మృద్భాండంతువిసర్జయేత్॥ ౪౬

శ్లో॥ రసపూర్ణంతుయద్భాండం నత్యజేత్తుకదాచన।
గోమయేనతుసంమిశ్రై ర్జలైఃప్రక్షాళయేద్గృహమ్॥ ౪౭

౪౬-౪౭. చండాలుడు బ్రాహ్మణాదులలో నెవరియింటినదుమనైనం జొఱబడిన వాని యిలువెడలగొట్టి మృన్మయములు తీసివేయవలెను. నేయిమొదలగు ద్రవ్యములునింపిన కుండలనెన్నడును విడువవలదు. గోమయముకలిపిననీళ్లతో గృహమంతయు కడుగదగును.

శ్లో॥ బ్రాహ్మణస్యవ్రణద్వారే పూయశోణితసంభవే।
క్రిమిరుత్పద్యతేయస్య ప్రాయశ్చిత్తంకథంభవేత్॥ ౪౮

శ్లో॥ గవాంమూత్రపురీషేణ దధిక్షీరేణసర్పిషా।
త్ర్యహంస్నాత్వాచపీత్వాచ క్రిమిదుష్టశ్శుచిర్భవేత్॥ ౪౯

౪౮-౪౯. బ్రాహ్మణునకు వ్రణమున దుర్గంధరక్తముపుట్టి పురుగులుపెట్టిన, గోమయము, గోమూత్రము, పాలు, పెరుగు, నేయి వీనితో మూడుదినములు స్నానముచేసిన, వీనినె త్రావిన శుద్ధుడగును.

శ్లో॥ క్షత్రియోపిసువర్ణస్య పంచమాషాన్ప్రదాపయేత్।
గోదక్షిణాంతువైశ్యస్యా ప్యుపవాసంవినిర్దిశేత్॥ ౫౦

౫౦. రాజు, బంగారమయిదు మాషములయెత్తు దానముచేసిన శుద్ధుడగును. మఱి, యుపవాసముచేసి గోదానముచేసిన శుద్ధినొందును.

శ్లో॥ శూద్రాణాంనోపవాసస్స్యా చ్ఛూద్రోదానేనశుద్ధ్యతి॥ ౫౦¼

౫౦¼. శూద్రు డుపవాసము చేయవలదు. దానముచేత నెపవిత్రుడగును.

శ్లో॥ అచ్ఛిద్రమితియద్వాక్యం వదంతిక్షితిదేవతాః।
ప్రణమ్య శిరసాగ్రాహ్య మగ్నిష్టోమ ఫలంలభేత్॥ ౫౧¼

౫౧¼. బ్రాహ్మణులు ప్రాయశ్చిత్తము సంపూర్ణమనువాక్యమును, మ్రొక్కి తలతో నైకొనునది ఆవాక్య మగ్నిష్టోమముచేసిన ఫలమొసంగును.

శ్లో॥ జపచ్ఛిద్రంతపచ్ఛిద్రం యచ్ఛిద్రంయజ్ఞకర్మణి।
సర్వంభవతినిచ్ఛిద్రం బ్రాహ్మణైరుపపాదితమ్॥ ౫౨¼
వ్యాధివ్యసనినిశ్రాంతే దుర్భిక్షేడామరేతథా।
ఉపవాసోవ్రతంహోమో ద్విజసంపాదితానివై॥ ౫౩¼

౫౨½-౫౩½. జపము తపము యజ్ఞము మొదలగు నన్నిటిలోపములు బ్రాహ్మణులవాక్యముచేతను పూర్తిగాంచును. గొప్పరోగము, అలయిక, కఱవు, శత్రువువలన నుపద్రవముకలిగిన నుపవాసము, వ్రతము, హోమము, బ్రాహ్మణులచే చేయింపనగు.

శ్లో॥ అథవా బ్రాహ్మణాస్తుష్టా స్సర్వంకుర్వంత్యనుగ్రహమ్।
సర్వాన్కామానవాప్నోతి ద్విజసంపాదితైరిహ॥ ౫౪½

౫౪½. ఇట్లుచేయింపకున్నను, బ్రాహ్మణుల సంతోషపెట్టిన, వారనుగ్రహించి యన్నికోరికలను కలుగజేయజాలుదురు.

శ్లో॥ దుర్బలేనుగ్రహః ప్రోక్త స్తదావై బాలవృద్ధయోః।
తతోన్యథాభవేద్దోష స్తస్మాన్నానుగ్రహస్స్మృతః॥ ౫౫½

౫౫½. బలహీనుడును, బాలుడును, వృద్ధుడును ననుగ్రహింపదగుదురు. ఇతరుల ననుగ్రహించిన పాపము సంభవించునుగాన నట్లుచేయవలదు.

శ్లో॥ స్నేహాద్వాయదివాలోభా ద్భయాందజ్ఞానతోపివా।
కుర్వంత్యనుగ్రహంయేతు తత్పాపంతేషుగచ్ఛతి॥ ౫౬½

౫౬½. ప్రేమచేతనైన ద్రవ్యమునందాసచేతనయిన, భయముచేతనయిన, జ్ఞానముచేతనయిన బలవంతుని ననుగ్రహించిన వానిపాపమా బ్రాహ్మణులం జెందును.

శ్లో॥ శరీరస్యాత్యయే ప్రాప్తే వదంతినియమంతుయె।
మహత్కార్యోపరోధేన నస్వస్థస్య కదాచన॥ ౫౭½

౫౭½. ప్రాణావసానకాలమున బ్రాజాపత్యము మొదలగు వ్రతములు విధించువారా పాపము బొందుదురు. ఏమనిన దేవునిస్మరించుటయను గొప్పకార్యముచెడును.

శ్లో॥ స్వస్థస్యమూఢాఃకుర్వంతి వదంతినియమంతుయే।
తేతస్యవిఘ్నకర్తారః పతంతినరకేశుచా॥ ౫౮½

౫౮½. నెమ్మదిగల శరీరముగలవాని కట్టికార్యహానిలేదు. కాబట్టి వెఱ్ఱివజనః స్వస్థునికి ప్రతినిధిగ తెలివిలేమిచే తాము వ్రతములుచేసి యతనికావశ్యకములుకావ నెప్పవా రతనిపాపము పోకుండచేయుటంబట్టి యపవిత్రమయిన నరకమునంబడుదురు.

శ్లో॥ సఏవనియమంత్యక్త్వా బ్రాహ్మణందోవమన్యతే।
వృథాతస్యోపవాసస్స్యా న్నసపుణ్యేనయుజ్యతే॥ ౫౯½

౫౯½. బ్రాహ్మణుల ననాదరించి తానె యొకవ్రతమును కల్పించుకొని యుపవాసముచేసిన నది నిష్ఫలమగును. పాపమునశింపదు.

శ్లో॥ సఏవనియమోగ్రాహ్యో యద్యేకోపివదేద్ద్విజః।
కుర్యాద్వాక్యంద్విజానాంతు అన్యథాభ్రూణహాభవేత్॥ ౬౦॥

౬౦॥ ధర్మజ్ఞులైన ద్విజులు పెక్కండ్రు ప్రాయశ్చిత్తమును విధించుటముఖ్యము. ఒక్కవిప్రుడయిన నట్టివ్రతమును విధింపజనును. తానె యాలోచించుకొన్న శిశుహత్యవలన గలుగు ప్రత్యవాయమునొందును.

పరాశరస్మృతి.

ప్రాయశ్చిత్తకాండము.

సప్తమాధ్యాయము.

శ్లో॥ అథాతో ద్రవ్యశుద్ధిస్తు పరాశరవచో యథా॥ ½

½. అనంతరము పరాశరుడు పలికినట్లు వస్తువులయొక్క శుద్ధి వక్కాణించెదను.

శ్లో॥ దారవాణాంతు పాత్రాణాం తక్షణాచ్ఛుద్ధిరిష్యతే॥ ౧

౧. కఱ్ఱవస్తువులు చెక్కుటవలన శుద్ధినొందును

శ్లో॥ భస్మనా శుద్ధ్యతే కాంస్యం తామ్రమామ్లేన శుధ్యతి॥ ౧½

౧½. కంచు వెలిమిడిచేతను, రాగిపులుసుచేతను శుద్ధములగును.

శ్లో॥ రజసా శుద్ధ్యతే నారీ వికలం యా న గచ్ఛతి॥ ౨

౨. వ్యభిచరించినస్త్రీ గర్భధారణము లేకుండిన, రజోదర్శనమువలన శుద్ధిచెందును.

శ్లో॥ నదీవేగేన శుధ్యేత లేపో యది న దృశ్యతే॥ ౨½

౨½. వీథులనుండివచ్చిననీరు చేరినయేరు, ప్రవాహవేగముచే కలక పోయినతోడనె పరిశుద్ధిచెందును.

శ్లో॥ వాపీకూపతటాకేషు దూషితేషు కథంచన॥ ౩
ఉద్ధృత్యవై కుంభశతం పంచగవ్యేన శుద్ధ్యతి॥ ౩½

౩-౩½. బావులు, నూతులు, చెరువులు నేహేతువుచేనైన నపవిత్రతనొందిన నూఱుకడవల నీళ్లతోడి పారబోసి, పంచగవ్యములు చల్లినం బవిత్రములగును.

శ్లో॥ అష్టవర్షా భవేద్గౌరీ నవవర్షా తు రోహిణీ।
దశవర్షా భవేత్కన్యా అత ఊర్ధ్వం రజస్వలా॥ ౪½

౪½. ఎనిమిదేండ్లీడుగలకన్య గౌరియనియు, తొమ్మిదేండ్లది రోహిణియనియు, పదియేండ్లది కన్యయనియు బిలువబడును. అటుపిమ్మట రజస్వలయనియు చెప్పబడును.

శ్లో॥ ప్రాప్తేతు ద్వాదశే వర్షే యః కన్యాం న ప్రయచ్ఛతి।
మాసి మాసి రజస్తస్యాః పిబంతి పితరో నిశమ్॥ ౫½

౫½. పండ్రెండవయేడువచ్చినకన్య కెవడు పెండ్లిసేయడో వాని పితరులు నెలనెలయందు నాకన్య రజస్సు త్రావుదురు.

శ్లో॥ మాతాచైవ పితాచైవ జ్యేష్ఠభ్రాతా తథైవచ।
త్రయస్తే నరకం యాంతి దృష్ట్వా కన్యాం రజస్వలామ్॥ ౬½

౬½. కన్య పెండ్లిలేక రజస్వలయైన తల్లి, తండ్రి పెద్దన్న ముగ్గురును నరకము నొందుదురు.

శ్లో॥ యస్తాంసముద్వహేత్కన్యాం బ్రాహ్మణోమదమోహితః।
అసంభాష్యోహ్యపాఙ్క్తేయ స్సవిప్రోవృషలీపతిః॥ ౭౫

౭౫. ఏబ్రాహ్మణుడు, కావరమున నెఱుంగక యాకన్యక పెండ్లాడునో వానితో మాటలాడరాదు. వాని పఙ్క్తినుంచుకొని భుజింపరాదు.

శ్లో॥ యఃకరోత్యేకరాత్రేణ వృషలీసేవనంద్విజః।
సభైక్షభుగ్జపన్నిత్యం త్రిభిర్వర్షైర్విశుధ్యతి॥

౮౫. పెండ్లికాకుండ రజస్వలయైన కన్య వృషలి, దానిమగడు వృషలీపతి యనబడు. ఎవ్వడు వృషలితో నొకరాత్రి సంగమించునో వాడు మూడు సంవత్సరములనుదినము భిక్షాన్నముదిని గాయత్రిజపించిన శుద్ధిజెందును. ౮౫

శ్లో॥ అస్తంగతేయదాసూర్యే చండాలం పతితం స్త్రియమ్।
సూతికాంచ శవంచైవ కథంశుద్ధిర్విధీయతే॥
జాతవేదస్సువర్ణంచ సోమమార్గంవిలోక్యచ।
బ్రాహ్మణానుగతశ్చైవ స్నానంకృత్వా విశుధ్యతి॥

౧౦౫. ప్రొద్దుగ్రుంకినపిమ్మట చండాలుని, పతితుని, పురుటాలిని, పీనుంగును, స్పృశించిన చంద్రుని చూడవలయును. సంభవింపకున్న నగ్నినైన, బంగారునయిన, చూచి బ్రాహ్మణులసమ్మతినిపొంది స్నానముచేసిన శుద్ధిగాంచును. ౧౦౫

శ్లో॥ స్పృష్ట్వారజస్వలాన్యోన్యం బ్రాహ్మణీబ్రాహ్మణీంతథా।
తావత్తిష్ఠేన్నిరాహారా త్రిరాత్రేణైవశుధ్యతి॥

౧౧॥. వాకిటనుండి బ్రాహ్మణస్త్రీ లొకరినొకరు స్పృశించిన స్నానపర్యంతము భోజనములేకుండిన, పవిత్రురాండ్రగుదురు. ౧౧॥

శ్లో॥ స్పృష్ట్వారజస్వలాన్యోన్యం బ్రాహ్మణీ క్షత్రియాంతథా।
అర్థకృచ్ఛ్రంచరేత్పూర్వా పాదమేకంత్వనంతరా॥

౧౨॥. ముట్టుతనైన బ్రాహ్మణస్త్రీయును రాజస్త్రీయు నొండొరులం దాకిన, మొదటిది యరకృచ్ఛ్రమును రెండవదినాల్గవభాగము కృచ్ఛ్రమును నాచరింపవలయును. ౧౨॥

శ్లో॥ స్పృష్ట్వారజస్వలాన్యోన్యం బ్రాహ్మణీవైశ్యజాంతథా।
పాదహీనంచరేత్పూర్వా పాదమేకమనంతరా॥

౧౩॥. వెలపలనుండిన బ్రాహ్మణస్త్రీయు కోమటిస్త్రీయు నన్యోన్యముస్పృశించిన బ్రాహ్మణస్త్రీ ముప్పాతికకృచ్ఛ్రమును కోమటిస్త్రీ పాతికకృచ్ఛ్రమునాచరింపజనును. ౧౩॥

శ్లో॥ స్పృష్ట్వారజస్వలాన్యోన్యం బ్రాహ్మణీం శూద్రజాంతథా।
కృచ్ఛ్రేణశుధ్యతేపూర్వా శూద్రాదానేనశుధ్యతి॥

౧౪॥ విప్రవనితయు శూద్రస్త్రీయు రజస్వలలై పరస్పరము స్పృశించిన పారుత కృచ్ఛ్రముచేతను, శూద్రస్త్రీ దానముచేతను పవిత్రలగుదురు. ౧౪॥

శ్లో॥ స్నాత్వారజస్వలాయాతు చతుర్థేహనిశుధ్యతి।
కుర్యాద్రజో నివృత్తౌతు దైవపిత్ర్యాదికర్మచ॥ ౧౫॥

౧౫॥. రజస్వలయైన స్త్రీ నాల్గవదినమున స్నానముచేసి శుద్ధురాలగును. రజస్సు నివర్తించినపిదప దేవతలయొక్కయు పితరులయొక్కయు కార్యములు చేయనర్హురాలగును.

శ్లో॥ రోగేణయద్రజః స్త్రీణా మన్వహంహి ప్రవర్తతే।
నాశుచిస్సాతతస్తేన తత్స్యాద్వైకాలికంమతమ్॥ ౧౬॥

౧౬॥. ప్రతిదినము స్త్రీలకు రోగవశమున రజస్సుస్రవించిన, దానిచే నపవిత్రత లేదు. అది యకాలమందు గలిగినదిగాన వైకాలికమనబడును.

శ్లో॥ సాధ్వాచారానతావత్స్యా ద్రజోయావత్ప్రవర్తతే।
రజోనివృత్తౌగమ్యాస్త్రీ గృహకర్మణిచైవహి॥ ౧౭॥

౧౭॥. రజస్సు ప్రవర్తించుచుండునంతకాలము, దైవపిత్ర్య కర్మముల వంటమొదలయునవి యాచరింపతగదు. రజస్సు స్రవించుట మానినపిదప సంగమమునందును నింటిపనులు చేయుటయందును యోగ్యతకలుగును.

శ్లో॥ ప్రథమేహనిచండాలీ ద్వితీయేబ్రహ్మఘాతినీ।
తృతీయే రజకీప్రోక్తా చతుర్థేహనిశుధ్యతి॥ ౧౮॥

౧౮॥. మొదటిదినమున చండాలస్త్రీయును, రెండవదినమున బ్రాహ్మణునిచంపిన స్త్రీయును మూడవదినమున చాకితయునుగ పోల్పబడును. నాల్గవదినమున శుద్ధురాలగును.

శ్లో॥ ఆతురేస్నానఉత్పన్నే దశకృత్వోహ్యనాతురః।
స్నాత్వాస్నాత్వాస్పృశేదేనం తతశ్శుధ్యేత్సఆతురః॥ ౧౯॥

౧౯॥. రోగపీడితునకు స్నానముచేయ నావశ్యకముసంభవించిన రోగములేనివాడు పదిమాట్లుస్నానముచేసి ప్రతిపర్యాయమును రోగిని స్పృశించుచు వచ్చిన శుద్ధి కలుగును.

శ్లో॥ ఉచ్ఛిష్టోచ్ఛిష్ట సంస్పృష్ట శ్శునాశూద్రేణవాద్విజః।
ఉపోష్యరజనీమేకాం పంచగవ్యేనశుధ్యతి॥ ౨౦॥

౨౦॥. ఎంగిలిచేసికొన్న బ్రాహ్మణుని నెంగిలిచేసికొన్నబ్రాహ్మణుడు, కుక్క, శూద్రుడు, తాకిన నొకరాత్రి యుపవాసముచేసి పంచగవ్యము పుచ్చుకొన్నశుద్ధిచెందును.

శ్లో॥ అనుచ్ఛిష్టేనశూద్రేణ స్పర్శేస్నానంవిధీయతే।
తేనోచ్ఛిష్టేన సంస్పృష్టః ప్రాజాపత్యం సమాచరేత్॥ ౨౧॥

౨౧॥. ఎంగిలిచేసికొననిశూద్రు డెంగిలిచేసికొననిబ్రాహ్మణుని తాకిన నావిప్రుడు స్నానమువలన శుద్ధుడగును. ఎంగిలిచేసికొన్న శూద్రుడట్టి బ్రాహ్మణునితాకిన ప్రాజా[illegible]పవలయును.

శ్లో॥ భస్మనాశుధ్యతేకాంస్యం సురయాయన్నలిప్యతే।
సురామాత్రేణ సంస్పృష్టం శుధ్యతేగ్న్యుపలేఖనైః॥ ౨౨॥.

౨౨॥. కల్లుతాకినకంచు, తరుముటపట్టుటచేతను కాల్చుటచేతను శుద్ధమగును గాని వెలిమిడితో తోముటచేతనె పవిత్రముగాదు.

శ్లో॥ గవాఘ్రాతాని కాంస్యాని శ్వకాకోపహతానిచ।
శుధ్యంతిదశభిఃక్షారైః శూద్రోచ్ఛిష్టానియానిచ॥ ౨౩॥

౨౩॥. కంచు, ఆవాఘ్రాణించినను, శూద్రుడెంగిలిచేసినను, కుక్కలు కాకులు పాడుచేసినను పదిమాట్లు వెలిమిడితో తోముటచేత పవిత్రమగును.

శ్లో॥ గండూషంపాదశౌచంచ కృత్వావై కాంస్యభాజనే।
షణ్మాసాన్నిక్షిపేద్భూమా వుద్ధృత్యపునరాహరేత్॥ ౨౪॥

౨౪॥. కంచుపాత్రమున పుక్కిటినీరుమిసినను కాళ్లుగడిగినను దాని నారునెలలు భూమిలోబాతిపెట్టి మరల వాడుకొనదగును.

శ్లో॥ ఆయసేష్వాయసానాంచ సీసస్యాగ్నౌవిశోధనం॥ ౨౫

౨౫. ఇనుపవస్తువు లినుపపనిముట్లతో నొఱయుటచేతను సీసమగ్నియందుంచుట చేతను విశుద్ధములగును.

శ్లో॥ దంతమస్థితథాశృంగం రౌప్యసౌవర్ణ భాజనమ్।
మణిపాత్రాణిశంఖశ్చే త్యేతాన్ప్రక్షాళయేజ్జలైః॥ ౨౬

౨౬. దంతములు, ఎముకలు, కొమ్ములు, వెండి, బంగారు, రత్నములు, వీనితో చేయబడిన వస్తువులును శంఖమును నీటితోగడిగిన శుద్ధములగును.

శ్లో॥ పాషాణేతుపునర్ఘర్షః శుద్ధిరేషాహ్యుదాహృతా॥ ౨౬॥

౨౬॥. రాతిచిప్ప మొదలగునవి రాతితోరాచి కడిగిన శుద్ధమగును.

శ్లో॥ మృన్మయేదహనాచ్ఛుద్ధి ర్ధాన్యంవైమార్జనాదపి॥ ౨౭

౨౭. మంటికుండకాల్చుటచేతను ధాన్యమునీళ్లుచల్లుటచేతను శుద్ధములగును.

శ్లో॥ వేణువల్కలచీరాణాం క్షౌమకార్పాస వాససామ్।
ఔర్ణనేత్రపటానాంచ ప్రోక్షణాచ్ఛుద్ధిరిష్యతే॥ ౨౮

౨౮. వెదురుచాపలు మొదలగునవియు, నారచీరలును తెల్లపట్టుబట్టలు, దూదిబట్టలు కంబళి భుజపత్రచర్మములు వీనికి నుదకము చల్లుటచే శుద్ధికలుగును.

శ్లో॥ ముంజోపస్కరశూర్పాణాం శణస్య ఫలచర్మణామ్।
తృణకాష్ఠస్యరజ్జూనా ముదకాభ్యుక్షణంమతమ్॥ ౨౯

౨౯. ముంజగడ్డితో నల్లిన యాసనమును, చేటయును, జనుపనారగోనెలు, పండ్లు, తోళ్లు, కట్టుత్రాళ్ళును జలముప్రోక్షించుటచే శుద్ధములగును. [గశో: